Deccan Land




Deccan


SEP | SEP 2026


సెప్టెంబర్ - 2026
DECCAN LAND, HYDERABAD
169
SEPTEMBER - 2026

PRGI Regn. No. TELTEL/2012/46784
₹30
సంపుటి : 15
సంచిక : 1

# దక్కన్ ల్యాండ్


సామాజిక రాజకీయ మాసపత్రిక







VOL. 15వ వసంతంలో
169 ISSUES నూట అరవై తొమ్మిదవ సంచిక
పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్




SEPTEMBER 2026

కాలాన్ని పలకరిస్తూ.. చరిత్రను లిఖిస్తూ..

## 15వ వసంతంలోకి దక్కన్‌ల్యాండ్






A vibrant journey of learning, growth and unforgettable experiences, shaping generations at Oxford Grammar High School.



## SEPTEMBER 2026

Oxford Grammar School students depicting India's rich cultural tapestry through the regional traditional attire of Indian states on the occasion of the 77th Republic Day celebrations.


Oxford
Grammar High School

#Street No. 13, Himayathnagar, Hyderabad
Ph : 040 2763 6214, +91 99590 20512
www.oxfordgrammarschool.com

ogs FOUNDATIONAL STAGE

45 YEARS OF MERITORIOUS PERFORMANCE


| Sun | Mon | Tue | Wed | Thu | Fri | Sat |
|---|---|---|---|---|---|---|
| | | 1 | 2 | 3 | 4 | 5 |
| 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 13 | 14 | 15 | 16 | 17 | 18 | 19 |
| 20 | 21 | 22 | 23 | 24 | 25 | 26 |
| 27 | 28 | 29 | 30 | | | |
| | | | | | | |

**Important Dates**

4 Sept - Krishna Janmashtami
14 Sept - Vinayaka Chavithi
25 Sept - Ganesh Visarjan

NOTES :


Printed at : Deccan Press, Azamabad, Hyderabad. Ph.+91 90599 50055


Unity in Diversity.




కాలాన్ని పలకరిస్తూ.. చరిత్రను లిఖిస్తూ..


## 15వ వసంతంలోకి దక్కన్‌ల్యాండ్

ఇది 2012 సెప్టెంబర్ నాటి ప్రారంభ సంచిక ముఖచిత్రం. దక్కనీయ సంస్కృతికి ప్రతిబింబం. దక్కన్ పత్రిక గమ్యాన్ని, గమనాన్ని, పత్రిక స్థాపన లక్ష్యాలను సూటిగా పాఠకులకు విశదం చేస్తున్న చిత్రం. 14 సంవత్సరాలు గడిచినా ఈ ముఖ చిత్రం అనేక మంది పాఠకుల హృదయాల్లో పదిలింగా, జ్ఞాపకముండటం దీని విశిష్టత. ప్రముఖులెందరో తమ వ్యాసాల్లో ఈ ముఖచిత్రాన్ని ప్రస్తావించడం మా లక్ష్యం పట్ల, మా ప్రయాణం పట్ల వారికున్న నమ్మకాన్ని నిదర్శనం. 14 వసంతాలను పూర్తిచేసుకొని 15వ సంవత్సరంలోకి అడుగుపెడుతూ ఈ సంచికకు ముఖచిత్రంగా పునర్ముద్రించడం గౌరవంగా భావిస్తున్నాం. మా లక్ష్యం నుంచి వెనుతిరిగేది లేదని, ముమ్మందికే ప్రయాణిస్తామని యిచ్చే హామీగా భావిస్తున్నాం.

TELANGANA RESOURCE CENTRE

"CHANDRAM" 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com website : www.deccanland.com




## తెలంగాణలో తెలుగులిపి!

అశోకుని బ్రాహ్మీ అక్షరాల కంటే ముందే తెలంగాణలో పురుడు పోసుకున్న తెలుగులిపి గురించి మైలురాళ్లు శీర్షికలో రచయిత, స్థపతి ఈమని శివనాగిరెడ్డి లిపి పుట్టుపూర్వోత్తరాలు గురించి తెలియజేయడం అభినందనీయం. యాదగిరిగుట్ట వద్ద ఉన్న రాయగిరిలో తవ్వకాల్లో బయల్పడిన కుండ పెంకులపై గీతలను పరిశోధిస్తే మౌర్యుల కాలపు బ్రాహ్మీ అక్షరాల కంటే ముందే తెలంగాణాలో తెలుగులిపి ఉందని తెలియజేశారు.

– యాదగిరి, వరంగల్

❖ ❖ ❖

## కూరెళ్ళ శ్రీనివాస్ అభినందన సభ

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు, ప్రముఖ చిత్రకరాఉడు కూరెళ్ళ శ్రీనివాస్ ఉద్యోగ విరమణ అభినందన సభ, ఐదు గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం జులై 12న హైదరాబాద్ నగరం నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించడం ఒక జ్ఞాపకంగా, యుగానికి ప్రతీకగా నిలుస్తది. కళాకారులు, కవులు, రచయితలు, విద్యావేత్తలు, పరిపాలనా అధికారులు, మిత్రులు, కళాభిమానులు, శ్రేయోభిలాషులు ఒకే వేదికపై కలుసుకున్న సాంస్కృతిక సమ్మేళనం జాతరలా అనిపించింది. ఉద్యోగ విరమణ అనేది సాధారణంగా ఆ ఉద్యోగి సేవలకు ముగింపు. కానీ కూరెళ్ళ శ్రీనివాస్ విషయంలో మాత్రం ముగింపు కాదు, ఒక కొత్త అధ్యయానికి సృజనాత్మకకు నాంది అని వక్తలు కొనియాడడం ఆయనపై ఉన్న అభిమానం. 'కళా శ్రీనివాసమ్', 'జలవర్ణ జీవ చిత్రం', 'కూరెళ్ళ రేఖాచిత్రాలు', 'చిత్రధ్వని', 'ముఖచిత్రం' అనే ఐదు గ్రంథాలు ఆయన కళా జీవితంలోని ఐదు దశలను ప్రతిబించాయని వారు కొనియాడారు. ఒకటి ఆయన జీవితాన్ని, మరొకటి జలవర్ణ చిత్రాలను, ఇంకొకటి రేఖాచిత్రాలను, మరొకటి కవిత్వ-చిత్రకళల సమన్వయాన్ని, చివరిది పుస్తక ముఖచిత్రాల కళాత్మకతను పరిచయం చేశాయి. ఒకే వేదికపై ఐదు గ్రంథాలు ఆవిష్కరణ కావడం తెలుగు కళా-సాహిత్య చరిత్రలో అరుదైన ఘట్టమని పలువురు వ్యాఖ్యానించడం కూరెళ్ళపై వారికున్న ఆత్మీయత, ప్రేమాభిమానం తెలియజేస్తుంది. కార్యక్రమంలో డా.ఎస్.రఘు, మణికొండ వేదకుమార్, డా.ఎన్.గోపి, డా. ఏనుగు నరసింహారెడ్డి, జివి.శ్యాంప్రసాద్ లాల్, టి. గంగాధర్, పొన్నం రవిచంద్ర, కార్టునిస్ట్ పి. శంకర్, కంభాలపల్లి కృష్ణ తదితరులు వేదికను అలంకరించడంతో సభకు మరింత వన్నె తెచ్చింది.

– బి. వేణుగోపాల్, నల్లగొండ

❖ ❖ ❖

## నిర్వీర్యం అవుతున్న సహకార సంఘాలు

ఒకప్పుడు గ్రామీణాభివృద్ధికి ఎంతో ఉపయోగకరంగా ఉన్న సహకార సంఘాలు మెల్లమెల్లగా కనుమరుగు అవుతున్నాయి. ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే సంఘాలు, డైరీలతో గ్రామీణ ప్రజలకు, రైతులకు ఎంతో మేలు కలిగేలా, ఆర్థిక చేయూత అందించేవిగా ఉండేవి. పాలకులు వాటిని నిర్వీర్యం చేసి ప్రైవేట్ సంస్థలు బలోపేతం అవడానికి అవకాశం అందిస్తున్నారు. ఇందులో భాగంగా మాజీ శాసన సభ్యులు చెన్నమనేని రమేష్ ఆగస్టు నెల దక్కన్‌ల్యాండ్‌లో రాసిన సిరిసిల్ల 'సీఈఎస్ఎస్' గురించి చాలా చక్కగా వ్రాశారు. ప్రజలే నిర్మించుకున్న, ప్రజల ఆస్తిగా కొనసాగుతున్న సంస్థ సీఈఎస్ఎస్‌ను తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ (టీఎస్ఈఆర్సి)ని విలీనం చేయడం ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రజలు నిర్మించుకున్న సంస్థను ప్రజల అనుమతి లేకుండా ప్రభుత్వంలో విలీనం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి, సహకార చట్టాల భావనకు విరుద్ధమని రచయిత తన అభిప్రాయాన్ని వెల్లిబుచ్చారు. సిరిసిల్ల ప్రాంతం కరువు, పేదరికం, నిరుద్యోగ్యం, చేనేత కార్మికులు జీవనోపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే రోజుల్లో ప్రజలంతా ఏకమై 1969లో (సీఈఎస్ఎస్) విద్యుత్ సౌకర్యాన్ని స్వయం ఏర్పాటు చేసుకున్నారు. అప్పట్లోనే ప్రజల నుంచి స్వచ్ఛందంగా సుమారు రూ.1.5 కోట్ల విరాళాలు సేకరించడం అంటే మామూలు విషయం కాదు. అందువల్ల విలీన నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుకోవడంలో ఎలాంటి సందేహం లేదు.

-ఎస్. ప్రవీణ్, సిరిసిల్లా

ద

## పరిశోధకులకు శుభవార్త దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com

- ఎడిటర్

ISSN 2581-3188

విషయసూచిక


# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 15 సంచిక : 1 పేజీలు : 60

సెప్టెంబర్ - 2026



సంపాదకులు

**మణికొండ వేదకుమార్**

9848044713

edit.deccan@gmail.com

సహాయ సంపాదకులు

**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్

**సయ్యద్ ఖైజర్ భాష**

9030626288

వాణిజ్య ప్రకటనలు

**కె. సచిన్**

86866 64949

ఫొటోగ్రాఫర్

**టి.స్వామి**


కవర్‌పేజీ

**15 వసంతాల దక్కన్‌ల్యాండ్**


layout - Composing & Printed @

DECCAN PRESS

ఆజామాబాద్, హైదరాబాద్-500 020

Mobile: 90599 50055

deccanpress.hyd@gmail.com



కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND

"CHANDRAM" 3-6-712/2, St.No. 12,

Himayatnagar, Hyderabad - 500 029

TELANGANA

Mobile: 9030626288

Fax: 040-27635644

E-mail: desk.deccan@gmail.com

website : www.deccanland.com



**కృతజ్ఞతలు**

దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు సలహాలు, సూచనలు అందించిన వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.


# లోపలి పేజీల్లో...



కవర్ స్టోరీ 19వ పేజీలో



ప్రపంచ వారసత్వ గుర్తింపు దిశగా ముడుమాల్ మరో కీలక అడుగు



కల్వకోలు గ్రామ చరిత్ర - శిల్పవైభవం


బహుముఖ ప్రజ్ఞాశీలి మలయశ్రీ ............ ఎసికె. శ్రీహరి ............ 6

15వ వసంతంలోకి దక్కన్‌ల్యాండ్ (ఎడిటోరియల్) ............ వేదకుమార్. యం ............ 7

మార్పు కోసం (2012) (ఎడిటోరియల్) ............ వేదకుమార్. యం ............ 8

కాలం.. ఒక నిర్ధారిత చరిత్ర (2022)(ఎడిటోరియల్) ............ వేదకుమార్. యం ............ 9

తెలంగాణాలో కాకతీయ గణపతి దేవుని శిల్పం ............ ఈమని శివనాగిరెడ్డి ............ 10

అబ్సిడియన్ - అగ్నిమణి ............ చకిలం వేణుగోపాలరావు ............ 11

వ్యాధులు లేని ఉగాదుల కోసం పర్యావరణ అవగాహన ............ డా॥ ఆర్. సీతారామారావు ............ 13

అంతరిక్షరంగంలో అంకుర సంస్థల ఆశాదీపం విక్రమ్-1 ............ పుట్టా పెద్ద ఓబులేసు ............ 15

దక్కన్‌ల్యాండ్ 10 వసంతాలపై ప్రముఖుల అభిప్రాయాలు ............ దక్కన్ న్యూస్ ............ 19

నికల్ మూలకం యొక్క ఖనిజాలు ............ కమతం మహేందర్‌రెడ్డి ............ 27

హిరే బెంకల్ బృహత్ శిలా సమాధుల సముదాయం ............ ఎన్. వంశీమోహన్ ............ 29

ప్రపంచ వారసత్వ గుర్తింపు దిశగా ముడుమాల్ ............ ఖైజర్ భాషా ............ 33

జాంబవంతుడు క్షేత్ర పాలకుడుగా ఉన్న దేవాలయం! ............ డా॥ జి.యస్. రామయ్య ............ 37

మూలాల్లోకి తీసుకెళ్ళే నోస్టాల్జియా కథలు ............ డా॥ మంగారి రాజేందర్ (జింబో) ............ 39

సైన్స్ ఫిక్షన్: భోళాశంకరుడు కె. సదాశివరావు ............ డా॥ నాగసూరి వేణుగోపాల్ ............ 41

కల్వకోలు గ్రామ చరిత్ర-శిల్పవైభవం ............ శ్రీరామోజు హరగోపాల్ ............ 43

కళా సంగమం - ఆర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ............ వెంటపల్లి సత్యనారాయణ ............ 46

బహుజన వర్గాల దార్శనీకుడు-బీపీ మండల్ ............ డాక్టర్ శీలం యాదగిరి ............ 47

మసులీపటాం : ఎలిజిబెత్ వివాహం ............ మహ్మమద్ సిలార్ ............ 49

పేదల తిరుపతి కురుమూర్తి జాతర ............ తంగెళ్ళ శ్రీదేవిరెడ్డి ............ 51

ఎల్‌నినో ప్రభావితమయ్యే దేశాలలో భారతదేశం కూడా ఒకటి ............ షగున్ ............ 55

ప్రతిభావంతుల పెంపకంలో వెనుకబడివున్నామా! ............ ప్రొఫెసర్ బెల్లి యాదయ్య ............ 57



**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, సంస్కృతి, జీవవైవిద్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# బహుముఖ ప్రజ్ఞాశీలి మలయశ్రీ

మలయశ్రీ (ఎస్ మల్లయ్య) 1940లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా, మానకొండూరు మండలం, చెంజెర్లలో పుట్టాడు. ఎంఏ, ఎంవోఎల్, పీహెచ్‌డీ చేసిన ఆయన.. ప్రభుత్వ తెలుగు టీచర్, లెక్చరర్‌గా పనిచేశారు. 50 పైగా పుస్తకాలు రాశాడు. నవ్యసాహిత్య పరిషత్‌ను స్థాపించి ప్రగతి శీల రచయితలకు ప్రతి ఏటా మలయశ్రీ సాహితీ అవార్డు ఇస్తున్నారు. 'కరీంనగర్ జిల్లా తెలుగు సాహిత్య చరిత్ర'తో పాటు అనేక గ్రంథాలు రాసాడు. ఆయన రాసిన కథలు వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. తెలంగాణ తెలుగు భాష ఎంత ప్రాచుర్యమైందో, అంతే విశిష్టమైందని, దానిని నిలబెట్టుకోవడం మన బాధ్యత అని తెలిపాడు.

**తెలంగాణ ఉద్యమానికి చేయూత:** మలయశ్రీ కవిగా తెలంగాణ ఉద్యమంలో పాలు పంచుకున్నారు. తన కవితలు, పద్యాలతో రాష్ట్ర ప్రజలను చైతన్యవంతులను చేశారు. మాతృభాష సంరక్షణ బాధ్యతలు తీసుకున్నారు. తెలుగు భాష సంరక్షణ సమితి స్థాపించి కొనసాగించారు. అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వ హించి చైతన్యం తీసుకొచ్చారు.



**జగమెరిగిన హేతువాది!:** మలయశ్రీ ఇరు తెలుగు రాష్ట్రాల్లో ప్రఖ్యాతి చెందిన హేతువాది. చెప్పింది నిజజీవితంలో ఆచరించి చూపిన మార్గదర్శి. ఆయన నడిచి వచ్చిన తొవ్వ అనితర సాధ్యం. ఆయనే చెప్పుకున్నట్టు భౌతికవాది, లోక విరోధి అనే నానుడికి నిలువెత్తు నిదర్శనం. ఆయన ఉపాధ్యాయ పదవీ విరమణ చేసిన తరువాత కరీంనగర్ పట్టణంలో స్థిరనివాసం ఏర్ప రచుకున్నారు. భౌతిక వాది అనే పత్రికను తీసుకు వచ్చాడు. నవ్య సాహిత్య పరిషత్‌ను స్థాపించి ప్రగతిశీల కవులకు ప్రతిభ కలిగిన రచయితలకు అవార్డులు అందజేశారు.. ఒక సామాన్య కుటుంబంలో జన్మించినా, అసామాన్యంగా తన ప్రతిభ వ్యుత్పత్తులను తెలుగునేల నలు దిశలా వెదజల్లిన మలయశ్రీ శతాధిక గ్రంథకర్త. ఆయన 1974లో రాసిన శాంతి పథం నాటి ఇంటర్మీడియట్ విద్యార్థులకు నాన్ డీటెయిల్ ఉపవాచకంగా ఎన్నిక చేయబడినది.

**తెలంగాణ కథకు ప్రాచుర్యం లేదు:** తెలంగాణ రచయితలు మాండలికాన్ని విస్మరించలేదు. కానీ దానికి తగిన గుర్తింపు లేకపోవడం వల్ల తెలంగాణలో తొలి నుంచి కథలు, నవలలకు పెద్దగా ప్రాచుర్యం పొందలేదని, విప్లవ గీతాల మాండలికం చూసి 1980 తర్వాతనే ఇక్కడి మాండలిక భాషా కథలు వస్తున్నాయని మలయశ్రీ చెప్పారు.. తెలంగాణ మాండలిక భాషలో పల్లెసీమ గేయకావ్యాన్ని 1976లో రాశానని, 1982లో రాసిన తిరుగుబాటు మాండలిక నవలకు విశాలాంధ్ర బహుమతి వచ్చిందని తెలిపారు. 1935 నాటి గోల్కొండ సంచిక మొత్తం కవుల సంచికగానే తయారవడం చూస్తే తెలంగాణలో కథలకు, నవలలకు చాలా తక్కువ ప్రాతినిథ్యం ఇచ్చారని స్పష్టమవు తుందన్నారు. రాసిన కొన్ని కథా, నవలా రచనలు కూడా వెలుగు చూడలేదు. నాడే కాదు ఈనాడు కూడా తెలంగాణ ప్రాంతాన ఇక్కడి వారి పత్రికలు, ప్రచురణ సంస్థలు లేకపోవడం ఇక్కడి రచయితలకు పెద్ద నష్టం, కష్టమనీ.. పత్రికలు, రచయితలు పెరిగి ఇంత ప్రోత్సాహం అందుతున్నది మూడవ తరం తెలంగాణ కథా రచయితలకేనని మలయశ్రీ స్పష్టం చేశారు.

**తెలుగు భాషా ప్రేమికుడు:** 'కరీంనగర్ జిల్లా తెలుగు సాహిత్య చరిత్ర' అనే అంశంపై పరిశోధన చేసి 1995లో డాక్టరేట్ అందుకున్నారు. క్రీ.శ. 946 నుంచి 1995 వరకు కరీంనగర్ జిల్లా వెయ్యేండ్ల సాహిత్య చరిత్రపై లోతుగా పరిశోధించి, అక్షరీకరించారు. గంగాధర మండలం కురిక్యాల బొమ్మలమ్మ గుట్టపై క్రీ.శ. 946 కాలపు జినవల్లభుని త్రిభాషా శాసనంలోని మూడు కంద పద్యాలే తెలుగు సాహిత్యంలో మొదటివనీ, కందం పుట్టింది కరీంనగర్ జిల్లాలోననీ, మలయశ్రీనే తొలిసారి వెలుగులోకి తెచ్చారు. పోతన రచనగా భావించిన 'నారాయణ శతకం' రాసింది 'వెలగందుల నారయ' అని మలయశ్రీ నిరూపించారు. 'శ్రీకృష్ణ శతకం' రచించింది మన ధర్మపురి కాకుత్సం రామాజు కవి అని సాక్ష్యాధారాలతో తేల్చి చెప్పారు. 150కి పైగా గ్రంథాలు రచించారు. ఆయన రచనలు నేటికీ విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. 'బాల సాహిత్యం' ద్వారా చిన్నారుల్లో చదువుపై ఆసక్తి పెంచారు. అతను రాసిన కథలు వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. తెలుగు భాష ఎంత ప్రాచుర్యమైందో, అంతే విశిష్టమైందని, దానిని నిలబెట్టుకోవడం మన బాధ్యత అని తెలిపారు..

**చెరగని పాద ముద్రలు:** ఆయన రచనలలో ముఖ్యమైన గ్రంథాలు. శాంతిపథము 1975, మానవగీతి 1986, సత్యసూక్తం (నాస్తికత్వం ఎందుకు?) 1997, కరీంనగర్ జిల్లా తెలుగు సాహిత్య చరిత్ర, ఐరేణి కుండలు - కథా సంపుటి మొత్తం కలిపి 100 పైగా గ్రంథాలు రచించారు. మలయశ్రీ మరణం హేతువాద సమాజానికి తీరని లోటు.. ముఖ్యంగా కరీంనగర్ సాహిత్య లోకంలో ఆయన అడుగుజాడలు చెరగని పాద ముద్రలు.

– ఎసికె. శ్రీహరి, m : 9849930145
e : ackvs08@gmail.com




# 15వ వసంతంలోకి దక్కన్‌ల్యాండ్

కాలం నుదుటిమీద వర్తమానం చేస్తున్న సంతకం దక్కన్‌ల్యాండ్ మాసపత్రిక. కాలం వెంట, కాలంతో కలసి నడుస్తున్న పత్రిక దక్కన్‌ల్యాండ్. చరిత్ర గర్భంలో దాగివున్న పురాతన శిథిల జ్ఞాపకాలను నేటితరం కళ్ళముందు సజీవంగా నిలుపుతున్న పత్రిక దక్కన్‌ల్యాండ్. దక్కనీ ప్రాంతీయ వైభవాలకు దర్పణం దక్కన్‌ల్యాండ్ పత్రిక.

దక్కన్‌ల్యాండ్ 14 సంవత్సరాలను పూర్తిచేసుకొని 15వ సంవత్సరంలోకి అడుగుపెడుతోంది.

దక్కన్‌ల్యాండ్ ఆవిర్భావం ఒక అనివార్య సామాజిక సందర్భం. సంక్షోభాలూ, సంక్లిష్టతలూ సమాజాన్ని కుదిపేస్తున్న సమయం. ప్రపంచీకరణ దుష్ఫలితాలు నేల నలుచెరుగులా విస్తరిస్తున్న సమయం. వాణిజ్య, వ్యవసాయరంగాలు కార్పొరేటీకరణ వలకు చిక్కిన సమయం. సెజ్‌లు, తాగునీటి కొరత, సాగునీటి కొరత, విద్యుత్, విద్య, వైద్యరంగాలతో తీవ్రమైన సంక్షోభం – వీటికి వ్యతిరేకంగా ప్రజల్లో నిరసన పెల్లుబుకుతున్న సమయం. ఈ సందర్భంలో విస్తృత ప్రజాభిప్రాయాలకు వేదికగా దక్కన్‌ల్యాండ్ మాసపత్రిక 2012 సెప్టెంబర్ నుంచి యిప్పటివరకు నిరాటంకంగా, ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ మీ ముందుకు వస్తున్నది. ISSN సాధించుకుని పత్రికలో అచ్చయ్యే ఆర్టికల్స్‌కు అంతర్జాతీయ సాధికారతను సంపాదించుకున్నది.

ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలకు, తెలంగాణా మలి ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచింది. సాహిత్యం, చిత్రకళ, ఫొటోగ్రఫీ, నృత్యం, జానపద కళలు వంటి సాంస్కృతిక అంశాలకు విశేష ప్రాధాన్యత యిచ్చింది. చరిత్ర, హెరిటేజ్, వారసత్వ సంపద, ప్రకృతి, పర్యావరణం, భౌగోళిక శాస్త్రం, ఖనిజాలు, శాసనాలు, వ్యవసాయ రంగ అంశాలు, న్యాయ సంబంధ అంశాలు – వీటన్నిటితో సమగ్ర పత్రికగా దక్కన్‌ల్యాండ్ అందరి అభిమానాన్ని సంపాదించుకున్నది. పరిశోధక విద్యార్థులకు, పోటీపరీక్షలు రాసే అభ్యర్థులకు కరదీపికగా గుర్తింపు పొందింది. ఉభయ రాష్ట్రాలలోని ఇంటాక్ బాధ్యులు తమతమ ప్రాంతాలలోని చారిత్రక విశేషాలతో మరింత పరిపూర్ణం చేస్తున్నారు.

దక్కన్‌ల్యాండ్ గమ్యాన్ని, గమనాన్ని తెలిపే ప్రారంభసంచిక సంపాదకీయాన్ని, 11వ సంవత్సరంలోకి అడుగిడుతూ రాసిన సంపాదకీయాన్ని ఈ సంచికలో పునర్ముద్రిస్తున్నాం. 10 వసంతాల కృషిని విశ్లేషిస్తూ వివిధ రంగాల మేధావులు రాసిన వ్యాసాలను సంవత్సరం పాటు ప్రతినెలా ప్రచురించాం. 14 సంవత్సరాల దక్కన్‌ల్యాండ్ కృషి గురించి మేధావుల సమీక్షా వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం. వాటిని వచ్చే నెల నుంచి వరుసగా ప్రచురిస్తాం. విజయవంతమైన ఈ ప్రయాణాన్ని యిక ముందూ కొనసాగించగలమని ఆశిస్తూ, పత్రికను ఆదరిస్తున్న పాఠక మహాశయులకు ధన్యవాదాలు తెలుపుకుంటూ....

మీ




(మణికొండ వేదకుమార్)
ఎడిటర్

## ప్రారంభ సంచిక సెప్టెంబర్ 2012 సంపాదకీయం

# మార్పు కోసం...

ప్రపంచీకరణ దుష్ఫలితాలు ఇప్పుడు అన్ని చోట్ల కూడా వెలుగులోకి వస్తున్నాయి. శ్రీకాకుళం మొదలుకొని చిత్తూరు వరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ ప్రజలు ఈ విధమైన ప్రపంచీకరణ యత్నాలను వ్యతిరేకిస్తూనే ఉన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, తాగు, సాగు నీటి కొరత, విద్యుత్ సమస్య, ఫ్లోరైడ్ బాధితులు, పోలవరం, టైగర్ ప్రాజెక్టు, గనులు, సెజ్‌లు, రైతుల భూముల స్వాధీనం... ఇలా ఎన్నో అంశాలు రాష్ట్రాన్ని పట్టి కుదిపేస్తున్నాయి. వ్యవసాయం, వాణిజ్యం, విద్య, వైద్యం... ఇలా ప్రతీరంగంలోనూ ఎంతో వెనుకబాటు, మరెన్నో అక్రమాలు అటు ఆంధ్ర, రాయలసీమ ఇటు తెలంగాణ. మూడు ప్రాంతాల్లోనూ ఎన్నెన్నో సామాజిక సమస్యలు, అలాంటి సమస్యలపై ప్రజల గొంతును ప్రతిధ్వనించేందుకు రూపుదిద్దుకున్నది దక్కన్ ల్యాండ్.




అభివృద్ధికి మార్గదర్శకంగా, ప్రజాభిప్రాయ వేదికగా నిలవాలన్నది మా సంకల్పం తెలంగాణ, ఆంధ్ర, రాయల సీమ.... ఆ మాటకు వస్తే జాతీయంగా, అంతర్జాతీయంగా ఏప్రాంతానికి చెందిన సామాజిక, రాజకీయ అంశమైనా ఆయా ప్రాధమ్యాలను బట్టి దక్కన్ ల్యాండ్లో చోటు చేసుకునే అవకాశం ఉంది. పాలక వర్గాల అక్రమాలు, అధికారుల నిర్లక్ష్యం, హక్కుల ఉల్లంఘన... ఇలా ఎంతో విశాలమైన కాన్వాస్‌పై ప్రజల జీవితానికి, పోరాటానికి అక్షరరూపం ఇచ్చే ఓ చిన్నప్రయత్నమే దక్కన్ ల్యాండ్.

నేడు ప్రపంచీకరణ దుష్ఫలితాలు ఒక్కొక్క రంగాన్నే కబళిస్తూ వస్తున్నాయి. వినియోగవస్తువులు, విద్య, వైద్యం, రిటైల్ రంగం, ఈ క్రమంలో వ్యవసాయం కూడా కార్పొరేటీకరణ బాట పట్టింది. ఒకవైపున వేల ఎకరాల సేద్యపు భూమిని అక్రమంగా ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతున్నారు. మరోవైపున లక్షలాది ఎకరాలకు నీటి సదుపాయం కల్పించడంలో, విద్యుత్ సౌకర్యం అందించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఇటు అధికార పక్షం, అటు విపక్షం కూడా ప్రజలకు అంతగా అవసరం లేని, తక్షణ ప్రాధాన్యం లేని అంశాలపై రాజకీయం చేయడంతోనే సరిపుచ్చుకుంటున్నాయి. దీంతో ప్రజాసమస్యలు మరుగునపడుతు న్నాయి. దేశాన్ని, దేశప్రజలను ఎంతగానో ప్రభావితం చేసే కీలక విధాన నిర్ణయాల్లో ప్రజలకు భాగస్వామ్యం లేకుండా పోతున్నది. అణు విద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించి నష్టపరిహారం చెల్లింపు అంశాన్ని ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఇలాంటి అంశాలను చర్చించేందుకు ఒక వేదిక లేకుండా చేస్తున్నారు. మీడియా కూడా అదే బాట పట్టింది. ఇక చివరి దిక్కుగా మిగిలింది ప్రత్యామ్నాయ మీడియా' మాత్రమే. అందులో భాగంగానే రూపుదిద్దుకుంది 'చక్కన్ ల్యాండ్'.

ప్రజాభిప్రాయాన్ని విస్తృత స్థాయిలో వ్యక్తం చేసేందుకు వీలుగా మేధావులు, విద్యావంతులు, సామాజిక ఉద్యమ కార్యకర్తల నుంచి రచనలను ఆహ్వానిస్తున్నాం. ప్రజాస్వామ్యవాదుల గొంతుక ఇది... ఉద్యమకారుల వేదిక ఇది. పత్రికను మరింత మెరుగ్గా తీర్చిదిద్దేందుకు మీ నుంచి సూచనలనూ కోరు తున్నాం. మా ఈ చిన్న ప్రయత్నానికి మీ సహకారం మాకెంతో అమూల్యం. ఈ పత్రిక మనందరిది. ఈ పోరాటం మనందరిది. ప్రతీ ఒక్కరం నేను సైతం... అని భావించి ప్రజా సమస్యలపై పోరాటానికి ముందుకు రావాల్సిన సమయమిది. అందుకు ప్రతీకగా వెలువడుతున్నదే ఈ పత్రిక మీ నుంచి సానుకూల స్పందన ఆశిస్తూ.....

మీ




(మణికొండ వేదకుమార్)
ఎడిటర్

## పది వసంతాలు పూర్తిచేసుకుని 11వ సంవత్సరంలోకి ప్రయాణం సెప్టెంబర్ 2022

# కాలం... ఒక నిర్ధారిత చరిత్ర

కాలం కేవలం సమయసూచిక కాదు. అది ఒక నిర్ధారిత చరిత్ర. దక్కన్‌ల్యాండ్ మాసపత్రిక ఈ సంచికతో 11వ సంవత్సరంలోకి అడుగుపెడుతుంది. ఈ పది సంవత్సరాల సమయంలో ప్రధాన మీడియాకు భిన్నంగా, ప్రత్యమ్నాయ పత్రికగా సమాజం పట్ల జర్నలిజం నిర్వర్తించవలసిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించింది.

సామాజిక సంక్షోభాలూ, సంక్లిష్టతలూ ముసురులా కమ్మి అన్ని రంగాలనూ కుదిపేస్తున్న సమయంలో ప్రజలకు అవగాహన కల్పించి, చైతన్య పరిచి, ఆచరణ వైపు నడిపించవలసిన ప్రధాన మీడియా తన కర్తవ్యానికి దూరమవుతున్నప్పుడు ఆలోటును భర్తీ చేయడానికి దక్కన్ ల్యాండ్ ఆవిర్భవించింది. ఈ పది సంవత్సరాల సంచికలను ఒకసారి పరిశీలిస్తే మొదటి సంచిక నుంచి ఇప్పటి వరకు ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న తీరు అర్థమవుతుంది. ప్రతి అక్షరం ప్రజల పక్షంగా నిలిచింది. మేధోపరమైన రచనలను అందించింది. రాజ్యాంగ స్పృహ, ఫెడరల్ విధాన ఆచరణ ఆవశ్యకత, ప్రపంచ పరిణామాలను అర్థం చేసుకోవాల్సిన పద్ధతిని తెలియజేసే విశ్లేషణాత్మక వ్యాసాలను అందించింది.




కరోనా విపత్కర కాలంలో కూడా పత్రికను నిర్విఘ్నంగా వెలువరించింది. విపత్తుల నేపథ్యం, మానవజీవన రంగాలన్నిటిలో దాని ప్రభావం, వివిధ వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేసిన తీరు, వాటిని నివారించడానికి తీసుకోవాల్సిన చర్యలు. వీటిని గురించి వివిధరంగాల మేధావులు, సాంకేతిక నిపుణుల ఇంటర్వ్యూలను సంవత్సరం పాటు ప్రతినెలా ప్రచురించింది.

పర్యావరణం, పురావస్తు, వారసత్వ సంపద పరిరక్షణ ఆవశ్యకత, శతాబ్దాలనాటి శాసనాలు, సాంకేతిక విజ్ఞానం, జీవవైవిధ్యం, దక్కన్ చరిత్ర, సాహిత్యం, సాంస్కృతిక కళారంగం, కుల వృత్తులు, సామాజిక న్యాయం వంటి మౌలిక అంశాలకి ప్రాధాన్యతయిస్తూ విలక్షణ పత్రికగా గుర్తింపు పొందింది. అవసరమైన వేళ పలు ప్రత్యేక సంచికలు వెలువరించింది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను గుర్తించడంలోనూ, అది సాధించే ఉద్యమంలో తనవంతు పాత్రను నిర్వర్తించడంలోనూ, విజయం సాధించాక నూతన తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకందించడంలోనూ దక్కన్‌ల్యాండ్ ముందున్నది. పట్టణ, నగర ప్రాంత మేధావులతో పాటు గ్రామీణ స్థాయి సామాజిక కార్యకర్తల వరకూ దక్కన్ ల్యాండ్ చేరుతున్నది. విలక్షణ పత్రికగా ప్రముఖుల ప్రశంసలతో పాటు, విశ్వాసాన్ని సంపాదించుకున్నది.

రచయితలు, మేధావులు, న్యాయ, సాంకేతిక శాస్త్ర నిపుణులు, వాగ్గేయకారులు, చిత్రకారులు, చరిత్రకారులు, పర్యావరణ, పురావస్తు శాస్త్రజ్ఞులు, బుద్ధి జీవులు, శాసన పరిశోధకులు అందించిన రచనా సహకారం విలువైనది. వారికి ఆత్మీయ ధన్యవాదాలు. గత సంచికల నుంచి విలువైన రచనలను, ఈ పది సంవత్సరాల దక్కన్ ల్యాండ్ కృషిని వివరించే, విశ్లేషించే వ్యాసాలను ప్రతినెలా వరుసగా ప్రచురిస్తే బావుంటుందని అభిప్రాయ పడుతున్నాం. దాచుకోవాల్సిన విలువైన, ప్రయోజనకరమైన పత్రికను పదికాలాలపాటు నిలుపుకుందాం. ఎప్పటిలా మీ సహకారాన్ని కోరుతూ...


మీ

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)
ఎడిటర్

# తెలంగాణాలో తొలిసారిగా వెలుగుచూచిన కాకతీయ గణపతిదేవుని శిల్పం

అద్వితీయమైన పాలననందించిన రాజులు, చక్రవర్తులు ప్రజల నోళ్లలో నానుతూనే ఉంటారు. శాసనాలు, నాణేలు, కట్టడాలు, శిల్పాల ద్వారా వారు వెలుగులోకి వస్తుంటారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిమామండపంలోని శ్రీకృష్ణదేవరాయలు, ఆయన భార్యలైన తిరుమలాంబ, చిన్నాదేవి విగ్రహాలను చూచిన నేపథ్యంలో చరిత్రకారులు తమతమప్రాంతాల్లో తమను పాలించిన పాలకుల బొమ్మలు దొరుకుతాయేమోనని చేసిన



ప్రయత్నాల్లో, అశోకుని బొమ్మ సాంచి, కనగనహల్లిలో, మధురలో కనిష్కుని బొమ్మ, నాణేలపై గౌతమీపుత్ర పులుమావి, యజ్ఞశాతకర్ణి సముద్రగుప్తుని బొమ్మలు, మహాబలిపురం ఆలయంపై నరసింహవర్మ మామల్ల బొమ్మ, తంజావూరు బృహదీశ్వరాలయ వర్ణ చిత్రాల్లోని రాజరాజు బొమ్మ, కోణార్క దేవాలయంపై మొదటి నరసింహదేవుని బొమ్మలు బయటికొచ్చాయి. ఆ తరువాత విజయనగర, నాయకరాజుల బొమ్మలు అనేక దేవాలయాలపై వెలుగు చూశాయి. ఎక్కడాలేనన్ని కొత్త, కొంగొత్త ఆనవాళ్ల నందించిన తెలంగాణా, రాజుల పేర్లను ముద్రించిన నాణేలను 2100 సం॥ల ముందే విడుదల చేసి చరిత్రను సృష్టించింది. తెలంగాణాను పాలించిన రాజులు, రాణులు ఎంతోమంది ఉన్నా, శాతవాహనుల తరువాత, వారి బొమ్మల ఆనవాళ్లు కాకతీయుల కాలానికి గానీ బయల్పడలేదు.

అప్పటి వరకూ ముక్కలు చెక్కలైన తెలుగునేలను ఒక్క గొడుగు కిందకు తెచ్చి, సర్వతోభివృద్ధికి బాటలు వేసిన కాకతీయగణపతిదేవుడు, సా.శ.1199 నుంచి 1261-62 వరకూ పాలించి తెలంగాణా చరిత్రను సుసంపన్నం చేశాడు. అదుగో, ఆ గణపతిదేవుడు, తెలంగాణాలో తన శిల్పాన్నందించిన తొలిచక్రవర్తిగా మళ్లీ చరిత్రకెక్కాడు. ఆంధ్రప్రదేశ్‌లోని త్రిపురాంతక దేవాలయ గోడపై రాచగురువు, గోళకీ మఠాధిపతి, శ్రీవిశ్వేశ్వర శివాచార్యునితో పాటు చెక్కిన కాకతీయ గణపతి దేవుని బొమ్మ చరిత్రకారుల దృష్టినాకర్షించింది.

విలక్షణ వాస్తుశైలిలో వందల ఆలయాలను నిర్మించి, వేల శిల్పాలను చెక్కించి, లెక్కలేనన్ని చెరువులు తవ్వించి, దేశీ, విదేశీ వర్తక వ్యాపారాల్ని పోషించి, కవులు, కళాకారులను ఆదరించి, తెలుగు తేజాన్ని నలుదిశలా ప్రసరింపజేసి 'రాయగజకేసరి'గా కొనియాడబడిన కాకతీయగణపతిదేవుని రూపురేఖలు ఎలా ఉంటాయోనని ఎదురు చూచిన పరిశోధకులెందరో!

ఆ ఎదురు చూపులు ఇటీవల తెలంగాణా రాష్ట్రం, సిద్ధిపేట జిల్లా, తోటపల్లిలోని తెలంగాణా వారసత్వశాఖ రక్షిత కట్టడమైన శివాలయం ముందు ఆగిపోయాయి. ఒక శిల్పాన్ని చూచి మురిసిపోయాయి. ఆ శిల్పం ఎవరిదో కాదు కాకతీయగణపతి దేవునిది. ఆ చూపులు ఎవరివో కాదు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో, ఈమని శివనాగిరెడ్డి, కొత్త తెలంగాణా చరిత్ర బృందం, కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్, లాంకోహిల్స్ ప్రాజెక్టు ఎండి సింహాద్రి వెంకటరామారెడ్డి, కొత్త తెలంగాణా చరిత్ర బృందం, సభ్యులు అహోబిలం కరుణాకర్, సామలేటి మహేష్ గార్లవి. ఆ శిల్పం రాజచత్రాల కింద ఉన్న కాకతీయగణపతిదేవుడు, ఆయన భార్య సోమలదేవి, రాజగురువు విశ్వేశ్వరశివాచార్యులదేనన్న నిజం తెలంగాణా చరిత్రలో ఒక మైలురాయి.

తెలంగాణా వారసత్వశాఖ సంచాలకులు ఆచార్య అర్జునరావు కూతాడి గారికి ధన్యవాదాలతో..

-ఈమని శివనాగిరెడ్డి-స్థపతి
m : 9848598446
e : nagireddy@malaxmi.in

# అబ్సిడియన్ – అగ్ని మణి

**భూ**మి మీద దొరికే సహజ గాజుపదార్థాలలో అబ్సిడియన్ అత్యంత ముఖ్యమైనది.

ఇది అగ్నిపర్వతశిల నుండి పుట్టిన గాజు. దీనికి నిర్దిష్ట స్ఫటికనిర్మాణం ఉండదు కాబట్టి దీనిని ఖనిజంగా పరిగణించరు. "మినిరలాయిడ్" గా భావిస్తారు. నిజానికి ఇది రయోలైట్ లావా వేగంగా చల్లబడి ఏర్పడిన గాజు పదార్థమే.

**అబ్సిడియన్ ఏర్పడే విధానం:** అబ్సిడియన్ ఏర్పడాలంటే లావాలో 70% కంటే ఎక్కువ సిలికా ఉండాలి. అది చాలా వేగంగా చల్లబడాలి. నెమ్మదిగా చల్లబడితే స్ఫటికాలు ఏర్పడి రయోలైట్ అవుతుంది. అందుకే అబ్సిడియన్ చాలా అరుదు. సాధారణంగా లావా ప్రవాహపు అంచులలో, అగ్నిపర్వత డోమ్‌ల చుట్టూ మాత్రమే దొరుకుతుంది.



**అబ్సిడియన్‌కు ఆ పేరు ఎలా వచ్చింది?**

Obsiusఅనే పేరు గల రోమన్ అన్వేషకుడు సుమారు 2000 సంవత్సరాల క్రితం ఇథియోపియా నుండి మొదటిసారిగా ఈ నల్లని, మెరిసే రాయిని రోమ్‌కు తీసుకొచ్చాడు. అతని పేరు మీదనే దీనికి Obsidianus Lapis అని పేరు పెట్టారు.

**భౌతిక లక్షణాలు:**

- ఇది ఎక్కువగా నల్లరంగులో ఉంటుంది. గోధుమ, ఆకుపచ్చ, ఇంద్రధనస్సు రంగుల్లో కూడా లభిస్తుంది. గాజులా తళతళ మెరిసే లక్షణం ఉంటుంది.
- Mohs స్కేల్‌పై 5–5.5 గట్టితనం కలిగి ఉంటుంది.
- Conchoidal fracture దీని ప్రత్యేకత. అంటే గవ్వలా నున్నగా, రేజర్‌లా పదునైన అంచులు ఏర్పడేలా పగులుతుంది.
- సాధారణ గాజు కంటే కొంచెం బరువుగా, చల్లగా ఉంటుంది. అంచుల దగ్గర మాత్రమే కొంచెం కాంతి చొరబడుతుంది.

**కూర్పు:** ఇది ఖనిజాలతో కూడిన శిల కాదు, చాలా వేగంగా చల్లబడిన లావా. ప్రధానంగా 70% కంటే ఎక్కువ సిలికా – $SiO_2$ తో పాటు అల్యూమినియం, సోడియం, పొటాషియం, ఇనుము ఉంటాయి. కూర్పు పరంగా రయోలైట్ లావాకు సమానంగా ఉంటుంది.

**ఎక్కడ దొరుకుతుంది:** అధిక సిలికా ఉన్న అగ్నిపర్వత ప్రాంతాలలో దొరుకుతుంది. USA–యెల్లోస్టోన్, ఒరెగాన్, మెక్సికో, ఐస్లాండ్, జపాన్, టర్కీ, ఇథియోపియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో విరివిగా లభిస్తుంది.

**అబ్సిడియన్ రకాలు:** అబ్సిడియన్ చాలా రకాలుగా ఉంటుంది. వాటిలో ముఖ్యమైనవి:

**1. నల్ల అబ్సిడియన్:** పూర్తిగా నల్లగా, అద్దంలా మెరిసే అత్యంత సాధారణ రకం.

**2. మహోగని అబ్సిడియన్:** నల్ల నేపథ్యంలో గోధుమ–ఎరుపు మహోగని రంగుచారలు లేదా మచ్చలు ఉంటాయి.

**3. మంచు పువ్వు అబ్సిడియన్:** నల్లరాయిపై తెల్లని క్రిస్టోబలైట్ గుండ్రనిమచ్చలు మంచుపువ్వుల్లా కనిపిస్తాయి.

**4. ఇంద్రధనస్సు అబ్సిడియన్:** కాంతి పడినప్పుడు నీలం, ఆకుపచ్చ, ఊదా రంగుల ఇంద్రధనస్సు షీన్ కనిపించే రకం.

**5. గోల్డెన్ షీన్ / సిల్వర్ షీన్:** కాంతి కోణాన్ని బట్టి బంగారు లేదా వెండి మెరుపు ప్రతిబింబించే రకం.

**6. స్పైడర్‌వెబ్ అబ్సిడియన్:** నల్ల నేపథ్యంలో సాలెగూడులాంటి గోధుమరంగు సన్నని గీతల నమూనా ఉంటుంది.

**చారిత్రక ఉపయోగాలు:** రాతియుగంలో వీటితో బాణాలమొనలు, కత్తులు వంటి పరికరాలు, ఆయుధాలు తయారు చేసేవారు. మాయన్, అజ్టెక్ నాగరికతలలో బలి ఇచ్చే కత్తులు, అద్దాలుగా ఉపయోగించారు. దీనికి దివ్యశక్తులు ఆపాదించి "దేవతలరాయి"గా పరిగణించారు.

గ్రీస్, రోమ్ నాగరికతలలో శస్త్రచికిత్స పరికరాలుగా, జపాన్ లో సమురాయ్ కత్తులకు పదును పెట్టడానికి ఉపయోగించారు.

**శస్త్రచికిత్స ఉపకరణంగా:** దీని అత్యంత పదునైన అంచు, పగిలేగుణం వల్ల నేటికీ శస్త్రచికిత్స ఉపకరణంగా వాడుతారు.

అబ్సిడియన్ స్కాల్పెల్స్ సున్నితమైన కంటి ఆపరేషన్లలో వాడతారు. ఈ కత్తిఅంచు కేవలం 3 నానోమీటర్ల మందంలో ఉంటుంది. ఇంతకన్నా పదునైన అంచు వేరే ఏ పదార్థంతో ఏర్పాటు చేయలేము. దీని కోతవల్ల కణాలు తక్కువ దెబ్బతినడం వల్ల గాయం త్వరగా మానుతుంది. కాని పదునుతో పాటు పెళుసుగా ఉండటం వల్ల వాడకంలో కొంత జాగ్రత్త అవసరం.

**Gemstone గా:** అనేక నాగరికతలలో అనాదిగా రత్నంగా ఉపయోగించారు. ఇప్పటికీ నల్ల అబ్సిడియన్, ఇంద్రధనస్సు అబ్సిడియన్, గోల్డెన్ షీన్ లతో ఉంగరాలు, లాకెట్లు చేస్తారు.

"రక్షణ రాయి"గా, "గ్రౌండింగ్ స్టోన్" గా, ప్రతికూల శక్తిని పోగొడుతుందని నమ్ముతారు. ధ్యానంలో, రక్షణ తాయత్తులుగా వాడతారు.

**భారతదేశంలో అబ్సిడియన్ లభ్యత:** భారతదేశంలో సజీవ అగ్నిపర్వతాలు అండమాన్ లో తప్ప ఎక్కడా లేవు కాబట్టి సహజ

అబ్సిడియన్ చాలా అరుదు.

- దెక్కన్ ట్రాప్, మహారాష్ట్రలో చిన్న మొత్తంలో దొరుకుతుంది.
- గుజరాత్, రాజస్థాన్‌లలో పురాతన త్రవ్వకాల్లో అబ్సిడియన్ తో చేసిన వస్తువులు దొరికాయి. ఇవి ఇరాన్/ఆఫ్ఘన్ నుండి దిగుమతి అయ్యాయా లేక స్థానికంగా దొరికాయా అనేది స్పష్టంగా తెలియదు.
- లడఖ్ లో టిబెట్ సరిహద్దులో చిన్న మొత్తంలో అబ్సిడియన్ లభిస్తుంది.

గుజరాత్ లోని దక్కన్ ట్రాప్ శిలలలో జునాగడ్ దగ్గర ఉన్న ఒషమా హిల్ వద్ద ఎక్కువగా, పశ్చిమ గిర్నార్, బార్డా, అలేచ్ కొండలలో అక్కడక్కడ కూడా దొరికినట్లు సమాచారం.

దక్షిణ అండమాన్ ఓఫియోలైట్ బెల్ట్‌లో కూడా కొద్దిమొత్తంలో అగ్నిపర్వత సంబంధిత అబ్సిడియన్ ఉన్నట్లు తెలుస్తోంది.

**భారతదేశంలో లభించే ఇతర భూసంబంధిత గాజు పదార్థాలు:** భారతదేశంలో అబ్సిడియన్ తో పాటు మరికొన్ని సహజ గాజు పదార్థాలు కూడా కనిపిస్తాయి:

**టాచిలైట్:** దక్కన్ ట్రాప్‌లో లభించే నలుపు రంగు గాజు. బసాల్ట్ లావా ఆకస్మికంగా చల్లబడటం వల్ల ఏర్పడుతుంది. అబ్సిడియన్ కంటే ఇనుము, మెగ్నీషియం ఎక్కువగా ఉంటుంది.



**సూడో టాచిలైట్:** భూకంపం వల్ల ఏర్పడే తీవ్రమైన ఘర్షణ, వేడివల్ల రాయి కరిగి ఏర్పడే గాజు. హిమాలయ ప్రాంతాలలో ఫాల్ట్ లైన్ల వెంట అక్కడక్కడ కనిపిస్తుంది.

**టెక్టైట్:** ఉల్కాపాతం వల్ల ఏర్పడే సహజగాజు. భారతదేశంలో అరుదుగా బెంగాల్, ఒడిశా ప్రాంతాలలో దొరికినట్లు నివేదికలు ఉన్నాయి.

**పురావస్తు శాస్త్రంలో ప్రాముఖ్యత:** అబ్సిడియన్ పైకి వచ్చిన తర్వాత నీటిని పీల్చుకుని ఉపరితలంపై సన్ననిపొర ఏర్పరుస్తుంది. ఆ పొర మందాన్ని కొలిచి Obsidian Hydration Dating ద్వారా ఆ పనిముట్టు ఎన్నివేల సంవత్సరాల క్రితంది అని కచ్చితంగా చెప్పవచ్చు. అందుకే ప్రపంచవ్యాప్తంగా పురాతన వ్యాపార మార్గాలను కనుక్కోవడానికి అబ్సిడియన్ చాలా ఉపయోగపడింది.

**ఇతర ముఖ్య విషయాలు:** మార్కెట్ లో రకరకాల రంగుల్లో చాలా ఎక్కువ పరిమాణంలో అబ్సిడియన్‌గా అమ్ముతున్న రత్నం నిజానికి కృత్రిమ స్లాగ్ గాజు మాత్రమే. నిజమైన అబ్సిడియన్‌లో చిన్న చిన్న గ్యాస్ బుడగలు, ఫ్లో బ్యాండ్స్ కనిపిస్తాయి.

నిజమైన అబ్సిడియన్ భారతదేశంలో నలుపు రంగులో చిన్న చిన్న రాళ్ళుగా మాత్రమే దొరుకుతుంది.

పరమాణు విస్ఫోటనం వల్ల ఏర్పడే అధిక ఉష్ణోగ్రత వద్ద Trinitite అనే గాజు పదార్థం ఏర్పడుతుంది.

1945లో అమెరికా న్యూ మెక్సికోలో మొదటి అణు బాంబు పరీక్షలో ఎడారి ఇసుక కరిగి ఏర్పడిన ఆకుపచ్చ గాజును ట్రినిటైట్ అంటారు. ఇది మానవనిర్మిత అబ్సిడియన్ లాంటిది. కొద్దిగా రేడియోధార్మికత కలిగి ఉంటుంది.

**మన సాహిత్యంలో కాచ(గాజు)మణులు:** పురాణాల ప్రకారం మణులన్నీ బలి చక్రవర్తి శరీర భాగాల నుండి ఏర్పడినవే.

*"యే పతన్తి నగేన్ద్రేషు పావకాదిత్యవర్చసః ।*
*త్ర తత్రైవ జాయన్తే మణయః పావకప్రభాః ॥"*

గరుడపురాణంలోని ఈ శ్లోకం ప్రకారం బలిచక్రవర్తి యొక్క ఏ భాగాలైతే అగ్ని మరియు సూర్యుని తేజస్సుతో కూడి పెద్ద పర్వతాలపై పడ్డాయో, అక్కడ అగ్ని వలె ప్రకాశించే రత్నాలు పుట్టాయి.

ఈ శ్లోకం ప్రకారం "అగ్ని సంబంధమైన" రాళ్ళు అంటే అగ్నిపర్వత గాజు, టెక్టైట్స్, అబ్సిడియన్ లాంటి సహజ గాజులు పర్వతాలపై స్వర్గం నుండి పడిన తేజస్సునుండి ఏర్పడ్డాయని పురాతన నమ్మకం. వీటిని అన్నింటినీ కలిసికట్టుగా 'అగ్నిమణి, చింతామణి' వంటి పేర్లతో వ్యవహరించారు.

ఇండోనేషియాలోని సుమత్రాదీవులలో లభించే ఒక రకం అబ్సిడియన్ ను 'అగ్నిమన్టైట్' అని పిలుస్తారు. ఈ పదం "అగ్నిమణి"కి దగ్గరగా ఉంది. ఈ దృశ్య అబ్సిడియన్ ను కూడా అగ్నిమణుల జాబితాలో చేర్చవచ్చు.


**ఉపయోగాలు:** పదునైన అంచు వల్ల ఆయుధాల తయారీ, శస్త్రచికిత్స ఉపకరణాల తయారీకి, మెరిసేగుణం వల్ల రత్నంగా, ఆభరణాలు, అలంకరణలో పనికివస్తుంది.

శాస్త్రీయ పరిశోధనకు, ఎలక్ట్రానిక్స్‌లో సబ్‌స్ట్రేట్‌గా, భూగర్భ శాస్త్రంలో అగ్నిపర్వత విస్ఫోటన వేగాన్ని అంచనా వేయడానికి, సేకరణకర్తలకు, అలాగే అనేక నమ్మకాలవల్ల మెటాఫిజికల్ వస్తువుగా కూడా అబ్సిడియన్ ఉపయోగపడుతుంది.

–చకిలం వేణుగోపాలరావు
డిప్యూటి డైరెక్టర్ జనరల్ జిఎస్ఐ(రి)
m: 9866449348
e: venugopal.chakilam1@gmail.com
– శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com

# వ్యాధులు లేని ఉగాదులకోసం పర్యావరణ అవగాహన

వ్యాధులు, రుగ్మతలు లేని సమాజమంటూ ఏదీ లేదు. వ్యాధులు విజృంభించి జనావళిని మట్టుబెట్టిన సందర్భాలు తక్కువేమీ లేవు. ప్రకృతిలో వచ్చే లేదా మానవాళి తెచ్చే ప్రతి మార్పు ఏదో ఒక విపత్తును, ముప్పును ముందువెనుకలుగా మనముందు పెడుతూ వస్తున్నది. వాతావరణంలో వచ్చిన మార్పుల ఫలితాలను వైపరీత్యాలను ప్రపంచం చవి చూస్తూనే ఉంది. అయితే వ్యాధుల గురించి, వాటి నివారణ గురించి వైద్యశాస్త్ర నిపుణులు మాత్రమే తెలుసుకోవాలనేం లేదు. అది అందరూ తెలుసుకోవలసిందే. ఈ దృష్టితో నేనేమో హెలెన్‌థామస్ సంపాదకత్వంలో ఒక విలువైన పుస్తకం వెలువడింది. ఆ పుస్తకం పేరు Malady and Mortality: Illness, Disease and Death in Literary and Visual Culture. ఈ పుస్తకాన్ని 2016 కేంబ్రిడ్జ్ స్కాలర్స్ పబ్లిషింగ్ సంస్థ ప్రచురించింది. అనారోగ్యం, వ్యాధి, మరణాలు అన్నవి కేవలం వైద్య సంబంధిత సమస్యలుగా కాకుండా సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, దృశ్య, తాత్విక సమస్యలుగా పరిశీలించి సాగించిన రచన. నిజానికి మనిషి జీవితంలో అనారోగ్యం, వ్యాధి, మృత్యువు అనేవి తప్పించుకోలేని వాస్తవాలు. మరణం గురించి మాట్లాడటాన్ని ఎక్కువ సందర్భాలలో అంగీకరించం ఇదొక సాంస్కృతిక, సామాజిక అసౌకర్యంగా భావిస్తుంటాం. 350 పేజీల మేరకు విస్తరించిన ఈ గ్రంథం వైద్యం, మానవీయ శాస్త్రాల సంధిని విస్తరింపజేస్తుంది.




చాలా కాలంగా మనం ఇంటర్ డిసిప్లినరీ అనే మాట వింటూ ఉన్నాం. వివిధ అనుశాసనాలను కలిపి పరిశీలించటం అర్థం చేసుకోవటం, విశ్లేషించటం, అవగాహన చైతన్యాలను పొందటం ఈ అంతరశాస్త్రీయ దృష్టి వల్ల జరుగుతుంది. అసలు అనారోగ్యాలను వైద్యుడి దృష్టితో కాకుండా, అనారోగ్యం పాలైన వ్యక్తి, కుటుంబ సభ్యులు, సంరక్షకులు, వైద్యులు, రచయితలు, కళాకారులు, ఫోటోగ్రాఫర్లు, పరిశోధకుల వంటివారి వివిధ అనుభవాల నుంచి పరిశీలించడం ఈ పుస్తకం ప్రత్యేకత. వ్యాధి అనేది ఒక వ్యక్తి శరీరంలో ఏర్పడే జీవప్రక్రియ లోపం మాత్రమే కాదని అది వ్యక్తి సామాజిక గుర్తింపు, కుటుంబ సంబంధాలు, ఆత్మచైతన్యం, శరీర భావన, స్మృతిఇట్లా ఎన్నో అంశాలను వ్యాధి ప్రభావితం చేయగల అనుభవమని ఈ పుస్తకం వివరిస్తుంది.

మెడికల్ సైన్స్ రోగాన్ని డయాగ్నసిస్‌గా చూస్తుంది. రోగికి ఉన్న వ్యాధి ఏమిటి? ఆ వ్యాధి ప్రబలటానికి గల కారణం ఏమిటి? దానికి చికిత్స ఏమిటి? అనే వాటికి జవాబులను దేవులాడుతుంది. అయితే ఈ గ్రంథం వ్యాధితో జీవించడం అంటే ఏమిటి? ఈ ప్రశ్న ద్వారానే పుస్తకంలోని సాహిత్య, సాంస్కృతిక దృష్టి మొదలవుతుంది. వ్యాధి ఒక సామాజిక జీవితాన్ని ఎలా మారుస్తుంది. మరణం కుటుంబంలోను, సమాజ జ్ఞాపకంలోనూ ఎలా నిలిచి పోతుంది. ఇట్లాంటి ప్రశ్నలకు ఇందులోని వ్యాసాలు సమాధానాలు ఇస్తాయి.

ఈ గ్రంథం ముఖ్య విషయం శరీరం, అది అనారోగ్యానికి గురికావటం అనే చర్చను కేంద్రంగా చేస్తుంది. ఆరోగ్యవంతుడైన ప్రతి మనిషి తన శరీరాన్ని సహజమైనదిగా అనుకుంటాడు. వ్యాధి కలిగినప్పుడు శరీరం ఒక్కసారిగా మనది అనే అనుభూతినుంచి మనలను నియంత్రించే వస్తువుగా మారుస్తుంది. అనారోగ్యం కొందరిలో బహిష్కర; సంక్షోభం, సామాజిక విమర్శలాంటి అనుభవాలను కలిగిస్తుంది.

ఈ పుస్తకం 'అనారోగ్యం', 'అస్తిత్వం'ల మధ్య ఉండే సంబంధాన్ని బలంగానే ముందుకు తెస్తుంది. ఆరోగ్యవంతంగా ఉన్నప్పుడు మరణం ఒక దూరమైన భావన. కానీ తీవ్ర అనారోగ్యం కలిగినప్పుడు మరణం ఒక తాత్విక ప్రశ్నగానే కాకుండా వైయక్తిక అనుభవంగానూ మారుతుంది. "నేను ఎవర్ని"? ఈ శరీరం నాదేనా? కాదా? జీవితానికి అర్థం ఏమిటి. మరణానాంతరం ఏమి మిగులుతుంది లాంటి ప్రశ్నలు ముందుకు వచ్చి వైద్య సమస్య అనుకున్నది కాస్తా ఒక అస్తిత్వ సమస్యగా పరిణమిస్తుంది.

ఈ గ్రంథంలోని మరో కీలకాంశం మరణాన్ని చిత్రీకరించే సాంస్కృతిక పద్ధతులు. అంటే సాహిత్యం, ఫోటోగ్రఫీ, సినిమా, దృశ్యకథల కంటే రూపాల్లో మరణాన్ని బట్టి ముగింపుగా కాకుండా స్మృతి, విషాదం, శోకం, కుటుంబ బాంధవ్యం, ఇతర సామాజిక

సంబంధాల రూపంలో చూపిస్తాయి.

ఫోటోగ్రఫీ కూడా శోకాన్ని వ్యక్తీకరించే ఒక సామాజిక భాష అని చెపుతుంది ఒక వ్యాసం. వైద్యశాస్త్రం శరీరాన్ని నయం చేయడానికి ప్రయత్నిస్తే సాహిత్యం, కళ శరీరంలో జీవించే అనుభవాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాయి. ఈ రెండు దృష్టికోణాల మధ్య సంభాషణ అసవరం ఎంత ఉందో ఈ గ్రంథం బలంగా సూచిస్తుంది. వ్యాధి గ్రస్తుడని కేవలం రోగిగానే కాక అనుభవజ్ఞుడైన వ్యక్తిగా చూడాలని గుర్తు చేస్తుంది.

పర్యావరణం గురించి రాస్తూ ఈ గ్రంథ ప్రస్తావన ఏమిటి? అనే ప్రశ్న రావచ్చు. ఇవ్వాళ యావత్ప్రపంచం పర్యావరణ సంక్షోభాల గుప్పిట్లో విలవిల్లాడుతున్నది. అనేక రకాల జీవ జాతుల అంతరింపుల గురించి మనం వింటున్నాం. భూమి రోగగ్రస్థమైంది. భూమాతకు జబ్బు చేసింది. తల్లి అనారోగ్యం పాలైతే పిల్లలు మాత్రం ఆరోగ్యకరంగా ఎలా ఉంటారు. ఇప్పటికే పర్యావరణ సంబంధిత అసమతుల్యత వల్ల అనేక అంటు వ్యాధుల విజృంభణ జరుగుతుంది. ముఖ్యంగా క్యాన్సర్ లాంటి వ్యాధులు తీవ్ర తరం అవుతున్నాయి. ఈ పరిస్థితులలో ప్రతి ఒక్కరికి అనారోగ్యం, మృత్యువు, సమాజం, కుటుంబం అనే విషయాలకు సంబంధించిన అవగాహన అవసరం. ఆ అవసరాన్ని ఈ గ్రంథం కొంతమేరకు తీరుస్తుంది. భూమండలానికి మనిషి చేసిన చెరుపు గురించి పశ్చాత్తాపం కంటే పరిరక్షణ అనే కార్యశీలత కావాలి.

– డా॥ ఆర్. సీతారామారావు
m : 9866563519
e: sitametaphor@gmail.com

# పర్యాటకం: పరిశుభ్రతే ముఖ్యం!

ఎంత బిజిగా ఉన్నా సరే ప్రయాణాలకు సమయం కేటాయిస్తుంటారు చాలామంది. మరికొందరు స్నేహితులతో ప్రయాణించేందుకు ఇష్టపడతారు. కానీ, ప్రతి మనిషి తన జీవితంలో ఏదో ఒక సమయంలో అలసిపోయి కాస్త విరామం కోరుకుంటాడు. ఆ సమయంలో ఎక్కడికైనా టూర్‌కి వెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. పర్యాటకం నేటి కాలంలో చాలామందికి ఒక ఉపాధిగా మారింది. దీనివల్ల చాలామందికి జీవనోపాధి దొరికింది. ప్రపంచంలోని ఏ మూలకు వెళ్లినా మనకు పర్యాటకం కనిపిస్తుంది.




కొత్త ప్రాంతాలను చూడాలనే జిజ్ఞాస, అక్కడి ప్రజల ఆచార వ్యవహారాలు తెలుసుకోవాలనే కోరిక ప్రతి మనిషికీ ఉంటుంది. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి అలా ప్రయాణాలు చేయడం ఒక మధురానుభూతి! అయితే, మన భూమికీ స్థానికులకు హాని కలుగకుండా పర్యావరణహిత పర్యాటకాన్నే అందరూ ప్రోత్సహించాలి.

దేశవ్యాప్తంగానే కాకుండా విదేశాల నుండి కూడా పర్యాటకులు పర్యాటకం వైపు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. పర్యాటక ప్రాముఖ్యత, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక విలువల గురించి అంతర్జాతీయంగా ప్రజలకు అవగాహన కల్పించే దిశగా ఈ టూరిజం డేను నిర్వహిస్తారు. ఈ ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని 1970లో ప్రపంచ పర్యాటక సంస్థ జరుపుకోవడం ప్రారంభించింది. దీని తరువాత మొదటిసారిగా యునైటెడ్ నేషన్స్ వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ వారు 1980లో **'ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని' సెప్టెంబర్ 27న** నిర్వహించడం ప్రారంభించారు.

అప్పటినుంచి ఇప్పటివరకూ వరల్డ్ టూరిజం డేను ఒక్కో ఏడాది ఒక్కో అంశంతో జరుపుకుంటున్నారు. 1980లో అంటే మొదటిసారిగా 'టూరిజం కంట్రిబ్యూషన్ టు ది ప్రిజర్వేషన్ ఆఫ్ కల్చరల్ హెరిటేజ్ అండ్ టు పీస్ అండ్ మ్యూచువల్ అండర్ స్టాండింగ్' అనే పేరుతో టూరిజం డేను నిర్వహించుకున్నారు. ఇలా ప్రతి ఏటా ఒక్కో అంశంతో టూరిజం పట్ల పర్యాటకుల్లో ఆసక్తిని కలిగించే విధంగా ప్రయత్నం చేస్తున్నారు.

ఏదైనా, ఒక ప్రాంతం భరించగలిగిన దానికంటే మించి పర్యాటకులు వస్తే అనేక ఇబ్బందులు తలెత్తుతాయి. ఆ ప్రాంతంపై అన్ని రకాలుగా ఒత్తిడి పెరుగుతుంది. నీటి కొరత సమస్యగా మారుతుంది. అందుకని, సున్నిత యాత్రా స్థలాల్లో పర్యాటకుల తాకిడిని క్రమబద్ధీకరించాలి. ఆ ప్రాంతం రోజుకు ఎంతమందికి ఆతిథ్యం ఇవ్వగలదో అంతమందినే అనుమతించాలి. భూమికీ, గాలికీ, యాత్రా ప్రదేశానికీ, స్థానికులకు పర్యాటకం భారంగా మారకూడదు. ప్రతి ఒక్కరూ ఇలాంటి స్పృహతో నడుచుకోవాలి. ఇందుకోసం పర్యావరణ స్పృహను పెంపొందించే అంశాల్ని పాఠ్యప్రణాళికల్లో చేర్చాలి. ఇలాంటి ప్రయత్నం దీర్ఘకాలంలో సత్ఫలితాలను ఇస్తుంది. ప్రతి ఒక్కరూ పర్యావరణ స్పృహను పెంపొందించుకుని, ఆచరణలో ఆదర్శంగా నిలవాలి. తోటివారినీ ఈ దిశగా ప్రోత్సహించాలి.

**థీమ్:** "పర్యాటకాన్ని పునఃరూపకల్పన చేయడానికి డిజిటల్ ఎజెండా మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్". ఈ వేడుకలకు అధికారిక ప్రాంతీయ ఆతిథ్య కేంద్రంగా అమెరికా ఖండం నిర్దేశించబడింది.

– కొత్వాల్ సచిన్, m : 86866 64949
e: desk.deccan@gmail.com

# భారత అంతరిక్షరంగంలో అంకుర సంస్థల ఆశాదీపం..!

## @విక్రమ్-1

"ఆపిల్ చెట్టు కింద ఉన్నప్పుడు, ఒక పండురాలి, తనపై పడితే, పండిన పండు పైకి వెళ్ళకుండా నేలను ఎందుకు తాకింది" అని తన చిన్న తనంలోనే, వినూత్నంగా ఆలోచించిన న్యూటన్ మహాశయుడు తదనంతర కాలంలో భూమికి గురుత్వాకర్షణ శక్తి ఉంది అని కనిపెట్టడంతో ఈ ఆవిష్కరణ శాస్త్ర సాంకేతిక ప్రపంచంలో ఎలాంటి విప్లవాత్మక పరిణామాలకు నాంది పలికిందో మనందరికీ తెలుసు. ఇదే విధంగా.. భారతీయ యువశాస్త్రవేత్తల మేధస్సులో ఉన్న సృజనాత్మక ఆలోచనలకు గొడుగుపట్టి, అంతరిక్షాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడం ద్వారా అంతరిక్షరంగంలో ఆత్మనిర్భరతను సాధించాలన్న దార్శనికతతో భారత ప్రభుత్వం ఇండియన్ స్పేస్ పాలసీ-2023ను ఆవిష్కరించింది. భారత ప్రభుత్వ విధానాల్లో వచ్చిన ఈ మార్పును అందిపుచ్చుకున్న **పవన్‌కుమార్ చందన, నాగభరత్ డాకా** అన్న యువ భారతీయ శాస్త్రవేత్తలు 2018లో **స్కైరూట్ ఏరోస్పేస్** అన్న అంకుర సంస్థ (స్టార్టప్)ను హైద్రాబాద్ కేంద్రంగా స్థాపించి, అనతికాలంలోనే దానిని యూనికార్న్ (1 బిలియన్ డాలర్ల విలువగల) కంపెనీగా తీర్చిదిద్ది, గత జులై 18న మనదేశం నుండి 'విక్రమ్-1' అన్న తొలి ప్రైవేట్ రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపారు. ఆ విశేషాలను మనమూ తెలుసుకుందాం.




### విక్రమ్-1 అనే పేరు ఎందుకు?

స్కైరూట్ ఏరో స్పేస్ సంస్థ తను అభివృద్ధి చేసిన రాకెట్లను, అంతరిక్షరంగంలో భారత్ సాధించిన విజయాలకు మూలకారకుడైన డా॥ విక్రమ్ సారాభాయ్ గౌరవార్థం "విక్రమ్" అని పేరు పెట్టడం జరిగింది. విక్రమ్-1లో '1' అనగా, స్కై రూట్ ఏరోస్పేస్ సంస్థ పంపే మొదటి రాకెట్ కాబట్టి, దీనికి విక్రమ్-1 అని నామకరణం చేశారు. తొలి ప్రైవేట్ రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపే ఈ కార్యక్రమాన్ని "మిషన్ ఆగమన్" అని పిలుస్తారు.

### విక్రమ్-ఎస్ అంటే

- విక్రమ్-ఎస్‌లో "ఎస్" అంటే సబ్ ఆర్బిటాల్ అని అర్థం. స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ తన తొలి రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపేందుకు చేపట్టిన ఈ సన్నాహక మిషన్‌ను "మిషన్ ప్రారంభ్" అని పిలుస్తారు. దీనిని నవంబర్ 18, 2022న తొలిసారిగా ప్రయోగించారు.
- విక్రమ్-ఎస్ అనేది అంతరిక్షంలోకి వెళ్ళి తిరిగి వస్తుంది, కానీ భూమి చుట్టూ నిర్దిష్ట కక్ష్యలోకి ప్రవేశించదు. స్కైరూట్ సంస్థ భవిష్యత్‌లో తయారు చేయబోయే రాకెట్ల సాంకేతికతను పరీక్షించుకోవడానికి దీనిని ఒక టెస్ట్ వెహికల్ (డెమాన్ స్ట్రేటర్)గా ప్రయోగించారు. ఇది సింగిల్ స్టేజ్ సాలిడ్ ప్రొపల్షన్ రాకెట్.
- కానీ విక్రమ్-1 అంతరిక్ష్యంలోకి ప్రేశించడమే కాకుండా, కస్టమర్ల ఉపగ్రహాలను భూమికి దిగువ ఉండే కక్ష్యలోకి (LEO) విజయవంతంగా ప్రవేశపెట్టగల పూర్తిస్థాయి వాణిజ్య రాకెట్. దీని ఇంజన్‌లో 4 దశలుంటాయి. మొదటి మూడు సాలిడ్ కాగా, నాల్గవది లిక్విడ్ ప్రొపల్షన్ ఇంజన్.

### మిషన్ ఆగమన్ లక్ష్యాలు:

**i) చిన్న ఉపగ్రహాలను కక్ష్యతో ప్రవేశపెట్టడం:** 1 కేజీ నుండి 350 కేజీల బరువుండే నానో, మైక్రో మరియు మినీ ఉపగ్రహాలను 450 కి.మీ. ఎత్తులోని భూదిగువకక్ష్యలో చేర్చడం.

**ii) అధునాతన ఆవిష్కరణలను పరీక్షించడం:** కార్బన్-కాంపోజిట్ నిర్మాణాలు, 3డీ ప్రింటెడ్ లిక్విడ్ ఇంజన్‌లు మరియు రీస్టార్టబుల్ ఆర్బిట్ అడ్జస్ట్‌మెంట్ మాడ్యూల్స్‌తో సహా అత్యాధునిక ఏరోస్పేస్ ఇంజనీరింగ్ సాంకేతికతలను పరీక్షించడం.

**iii) కక్ష్యాసాంకేతికతను నిర్ధారించడం:** విజయవంతంగా కక్ష్యలోకి దూసుకెళ్ళి, ఉప గ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టడం, ప్రయోగసమయంలో కీలకమైన డేటాను సేకరించడం.

**iv) స్పేస్ ఫర్ ఉబర్ ఫ్రేమ్ వర్క్‌ను ఏర్పాటు చేయడం:** స్పేస్ ఫర్ ఉబర్ ఫ్రేమ్‌వర్క్ అనగా అంతరిక్షంలోకి ఉపగ్రహాలను పంపే ప్రక్రియను ఒక సాధారణ క్యాబ్ బుకింగ్ లాగా అత్యంత సులభంగా తక్కువ ఖర్చుతో మరియు డిమాండ్‌పై (On-demand) మార్చే విధానం. ఈ విధమైన ఫ్రేమ్ వర్క్‌ను ఏర్పాటు చేయడం మిషన్ ఆగమన్ ప్రవచిత లక్ష్యాలలో ఒకటి.

### మిషన్ ఆగమన్ - ప్రత్యేకతలు

- మిషన్ ఆగమన్, హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరో స్పేస్ అభివృద్ధిచేసిన విక్రమ్-1, పేలోడ్‌లను విజయవంతంగా లో ఎర్త్ ఆర్బిట్‌లో ప్రవేశపెట్టిన ఇండియా మొట్టమొదటి ప్రైవేట్ రాకెట్‌గా నిలిచింది.
- అమెరికా, చైనాల తరువాత ఒక ప్రైవేట్ సంస్థ స్వతంత్రంగా పేలోడ్‌లను కక్ష్యలోకి ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని సాధించిన మూడవ దేశంగా ఇండియా అవతరించడాన్ని **మిషన్ ఆగమన్** సూచిస్తుంది.
- విక్రమ్-1 22 మీ॥ పొడవు, 1.7 మీ॥ వెడల్పుతో పాటు ప్రయోగ సమయంలో 1.5 టన్నుల బరువు కలిగి ఉంది.
- రాకెట్ ఇందులో 4 దశలను కల్గి ఉంటుంది. మొదటి దశను కలాం-1200 అనీ, రెండవ దశను కలాం-250 అనీ, మూడో దశ కలాం-100 అని పిలుస్తారు. ఈ మూడు దశలనూ ఘన ఇంధనంతో రూపొందించారు. నాలుగో దశలో మోనో మిథైల్ హైడ్రోజన్ (ఎంఎంహెచ్), నైట్రోజన్ టెట్రాక్సైడ్ శక్తితో పనిచేసే

నాలుగు రామన్-1 ఇంజన్ల సమూహంతో రూపొందించారు. ఈ ఇంజన్లు ఖచ్చితమైన కక్ష్య ప్రవేశానికి, తుది కక్ష్య సర్దుబాట్ల కోసం రూపొందించారు. ఏపిజె అబ్దుల్ కలాం, సర్ సి.వి.రామన్ గౌరవార్థం ఇంజన్లకు వారి పేర్లు పెట్టారు.

**పూర్తి స్థాయి కార్బన్ కాంపోజిట్ ఆర్బిటల్ వాహకనౌక:** విక్రమ్‌ను పూర్తి కార్బన్ కాంపోజిట్ పదార్థాలతో నిర్మించారు. సాంప్రదాయ రాకెట్ గ్రేడ్ స్టీల్‌తో పోలిస్తే వీటి బరువు చాలా తక్కువ. అదే సమయంలో దృఢంగా ఉంటాయి. దీని వల్ల రాకెట్ బరువు తగ్గుతుంది. నింగిలోకి మోసుకెళ్ళగల పేలోడ్ సామర్థ్యం పెరుగుతుంది. దేశంలో ఇలా పూర్తి కాంపోజిట్ పదార్థాలతో ఆర్బిటల్ రాకెట్‌ను తయారు చేయడం ఇదే మొదటిసారి.

**మోనో లిథిక్ కార్బన్ కాంపోజిట్ అంచె:** ఈ రాకెట్‌లోని మొదటి దశ దేశంలోనే అత్యంత పొడవైన మోనో లిథిక్ కార్బన్ కాంపోజిట్ అంచెగా చరిత్ర సృష్టించింది. బహుళ సెక్షన్లుగా కాకుండా, ఒకే సమీకృత యూనిట్‌గా తయారు చేశారు.

**త్రీడీ ముద్రిత ఇంజన్:** రాకెట్‌లోని ఆర్బిటాల్ అడ్జస్ట్‌మెంట్ మాడ్యూల్‌ను పూర్తిగా త్రీడీ ముద్రిత పరిజ్ఞానంతో తయారు చేశారు. భారత ఆర్బిటల్ వాహకనౌకలో ఇలాంటి త్రీడీ ముద్రిత ఇంజన్‌ను రూపొందించడం ఇదే మొదటిసారి. రాకెట్‌లోని ప్రధాన దశలు విడిపోయాక ప్రయాణ మార్గంలో అవసరమైన సర్దుబాట్లను చేయడం, పేలోడ్లను కక్ష్యలో ప్రవేశపెట్టడం ఈ మాడ్యూల్ విధి.

**కుదుపులు, ప్రకంపనల పరిమిత తక్కువగా:** రాకెట్ ఒకే యూనిట్‌గా కాకుండా దశలవారీగా పనిచేస్తుంది. ఒక దశ ప్రజ్వలన పూర్తయ్యాక రెండోది పని ప్రారంభిస్తుంది. పనిపూర్తయిన అంచెలు, ఉపగ్రహాలను రక్షించే **పేలోడ్ ఫెయిరింగ్స్** అనే కవచం నిర్దేశిత సమయంలో రాకెట్ నుండి విడిపోవాలి. ఈ ప్రక్రియ సాఫీగా సాగేందుకు **అల్ట్రా-లో షాక్ న్యూమాటిక్ సిస్టమ్**ను విక్రమ్-1లో ఉపయోగించారు. అందువల్ల దశలు వేరేయ్యేటప్పుడు ఉత్పన్నమయ్యే కుదుపులు, ప్రకంపనలు పరిమితంగా ఉంటాయి.

నాలుగు అంచెల విక్రమ్-1 రాకెట్‌ను వేగంగా పెరుగుతున్న చిన్న ఉపగ్రహాల మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకొని నిర్మించారు. ఇది భూ దిగువ కక్ష్యలోకి 350 కిలోలు, సూర్య అనువర్తిత కక్ష్యలోకి 260 కిలోల బరువున్న పేలోడ్‌ను మోసుకెళ్ళగలదు. భూ పరిశీలన, కమ్యూనికేషన్, శాస్త్రసాంకేతికత పరిజ్ఞానం కొరకు ఉపయోగించే శాటిలైట్లను ప్రయోగించడానికి ఇది అనువైనది.

**కక్ష్యలో ప్రవేశపెట్టిన పేలోడ్స్:** విక్రమ్-1 రాకెట్ గ్రహ స్పేస్ అనే సంస్థకు చెందిన **'సోలారాస్'** ఉపగ్రహం, స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థకు చెందిన స్కోప్ ఉపగ్రహం. కాస్మోసర్వ్‌స్పేస్ అనే అంతరిక్ష అంకుర సంస్థకు చెందిన **"ఎంబ్రేస్"** అనే ఉపగ్రహం, జర్మనీకి చెందిన **యూడీ 3 పీపీ అండ్ ఎండీ3 ఆర్ఎన్** అనే ఉపగ్రహం కాస్మోస్ డైమండ్ సంస్థకు చెందిన **కాస్మోక్‌బ్లూమ్** అనే ఉపగ్రహం, వరంగల్‌కు చెందిన అజయ్‌కుమార్ మెట్టవాడ తయారు చేసిన **మైక్రో ఆర్ట్ ట్రిబ్యూట్** అనే కళాత్మక ఉపగ్రహాలను ప్రధాని మోడీ, భారతీయ వ్యోమగాములు, ఇస్రోశాస్త్రవేత్తల చేతిరాతతో కూడిన పోస్ట్‌కార్డులను ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో అమర్చి విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఇందులో **ఎంబ్రేస్** ఉన్న ఉపగ్రహంలో రోబోటిక్ హ్యాండ్‌కు సంబంధించిన పరిజ్ఞానం ఉంది. భవిష్యత్‌లో అంతరిక్ష వ్యర్థాల తొలగింపు ఆపరేషన్ల కోసం దీనిని ఉద్దేశించారు. భూ కక్ష్యలో పాత ఉపగ్రహాలు, రాకెట్ విడిభాగాలు పెరిగి పోతున్న నేపథ్యంలో ఇలాంటి వ్యవస్థను రోదసీలోకి పంపడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**మిషన్ ఆగమన్ ప్రాముఖ్యత:**

**1) అంతరిక్ష రంగ సంస్కరణలకు ఊతం:** మిషన్ ఆగమన్ ఘన విజయం సాధించడం ద్వారా భారత అంతరిక్ష రంగ సంస్కరణలు విజయవంతమైనట్లుగా భావించవచ్చు. భారత ప్రభుత్వం, అంతరిక్ష రంగంలోకి ప్రైవేట్ సంస్థలకు ద్వారాలు తెరుస్తూ 2020లో కీలక నిర్ణయం తీసుకుంది. IN-SPACE (ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ అథరైజేషన్ సెంటర్) స్థాపన మరియు నేషనల్ స్పేస్ పాలసీ-2023 మిషన్ ఆగమన్ విజయానికి సంస్థాగత పునాది వేశాయి.

**2) సురక్షిత వాణిజ్య అంతరిక్ష్య ప్రయోగాలకు ఇండియాను స్థావరంగా మార్చడం:** మిషన్ ఆగమన్ విజయం భారతదేశాన్ని ఇస్రో నేతృత్వంలోని ప్రభుత్వ ఆధారిత అంతరిక్ష నమూనా నుండి పటిష్టమైన ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య నమూనా వైపు మారుస్తుంది. ఇది ప్రపంచ చిన్న ఉపగ్రహ ప్రయోగ మార్కెట్‌లో మెరుగైన వాటాను దక్కించుకోవడానికి భారతదేశానికి వీలు కల్పిస్తుంది.

**3) తక్కువ ఖర్చుతో కూడిన ఆవిష్కరణలు:** త్రీడీ ప్రింటింగ్ మరియు కార్బన్ కాంపోజిట్‌లలో నైపుణ్యం సాధించడం ద్వారా, భారతీయ స్టార్టప్‌లు, అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన అంతరిక్ష సంస్థలు చేసే ఖర్చులో, సగానికన్నా తక్కువ ఖర్చుకే వరల్డ్ క్లాస్ ఏరో స్పేస్ ఇంజనీరింగ్ సేవలను అందించగలమని నిరూపించాయి.

**4) వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి:** అంతరిక్ష రంగంలో అభివృద్ధి చెందుతున్న ప్రైవేట్ ప్రయోగరంగం ఇస్రో యొక్క పీయస్ఎల్వీ మరియు ఎస్ఎస్ఎల్‌వీలపై భారాన్ని తగ్గిస్తుంది. తద్వారా ఇస్రో మరింత లోతైన అంతరిక్ష అన్వేషణ, మానవ సహిత అంతరిక్ష యాత్ర (గగన్‌యాన్) లాంటి అధునాతన పరిశోధన మరియు అభివృద్ధి పరమైన అంశాలపై దృష్టి పెట్టేందుకు వీలు కల్పిస్తుంది.

**5) మల్టీ-స్టార్ట్ సామర్థ్యం:** విక్రమ్-1 ఒకసారి అంతరిక్షంలోకి ప్రవేశించగానే అందులోని ఇంజిన్‌ను అవసరమైనప్పుడు ఆపి, మళ్ళీ ప్రారంభించే (Restartable) సదుపాయం ఉంది. దీనివల్ల వేర్వేరు ఉపగ్రహాలను, వేర్వేరు కక్ష్యల్లో ఖచ్చితంగా ప్రవేశపెట్టవచ్చు.

**6) వేగవంతమైన అసెంబ్లింగ్:** ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో లేదా డిమాండ్ ఉన్నప్పుడు ఈ రాకెట్‌ను కేవలం 24 గంటల్లోనే అసెంబుల్ చేసి ప్రయోగానికి సిద్ధపరచవచ్చు.

**మెరుగైన ప్రైవేట్ రంగ భాగస్వామ్యానికి ప్రభుత్వం చేపట్టిన కీలక సంస్కరణలు:**

- ప్రభుత్వం అంతరిక్షరంగానికి సంబంధించిన తన వ్యవస్థలన్నిటినీ ప్రభుత్వేతర సంస్థలకు బార్లా తెరిచింది. ఉపగ్రహ తయారీ, ప్రయోగసేవలు మరియు తదుపరి కార్యాకలాపాలలో ప్రైవేట్ సంస్థలు పాల్గొనడానికి అనుమతించింది.

**ఇస్రో వాణిజ్య విభాగంగా ఎన్ఎస్ఐఎల్:** ప్రభుత్వం చేపట్టిన ఈ విధానపరమైన సంస్కరణల కారణంగా మెరుగైన అంతరిక్ష వ్యవస్థలను

రూపొందించడానికి, మానవ జీవితాన్ని మరింత సరళీకృతం చేయడానికి సమగ్ర అంతరిక్ష పరిష్కారాలను అందించడానికి మరియు పీయస్ఎల్వీ లాంటి అధునాతన వాహక నౌకల ఉత్పత్తిలో, సాంకేతికత బదిలీ ద్వారా ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్)ను ఇస్రో యొక్క వాణిజ్య విభాగంగా గుర్తించింది.

**సింగిల్ విండో ఏజెన్సీగా ఇన్ స్పేస్ (ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ అథరైజేషన్ సెంటర్):** ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాల వారు అంతరిక్ష కార్యకలాపాలలో పాల్గొనేందుకు వీలు కల్పించడానికి మరియు ప్రోత్సహించడానికి ఒక స్వయం ప్రతిపత్తిగల నియంత్రణా సంస్థగా ఇన్ స్పేస్ పనిచేస్తుంది.

- ప్రభుత్వేతర సంస్థల (నాన్ గవర్నమెంట్ ఎంటిటీస్-NGE) కు ఇస్రో యొక్క పరీక్షా కేంద్రాలు, సాంకేతికత మరియు సాంకేతిక నైపుణ్యాన్ని అందిస్తుంది.
- 2025వ సం॥లో ఇన్స్పేస్ 150 మి॥ డాలర్ల ప్రైవేట్ పెట్టుబడులను సమీకరించింది. 118 సాంకేతితక బదిలీ ఒప్పందాలను అమలు చేసింది మరియు 189 ఉమ్మడి భాగస్వామ్య ఒప్పందాలను ఏర్పాటు చేసింది.




**ఇన్ స్పేస్ చేపట్టిన ఆర్థిక పథకాలు**

**i) ఇన్స్పేస్ సీడ్ ఫండ్ పథకం:** స్పేస్ స్టార్టప్స్ మరియు ఎంయస్ఎంఈలకు ఒక కోటి వరకు గ్రాంట్తో పాటు మార్గదర్శకత్వం, శిక్షణ మరియు నెట్వర్కింగ్ మద్దతును అందిస్తుంది.

**ii) రూ. 100 కోట్ల వెంచర్ క్యాపిటల్ ఫండ్:** ఇన్-స్పేస్ అంకుర సంస్థలకు ప్రారంభ మూలధనాన్ని అందించడానికి, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడానికి మరియు భారతదేశ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను విస్తరించడానికి 1000 కోట్లతో వెంచర్ క్యాపిటల్ ఫండ్ను ప్రారంభించింది.

**iii) రూ. 500 కోట్ల టెక్నాలజీ అడాప్షన్ ఫండ్:** స్వదేశీ అంతరిక్ష సాంకేతికతలను వాణిజ్యకరించడానికి In-Space ఈ నిధిని ప్రవేశపెట్టింది. ఇది స్టార్టప్స్ / ఎంయస్ఎంఈలకు 60% వరకు మరియు పెద్ద పరిశ్రమలకు 40% వరకు నిధులు అందిస్తుంది. (ఒక్కో ప్రాజెక్టుకు గరిష్ఠంగా 25 కోట్లు)

**iv) సరళీకృత విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్డీఐ) విధానం:** ఉపగ్రహ తయారీ మరియు కార్యకలాపాలలో 74%, ప్రయోగవాహనాలు మరియు అంతరిక్ష కేంద్రాలలో 49% మరియు ఉపగ్రహ భాగాలు మరియు వ్యవస్థలలో 100% స్వయంచాలక ఎఫ్డీఐని అనుమతిస్తుంది. ఇది పెట్టుబడి, సాంకేతిక బదిలీ మరియు వ్యాపార సౌలభ్యాన్ని ప్రోత్సహిస్తుంది.

**ఇండియన్ స్పేస్ టెక్ స్టార్టప్స్ ప్రగతి ప్రస్థానంలో కీలకాంశాలు:**

**i) స్టార్టప్స్ వృద్ధి:** భారతదేశ అంతరిక్ష స్టార్టప్ల సంఖ్య 2014లో 1 స్టార్టప్ నుండి 2026 నాటికి 400కు పైగా స్టార్టప్లకు విస్తరించింది.

**మార్కెట్గమనం:** 2030 నాటికి 8.4 బి॥ డాలర్ల నుండి 40-45 బి॥ డాలర్లకు 2040 నాటికి 100 బి॥ డాలర్లకు స్టార్టప్స్ మార్కెట్ వృద్ధి చెందుతుందని అంచనా.

**కార్యాచరణ దిశగా కీలక మైలురాళ్ళు:**

- NSIL భారతదేశపు మొట్టమొదటి వాణిజ్య LVM3 మిషన్ (2022)ను అమలు చేసి, 36 వన్వెబ్ ఉపగ్రహాలను లో ఎర్త్ ఆర్బిట్లోకి ప్రయోగించింది.
- విక్రమ్-ఎస్ (2022) ఇండియా అభివృద్ధి చేసి In-Space ద్వారా ధృవీకరించిన మొట్టమొదటి ప్రైవేట్ రాకెట్ ప్రయోగంగా నిలిచింది.
- అగ్నికుల్ కాస్మోస్ (2024) ప్రపంచంలోనే మొట్టమొదటి ఏకభాగ 3డీ ప్రింటెడ్ క్రయోజెనిక్ ఇంజన్ ప్రదర్శించి, భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ లాంచ్ ప్యాడ్ (**ధనుష్**) నుండి ప్రయోగించిన మొదటి ప్రైవేట్ కంపెనీగా నిలిచింది.
- వ్యవసాయం, విపత్తు నిర్వహణ, వాతావరణ పర్యవేక్షణ మరియు పట్టణ ప్రణాళిక కోసం పిక్సెల్ నేతృత్వంలోని పీపీపీ (PPP) భూ పరిశీలనా ఉపగ్రహాల సమూహాన్ని ఆమోదించింది.
- 2026లో, SSLV సాంకేతికతను HALకు బదిలీ చేయగా **బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్** (డీఆర్డీఓ టెక్నాలజీ డెవలప్మెంట్ ఫండ్ కింద) స్వదేశీ గ్రీన్ ప్రొపల్షన్ సిస్టమ్ను ప్రదర్శించి, సాంకేతిక పరిజ్ఞాన వాణిజ్యకరణ మరియు స్వావలంబనను ప్రోత్సహించింది.

**అంతరిక్షరంగంలో భారత ప్రైవేట్ సంస్థలకు ఉన్న సవాళ్ళు:**

**i) ఒకే అంతరిక్ష కేంద్రం:** భారతదేశం దాదాపుగా పూర్తిగా సతీశ్ధావన్ అంతరిక్ష కేంద్రంపైనే ఆధారపడడం వల్ల, దాని వాణిజ్య ప్రయోగసామర్థ్యం పరిమితంగా ఉంది. బహుళ అంతరిక్ష కేంద్రాలు పనిచేస్తున్న దేశాలతో పోలిస్తే, ఇది ప్రయోగాల వేగంలో పరిమితిని విధిస్తోంది.

**ii) పునర్వినియోగ ప్రయోగసామర్థ్యం లేకపోవడం:** భారతీయ స్టార్టప్లు ప్రస్తుతం ఒకసారి వాడి పడేసే, ప్రయోగ వ్యవస్థలపై ఆధారపడుతుండగా, స్పేస్ ఎక్స్ వంటి పోటీ అంతరిక్ష సంస్థలు పునర్వినియోగ రాకెట్ల ద్వారా ప్రయోగ ఖర్చులను గణనీయంగా తగ్గించాయి. ఇది భారతదేశ ధరల పోటీ తత్వాన్ని ప్రభావితం చేస్తోంది.

**iii) నియంత్రణ లోపించడం:** భారతదేశానికి అంతరిక్ష విధానం -2023 వంటి పారదర్శక విధానం ఉన్నప్పటికీ, అంతరిక్ష కార్యకలాపాల నిర్వహణా చట్టం లేకపోవడం వల్ల బాధ్యత, భీమా, మేధో సంపత్తి హక్కులు మరియు వివాద పరిష్కారాల విషయంలో అనిశ్చితి ఏర్పడి దీర్ఘకాలిక పెట్టుబడులను నిరుత్సాహ పరుస్తోంది.

**iv) ప్రధాన వినియోగదారుల కొరత:** నాసా మరియు అమెరికా

రక్షణశాఖలో ప్రైవేట్ సంస్థలకు హామీతో కూడిన కొనుగోళ్ళను సమకూరుస్తుండగా, భారతీయ స్టార్టప్‌లకు ప్రభుత్వం నుండి మద్దతు కొరవడింది.

**v) కక్ష్య స్థానం మరియు స్పెక్ట్రమ్ పోటీ:** ITU నిర్వహణలో ఉన్న కక్ష్యస్థానాలు మరియు రేడియో స్పెక్ట్రమ్ కోసం భారతీయ ఉపగ్రహ కన్‌స్టలేషన్‌లు, చైనాకు చెందిన **గువాంగ్** మరియు **కియాన్ ఫాన్** వంటి ప్రపంచ మెగా కన్‌స్టలేషన్ల నుండి తీవ్రమైన పోటీని ఎదుర్కొంటున్నాయి. ఇది భవిష్యత్ విస్తరణ అవకాశాలను తగ్గిస్తోంది.

**vi) అంతరిక్ష శ్రేణి దిగుమతులపై ఆధారపడడం:** నాణ్యత గలిగిన అంతరిక్ష శ్రేణి సెమీకండక్టర్లు, రేడియేషన్‌ను తట్టుకోగల ఎలక్ట్రానిక్ పరికరాలు, సెన్సార్లు మరియు ప్రొపల్షన్ భాగాల దేశీయ ఉత్పత్తి పరిమితంగా ఉండడం వల్ల ఈ రంగం ఎగుమతులు నియంత్రణలకు మరియు ప్రపంచ సరఫరా గొలుసు అంతరాయాలకు లోనవుతోంది.

**vii) అంతరిక్ష భద్రత మరియు సుస్థిరత:**

భారతదేశం యొక్క అభివృద్ధి చెందుతున్న ప్రైవేట్ అంతరిక్ష వ్యవస్థకు, అంతరిక్ష శిథిలాలను తగ్గించడానికి, సైబర్ దాడుల నుండి వాణిజ్య ఉపగ్రహాలను రక్షించడానికి మరియు ద్వంద్వ వినియోగ సాంకేతికతలను సురక్షితంగా నిర్వహించడానికి, బలమైన అంతరిక్ష సంబంధిత నిర్వహణా విధానాలు (Space Situational Awareness) అవసరం.



భారత ప్రధాని నరేంద్రమోదీకి 'విక్రమ్-1' నమూనాను బహూకరిస్తున్న స్కై రూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులు పవన్‌కుమార్ చందన, నాగభరత్ డాకా

**ప్రైవేట్ అంతరిక్షరంగ బలోపేతానికి ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలు:**

**i) అంతరిక్ష కార్యకలాపాల చట్టం:** మేధోసంపత్తి హక్కులు, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ మరియు అంతర్జాతీయ బాధ్యత (1972 లయబిలిటీ కన్వెన్షన్ ప్రకారం)లకు సంబంధించిన విషయాలలో చట్టపరమైన మార్గదర్శకత్వం కొరకు పార్లమెంట్ ఒక సమగ్ర అంతరిక్ష చట్టాన్ని రూపొందించాలి.

**ii) స్పేస్ ట్రిబ్యునల్ ఏర్పాటు:** టెలికాం వివాదాల పరిష్కారం మరియు అప్పిలేట్ ట్రిబ్యునల్ (TD SAT) తరహాలో, ప్రపంచ పెట్టుబడి దారులలో విశ్వాసాన్ని పెంపొందించడానికి వాణిజ్యపరమైన అంతరిక్ష వివాదాలు, కక్ష్యలో ఢీకొనడం మరియు స్పెక్ట్రమ్ కేటాయింపు వివాదాలను వేగంగా పరిష్కరించడం కోసం ఒక ప్రత్యేక స్పేస్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలి.

**iii) ప్రధాన వినియోగదారు (యాంకర్ టెనెన్సీ):** ప్రయోగ సేవలు మరియు భూ పరిశీలన (EO) డేటా కోసం దీర్ఘకాలిక, పరిమాణాధారిత సేకరణ ఒప్పందాలపై సంతకం చేయడం ద్వారా ప్రభుత్వం ప్రధాన వినియోగదారు (యాంకర్ కస్టమర్) గా వ్యవహరించే నాసా యొక్క కమర్షియల్ ఆర్బిటల్ ట్రాన్స్‌పోర్టేషన్ సర్వీసెస్ నమూనాను ఇండియా కూడా అనుసరించాలి.

**iv) ADITI (Acing Development of Innovative Technologies with Idex) :** స్టార్టప్‌ల నుండి నేరుగా ద్వంద్వ ఉపయోగ అంతరిక్ష సాంకేతికతలకు (సైనిక స్థాయి ఆప్టికల్ మరియు రాడార్ ఇమేజింగ్ వంటివి) ప్రత్యేకంగా నిధులు సమకూర్చడానికి మరియు సేకరించడానికి ADITI లాంటి పథకాలను వినియోగించుకోవాలి.

**v) సరఫరా గొలుసులు స్వదేశీకరించాలి:** స్పేస్ గ్రేడ్ ఎలక్ట్రానిక్స్, అధునాతన మిశ్రమ పదార్థాలు మరియు పర్యావరణ అనుకూల చోదక వ్యవస్థలను లక్ష్యంగా చేసుకొని ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకాలు (PLI) ప్రారంభించాలి.

**vi) మౌలిక సదుపాయాల ప్రజాస్వామ్యీకరణ:** **కులశేఖర పట్టణం** అంతరిక్ష కేంద్రం నిర్మాణాన్ని వేగవంతం చేయాలి. శ్రీహరికోటపై ఆధారపడడాన్ని తగ్గించేందుకు ప్లగ్ అండ్ ప్లే విధానంలో టెస్టింగ్ మరియు తయారీ సౌకర్యాలతో కూడిన స్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేసేలా రాష్ట్రాలను ప్రోత్సహించాలి.

**vii) పునర్వినియోగ ప్రయోగ సాంకేతికతల తయారీ వేగవంతం:** ప్రపంచ వ్యయ పోటీతత్వాన్ని తట్టుకునేందుకు ప్రైవేట్ రంగ భాగస్వామ్యం అధికం చేయడానికి పునర్వినియోగ ప్రయోగ వాహక (RLV) మరియు తదుపరి తరం ప్రయోగ వాహన (NGLV)ల అభివృద్ధిని ప్రోత్సహించాలి.

**viii) icet మరియు ఆర్టిమిస్ ఒప్పందాలను సద్వినియోగం చేసుకోవాలి:** భారతీయ స్టార్టప్‌లను ప్రపంచ ఏరోస్పేస్ సరఫరా గొలుసులో ఏకీకృతం చేయడానికి, ఇండియా (US-India initlative on critical and emerging technology) (ICET) ను చురుకుగా వినియోగించుకోవాలి. చంద్రుని ఉపరితల అన్వేషణ, పేలోడ్‌ల ప్రయోగం కోసం ఆర్టిమిస్ ఒప్పందాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

**చివరగా:** ఇండియన్ స్పేస్ పాలసీ 2023, సరళీకృత విదేశీపెట్టుబడులు మరియు IN-SPACE ఏర్పాటు లాంటి సంస్కరణల కారణంగా భారత అంతరిక్షరంగం ఇస్రో నేతృత్వ అంతరిక్ష నమూనా నుండి శక్తివంతమైన ప్రభుత్వ-ప్రైవేట్ అంతరిక్ష ఆధారిత వ్యవస్థ వైపు పరివర్తన చెందడం ఆహ్వానించదగ్గ పరిణామం. విక్రమ్-1 ఈ దిశలో ఒక కీలకమైలురాయిగా చెప్పవచ్చు. ఇండియా ఒక అగ్రగామి అంతరిక్ష శక్తిగా ఎదగడం కోసం ప్రభుత్వం కూడా నిరంతర విధాన మద్దతును అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-పుట్టా పెద్ద ఓబులేసు,
స్కూల్ అసిస్టెంట్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
రావులకొలను, సింహాద్రిపురం, కడప,
m : 9550290047
e : obu.jmd@gmail.com






# దక్కన్‌ల్యాండ్ పది వసంతాలు పూర్తి చేసుకున్న వేళ..

# ప్రముఖుల అభిప్రాయాలు

*దక్కన్‌ల్యాండ్ 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సమయంలో వివిధ రంగాల ప్రముఖులు, మేధావులు తమ అమూల్య అభిప్రాయాలను, సూచనలను వ్యాసాలుగా రాసారు. వాటిని దక్కన్‌ల్యాండ్‌లో సంవత్సరం పాటు వరుసగా ప్రతి నెలా ప్రచురించాం. ఆ వ్యాసాల్లోని ప్రధాన అంశాలను 'బైట్లు'గా మీ కందిస్తున్నాం.*

## వారధిగా వర్ధిల్లాలి



మణికొండ వేదకుమార్ 'దక్కన్ ల్యాండ్' పేరుతో సామాజిక, రాజకీయ మాసపత్రికను స్థాపించారు. 2012 సెప్టెంబర్‌లో వెలువడిన తొలిసంచిక ముఖచిత్రం దక్కన్ శిలలు. అంటే పత్రిక విధానం, సంపాదకుడి అభిరుచి ఏమిటో పాఠకులకు ముఖచిత్రం చూస్తే అర్థమైపోయింది. హైదరాబాద్ అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసాన్నీ, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో నడుస్తున్న భాగోతాన్ని ఎండగడుతూ వ్యాసాలు ప్రచురించడం సాహసంతో కూడిన పని. పాలకులకు నచ్చకపోయినా, వారు ఆగ్రహిస్తారని తెలిసినా ప్రజలకు తెలియవలసిన అంశాలను ధైర్యంగా సేకరించి, ప్రచురించడం ఆదర్శమైన పత్రిక బాధ్యత. దీన్ని నెరవేర్చిన కారణంగానే వేదకుమార్ సమాజం నుంచి గౌరవం పొందారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమ వార్తలను తెలంగాణ ఉద్యమ నిర్మాణం, ఎత్తుగడలు, ఉద్యమ కార్యక్రమాల తబ్శీళ్ళు తెలుసుకొనగోరేవారికి 'దక్కన్ ల్యాండ్' సంచికలను తిరగవేస్తే అవసరమైన సమాచారం లభిస్తుంది. ప్రారంభం నుంచి కోవిడ్ మహమ్మారి సృష్టించిన సంక్షోభంలో సైతం నెలనెలా పత్రికను ప్రచురించారు. ఇది సామాన్యమైన విషయం కాదు.

– కొండుభట్ల రామచంద్రమూర్తి, సంపాదకుడు
primepost.in; sakalam.in

## గొప్ప విజయము



తొలి సంచిక ఆవిష్కరణ సందర్భం ఇంకా గుర్తున్నది. ప్రత్యేక తెలంగాణ సాధన విషయాలు చర్చించే ఒక వేదికగా ప్రారంభమై, అనంతర కాలంలో తెలంగాణ కల సాకారమైన అనంతరం తెలంగాణ పునర్నిర్మాణ ప్రక్రియను చిత్రించిన పత్రికగా నిలిచింది. ఈ పదేళ్ల ప్రయాణంలో తెలంగాణ రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితుల మీద విశ్లేషణలు, అవగాహనలు కల్పిస్తూ అనేక రచనలు ప్రచురించింది. లబ్ధ ప్రతిష్టులతో తెలంగాణ వాదులు, రచయితలు, కథకులతో కొత్త ఒరవడితో పత్రికను తీర్చిదిద్దింది. అంతకు ముందు మణికొండ వేదకుమార్ అధ్యయన కేంద్రం ద్వారా తెలంగాణకు సంబంధించిన అన్ని రంగాల ప్రముఖులతో ప్రసంగాలు ఏర్పాటు చేశారు. వాటి నుంచి వచ్చిన ఆదరణ, ప్రేరణతో గడ్డుకాలంలో కూడా ఒక పత్రిక అవశ్యంగా నడపాలని భావించి, తెలంగాణ, దక్కన్ పీఠభూమి సంస్కృతీ, సంప్రదాయాలు, జీవన విధానాలు, ఇక్కడ మరుగన పడిన ప్రదేశాలు, పర్యావరణం, సమస్త రంగాల, సకల జీవనాల ప్రతిబింబంగా పత్రికను రూపుదిద్దాలని భావించి అట్లాగే పదేళ్లు నడిపారు.

– అల్లం నారాయణ
తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్




# దక్కన్ ప్రాంత పునర్ వికాసానికి వాహిక

అత్యంత కీలకమైన సమయంలో సర్వశక్తులూ ఒడ్డి యుద్ధంలో నిలబడ్డ వ్యక్తి వేదకుమార్. ఆయన యుద్ధ సంధ్యలో ప్రారంభించిన 'దక్కన్ ల్యాండ్ పత్రిక' దశాబ్ద ఉత్సవాలు జరుపుకుంటున్న శుభ సందర్భంగా నా శుభాకాంక్షలు. వేదకుమార్ గారికి నా హృదయపూర్వక అభినందనలు. తెలంగాణా సామాజిక అస్తిత్వానికి, సాంస్కృతిక వారసత్వ వైభవానికి, ఈ ప్రాంత పునర్ వికాసానికి వాహికగా నిలబడిన దక్కన్ ల్యాండ్ ప్రారంభమై దశాబ్దం గడిచిపోయింది. తెలంగాణాలో పదేళ్ల పూర్తి చేసుకున్న పత్రికలు చాలా అరుదు. అందునా తెలంగాణా ఉద్యమంలో, తెలంగాణ కోసమే ఆవిర్భవించి, భావ వ్యాప్తికోసం నినదించిన వార, పక్ష, మాస పత్రిక లేవీ పెద్దగా నిలదొక్కుకున్న దాఖలాలు లేవు. దక్కన్ ల్యాండ్ ది ఆ రకంగా అరుదైన రికార్డు. 'పత్రికొక్కటున్న పదివేల సైన్యంబు' అని నార్ల వారు ఎందుకన్నారో తెలియదు గానీ ఈ కాలంలో ఒక్క పత్రిక నిరంతరాయంగా నిర్వహించడం మాత్రం పదివేల సైన్యాన్ని పోషించడంతో, నడిపించడంతో సమానం. అందుకే వేదకుమార్‌కు జేజేలు. మలిదశ తెలంగాణ ఉద్యమం మహోధృతంగా జరుగుతున్న నేపథ్యంలో 2012 లో కోట్లాది గొంతుల బృందగానాన్ని ఆవిష్కరించి, అప్పటి నుంచీ నిర్విరామంగా నెలనెలా వెలు వడుతున్న దక్కన్ ల్యాండ్ ఇప్పుడు మొదటి దశాబ్ది పూర్తి చేసుకోవడం గొప్ప విషయం.




భారతావనికి సంకేత నామంగా ఉన్న దక్కన్ ల్యాండ్ నిజంగానే ఇప్పుడున్న గోదావరి కృష్ణల నుంచి నర్మదా, కావేరీ తీరాలు తాకి ఈ పీఠభూమి అంతటా విస్తరించాలని, భిన్న సంస్కృతులు, భిన్న భాషలు, భిన్న భావాలకు, భిన్న అభిప్రాయాలకు ఒక విశాల వేదికగా ఎదగాలని కాంక్షిస్తూ..

– ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి
m : 9494480888
e: ghantac@gmail.com

## "చరిత్ర పుటల్లో దక్కన్ ల్యాండ్"


ఈ పది సంవత్సరాల కాలంలో ప్రచురితమైన దక్కన్ ల్యాండ్ పత్రికలను పరిశీలిస్తే రెండు ప్రధానమైన మార్పులు అందులో కనిపిస్తవి. ఒకటి 2012-2014 మధ్యకాలంలో వచ్చిన సంచికలలో ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ఏ విధంగా పాలకుల వివక్షకు బలి అవుతూ వొచ్చిందో తెలియజెప్పే రచనలతోపాటు సమస్యల ప్రాతిపదికగా ఉద్యమ నిర్మాణానికి చేపట్టవలసిన దిశానిర్దేశం ఉండేది. 2014లో రాష్ట్రం సాకారమైన పిదప తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన అంశాలతోపాటు ఇక్కడి ప్రాచీన చరిత్ర, విద్య, వైద్యం, పరిశ్రమలు, శాసనాలు, పర్యావరణం, కుటీర పరిశ్రమలు పురావస్తు వారసత్వ సంపద పరిరక్షణ, పర్యాటక రంగం మొదలగు పెక్కురంగాలకు సంబంధించిన రచనలు మనకు కన్పిస్తున్నయి అంటే పత్రిక తన పరిధిని విస్తరించుకుంటుందన్న మాట. ఇది పత్రికకు ఉండాల్సిన లక్షణం. ఇది ముమ్మాటికి ఆహ్వానించదగ్గ పరిణామం కూడా.




– ప్రొ॥ జి.లక్ష్మణ్, m : 98491 36104
e: laxmangadeou@gmail.com

## దక్కన్ ల్యాండ్: ప్రజల పత్రిక

దక్కన్ ల్యాండ్ తన పేరుకు తగ్గట్లుగా ఒక దశాబ్దానికి మించి ఈ ప్రాంతపు భౌగోళిక, సామాజిక, సాంస్కృతిక కథనాలను అందిస్తోంది. సమాజం, చరిత్ర, సంస్కృతి, వారసత్వం పై రచయితలు, పాఠకులను ఒక్కటి చేయడంలో ఈ మాసపత్రిక కీలకపాత్ర పోషించింది. తెలంగాణ తన ఉనికి చాటుకునేందుకు పోరాడుతున్నప్పుడు రాష్ట్ర డిమాండ్ పై విభిన్న కథనాలను ప్రచురించడం ద్వారా నాడు ఎంతో అవసరమైన గొంతుకను వినిపించింది. ఉద్యమకారుల భావోద్వేగాలకు వేదికగా నిలిచింది. అలా చేయడం ద్వారా దక్కన్ ల్యాండ్ తనను తాను ప్రజల పత్రికగా నిరూపించుకుంది. భాష, సమాజం, కళలు, ఆర్కిటెక్చర్‌పై విస్తృత శ్రేణిలో అంశాలను ప్రచురించడం ద్వారా వివిధ సామాజిక వర్గాలకు చెందిన వారందరినీ పత్రిక చేరుకోగలుగుతోంది.




– తడకమళ్ల వివేక్
టీఎస్పీఎస్సీ (తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యులు)
m : 93910 99727, e: tadakamallavivek@gmail.com






# నాడు ఉద్యమ కరదీపిక – నేడు సాంస్కృతిక వేదిక



తెలంగాణ ఉద్యమం మొదలైన తొలినాళ్లలోనే 2012 సెప్టెంబర్‌లోనే దక్కన్‌ల్యాండ్ తొలిసంచిక వెలువడింది. మొదటి సంచిక కవర్ పేజ్ ఫోటో నాకు ఇప్పటికీ బాగా గుర్తుంది. ప్రాచీన చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా పేర్కొంటూ దక్కన్ శిలల ఫోటో వేశారు. మొదటి సంచిక వెలువడడమే సామాజిక రాజకీయ పత్రికగా వెలువడింది. అలాంటి ట్యాగ్ లైన్‌తో వచ్చే పత్రికలకు భిన్నమైన కవర్ పేజ్‌తో రావడమే మొదటిసారిగా నన్ను ఆకట్టుకుంది. ఇక మొదటి సంచికలోనే తమది 'ప్రత్యామ్నాయ మీడియా' అని వేదకుమార్ గారు అన్నారు. ఆ మాట కూడా నిజమే... సంప్రదాయక మీడియాకు ప్రత్యామ్నాయంగా దక్కన్‌ల్యాండ్ వచ్చిందనడంలో సందేహం లేదు.


తెలంగాణ పోరాటానికి అనుకూలంగా రాసేందుకు పెద్ద పెద్ద మీడియా సంస్థలే సందేహిస్తున్న సమయంలో... ఒక వినూత్న మాసపత్రికగా ప్రజల ముందుకు వచ్చిన దక్కన్‌ల్యాండ్ మాత్రం నిర్భయంగా గొంతు విప్పింది. తెలంగాణ ప్రజల పక్షాన నిలిచింది. ఏదైనా ఉద్యమం ముందుకు సాగాలంటే... జరుగుతున్న అన్యాయాలపై సమగ్ర విశ్లేషణ ఉండాలి. అప్పుడు మాత్రమే వాదనలో ముందుకెళ్తూ జరుగుతున్న అన్యాయాలను చాటగలుగుతాం. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై ఒక్కో రంగంలో ఎంతో మంది నిపుణులతో రాయించిన వ్యాసాలు తెలంగాణ పోరాటానికి వేగుచుక్కలై నిలిచాయి.

నీళ్లు... నిధులు... నియామకాలు... ఈ మూడు అంశాలు ప్రధానంగా తెలంగాణ ఉద్యమం తెరపైకి వచ్చింది. దక్కన్ ల్యాండ్ లో మాత్రం ఈ మూడు అంశాలే కాదు... మరెన్నో అంశాలపై తూటాల్లాంటి వ్యాసాలు వచ్చాయి. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత దక్కన్‌ల్యాండ్ నేడు మరింతగా తెలంగాణ చారిత్రక, సామాజిక, సాంస్కృతిక, కళా వేదికగా నిలిచింది.

పత్రిక ముఖ చిత్రాల ఎంపిక లోనూ వేదకుమార్ ది ఒక విశిష్ట శైలి. పత్రిక ప్రారంభం నుంచి నేటి వరకూ అది అలా కొనసాగుతూనే ఉంది. రొటీన్ కు భిన్నంగా... మూసధోరణులకు విరుద్ధంగా చక్కటి చిత్రాలను ఎంపిక చేస్తున్నారు. దక్కన్‌ల్యాండ్ పాత సంచికలను తిరగేస్తుంటే... యావత్ తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పర్యాటకం, వారసత్వం... అంతా కళ్ల ముందు కదులాడుతున్నట్లుగానే ఉంటుంది. రాబోయే సంచికల్లో ఇక ఎలాంటి అంశాలను కవర్ చేస్తారో అనే ఆసక్తి ఉంటుంది. ఇక ముందు కూడా ప్రదర్శించాలని... తద్వారా తెలంగాణ సమాజానికి మరిన్ని విశేషాలను అందించాలని ఆశిస్తున్నాను.

– బోయినపల్లి వినోద్ కుమార్
(తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్)
m : 98480 37689
e: vinodkumarboianapalli@yahoo.com

# దక్కన్ ల్యాండ్ ఈ స్థాయిలో చిరకాలం కొనసాగాలి




గత పదేళ్లుగా మణికొండ వేదకుమార్ గారి సారథ్యంలో దక్కన్ ల్యాండ్ మాస పత్రిక చరిత్ర, సంస్కృతి, తెలుగు భాషా సాహిత్యాలు, ముఖ్యంగా తెలంగాణ భాషా సాహిత్యాలు, వారసత్వ సంపద, సహజ వనరుల పరిరక్షణ, సద్వినియోగం, పర్యావరణం, ప్రకృతి విపత్తులు, నివారణ, జీవ వైవిధ్యం, వ్యవసాయం, విద్యా, వైద్యం, గ్రామీణ పట్టణ ప్రణాళికా తదితర వైవిధ్యభరితమైన అంశాలపై కథనాలు, వ్యాసాలతో పాటు కథలు, జీవితానుభవాలు, బాలల సాహిత్యం ప్రచురించడం అభినందించదగిన అంశం. దక్కన్ ల్యాండ్ పత్రిక వెలువరిస్తున్న ఈ సాహిత్యమంతా విద్యార్థులకు, పరిశోధకులకు, సామాన్య పాఠకులకు కూడా ఎంతగానో ఉపయుక్తంగా ఉంటున్నాయి. తెలంగాణ సాధన కోసం సాగిన ఉద్యమ కాలంలో దక్కన్ ల్యాండ్ పత్రిక ఇచ్చిన మద్దతు, ప్రోత్సాహం అందరు ఎరిగినదే. దక్కన్ ల్యాండ్ ప్రతీ సంచికలో కూడా దాచుకోదగిన ఉన్నత స్థాయిలో వ్యాసాలు ప్రచురణ అవుతున్నాయి. పత్రికకు ISSN గుర్తింపు రావడం వలన పత్రికలో ప్రచురించబడిన వ్యాసాలకు కూడా పరిశోధన స్థాయి ఏర్పడింది. ఇది ఔత్సాహిక పరిశోధకులకు వరం లాంటిది. దక్కన్ ల్యాండ్ పత్రిక ఈ స్థాయిని నిలుపుకుంటూ కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

– శ్రీధర్‌రావ్ దేశ్‌పాండే, m : 94910 60585
e : irrigationosd@gmail.com




# "దక్కన్" సంస్కృతి పరిరక్షణలో దశాబ్ది


కష్టమైన పనినే ఇష్టంగా మలచుకునే వ్యక్తిత్వం దక్కన్ ల్యాండ్ సంపాదకుడు మణికొండ వేదకుమార్‌ది. తెలంగాణ ఉద్యమం తీవ్రస్థాయిలో కొనసాగుతున్న కాలంలో సైతం ప్రతివారం ఏదో ఒక అంశంపై సంబంధిత నిపుణులను వక్తలుగా ఆహ్వానించి క్రమం తప్పకుండా నిర్వహించిన అనుభవం మిత్రులు వేదకుమార్‌కున్నది. తెలుగు పత్రికల్లో 'దక్కన్‌ల్యాండ్' పత్రికకు ఒక ప్రత్యేకత ఉంది. ఇతర పత్రికల వలె చదివి పారేసే పత్రిక కాదిది. శాశ్వతంగా స్వంత గ్రంథాలయంలో పరిశోధకుల కోసం, భవిష్యత్ తరాల కోసం భద్రపర్చుకునే అమూల్య సంపద 'దక్కన్ ల్యాండ్' పత్రిక. ప్రారంభ సంచిక నుండి 124వ సంచిక (డిసెంబర్ 2022) వరకు ప్రతి సంచికలో తన లక్ష్యాన్ని ప్రకటించుకున్న సంపాదకవర్గం పర్యావరణ, వారసత్వ సంపద పరిరక్షణ కోసం, రాజకీయార్థిక సామాజిక, జీవవైవిధ్య అభిప్రాయ వేదికగా పలు భిన్నాభిప్రాయాల వ్యాసాలను ప్రచురించింది. వివిధ సమస్యల పరిష్కారం కోసం పాఠకుల్లో అవగాహనను పెంపొందించడం కోసం నిపుణుల అభిప్రాయాలను అందించింది. సమాజం పట్ల ప్రేమ, భవిష్యత్తుపై ఆశావాహ దృక్పథం, బడిపిల్లలపై బాధ్యత, మానవత్వం, నిబద్ధత ఉంటే తప్ప 'దక్కన్ ల్యాండ్' లాంటి పత్రికలను చూడలేము, వెలువరించలేము. ఎప్పటికప్పుడు సమాజ అవసరాలను గ్రహించి అవసరమైన సాహిత్య సృష్టిని కొనసాగిస్తున్న దక్కన్‌ల్యాండ్ మరెన్నో దశాబ్దాలు ఇలాగే నెలనెలా వెన్నెలలా వెలుగులను ప్రసరిస్తూ తమస్సు నుండి తేరుకునే స్పృహను ప్రజల్లో కలిగించాలని, జనబాహుళ్యపు జీవన వికాసానికి స్ఫూర్తి నందించాలని కోరుకుంటూ... దక్కన్‌ల్యాండ్ బృందానికి, ఆదరిస్తున్న బుద్ధిజీవులకు మనఃపూర్వక అభినందనలు.




**– వి. ప్రకాశ్,** m : 90009 50400
e: telangana.prakash@gmail.com

# అశేష తెలంగాణ ప్రజల అస్థిత్వ దర్పణం

దక్కన్‌ల్యాండ్ పత్రిక ఆవిర్భావం అకస్మాత్తుగా వచ్చిన ఒక ఆలోచన అని నేను అనుకోవడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక రాష్ట్ర సాధనకు ఉద్యమం రకరకాల పద్ధతుల్లో ఉవ్వెత్తున లేచిన నేపథ్యంలో హిమాయత్‌నగర్‌లోని చారిత్రక 'చంద్రం' నివాసంలో ఒక విన్నూతనమైన కార్యక్రమం ప్రారంభం అయింది. అదే తెలంగాణ రిసోర్స్ సెంటర్ TRC - Charcha కార్యక్రమం. 2012 జనవరిన "ప్రస్తుత తెలంగాణ ఉద్యమంలో మహిళలపాత్ర" అనే అంశంతో ప్రారంభం అయిన చర్చ రెండు వందల శనివారాల రోజుల్లో సాయంత్రాలు తెలంగాణకు సంబంధించిన వైవిధ్యమయిన అంశాలపై చర్చ జరిగింది. ఈ ప్రక్రియను చర్చ అనే కంటే తెలంగాణ ఆత్మగౌరవం, తెలంగాణా అస్థిత్వం, తెలంగాణా వనరుల లూటీకి సంబంధించిన బ్రహ్మాండమైన "మేథోమథనం" అనడం సబబుగా ఉంటుంది. దాదాపు 700 వరకు తెలంగాణ మరియు ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఆలోచనాపరులు, రాజకీయనాయకులు, కార్యకర్తలు ఇందులో వక్తలుగా ఉపన్యసించారు. చాలా ఆవేశంగా, ఆవేదనతో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని లెక్కలతో సహా కూలం కషంగా వివరించి చర్చకు దోహదం చేసారు.




ఈ తరుణంలోనే 'చర్చ' ప్రధాన సూత్రధారి వేదకుమార్‌గారు, 'చర్చ'ను వేరే యితర మీడియంలో చరిత్రలో రికార్డు చేయాలి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా ఈ చర్చ కొనిసాగించాలని సంకల్పించు కున్నట్టున్నారు. దాని ఫలితమే 'దక్కన్‌ల్యాండ్' సామాజిక మాసపత్రిక ఆవిర్భావం. తెలంగాణపట్ల అంచంచలమైన గౌరవం ఉన్న పత్రికారంగంలో అనుభవం ఉన్న వ్యక్తుల సహకారంతో వేదకుమార్‌గారు ఈ పత్రికను వినూత్న రీతిలో తెస్తున్నారు. అన్ని సంచికలు విషయాల వివరణ, వ్యాసాలలో దేనికదే ప్రత్యేకం.

తెలంగాణకు సంబంధించిన విజ్ఞానాన్ని, చరిత్రను అంతా ఒక నిధిలా అక్షరాలలో ఈ సంచికలలో నిర్వాహకులు భద్రపరిచారు. ఈ వ్యాసాలన్ని ఆషామాషీగా రాసినవి కావు. రాసినవారు, విశ్లేషకులు అందరూ విషయాలపట్ల పూర్తి అవగాహన, తెలంగాణ అంశాలపట్ల నిబద్ధత కలిగిన వ్యక్తులు.

పత్రిక ప్రారంభ సంచికలో నిర్వాహకులు "ప్రజాభిప్రాయాన్ని విస్తృత స్థాయిలో వ్యక్తం చేసేందుకు వీలుగా, విద్యావంతులు, సామాజిక ఉద్యమ కార్యకర్తల నుండి రచనలు ఆహ్వానిస్తున్నాం. ప్రజాస్వామ్య వాదుల గొంతుక ఇది. ఉద్యమకారుల వేదిక ఇది" అని ప్రకటించారు. ఈ ప్రకటనలో అకాంక్షను పూర్తిగా ఈ పత్రిక అమలు పరచినందుకు సంతోషంగా ఉంది.

**–యస్.జీవన్ కుమార్,** మానవ హక్కుల వేదిక
m : 9848986286
e: kumjeevan@gmail.com






# తెలుగు పాఠకుల గుండెల్లో నిలిచిన దక్కన్ ల్యాండ్




తెలంగాణ ఉద్యమ సందర్భంగా చర్చా కార్యక్రమాన్ని ప్రారంభించి దాదాపు 200ల సమావేశాలు నిర్వహించి అనేక సమస్యలపై వివిధ వర్గాలకు, ఉద్యమాలకు బాధ్యత వహిస్తున్న శక్తులను పిలిపించి సమాజానికి అనేక విషయాలపై ఉన్న సందేహాలను, అనుమానాలను నివృత్తి చేసి సమస్యల పట్ల పోరాడే స్ఫూర్తిని కలిగించి, తెలంగాణ సాధించడంలో చర్చ నిర్వహించిన పాత్ర మరువలేము. దక్కన్ పత్రికలో వచ్చిన ప్రతి వ్యాసం పాఠకులకు అనేక కోణాలను ఆవిష్కరించి తన మార్గాన్ని ఎంచుకొని కార్యాచరణకు సిద్ధం కావడానికి ఒక మార్గం సృష్టించిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత వచ్చే పరిణామాలను అభివృద్ధిని చాలా స్పష్టంగా అనేక మంది వ్యక్తులు తమ అభిప్రాయాల ద్వారా వివరించి ఉద్యమానికి వన్నెతెచ్చిన విషయం మరువరానిది. దక్కన్ పత్రిక దశాబ్ద కాలం ప్రచురించిన వ్యాసాలన్నీ కేవలం చదవడానికి కాకుండా పరిశోధనకు ఉపయోగించు కోవడానికి, విద్యార్థులు ఉద్యమానికి సంబంధించిన సామాజిక సమస్యల పట్ల అవగాహన పెంచుకోవడానికి ఒక ఆయుధంగా ఉపయోగపడుతుంది. సంపాదకవర్గం నిర్ణయించుకున్న సామాజిక ఎజెండా మేరకు పర్యావరణం, వాతావరణ సమతుల్యత, వారసత్వ సంపద పరిరక్షణ, రాజకీయ సామాజిక సమస్యల పరిష్కారం కోసం వివిధ కార్యాచరణలు నిర్ణయించుకోవడం ఒక గొప్ప సాహసం.

**– దేవి ప్రసాద్,**
మాజీ అధ్యక్షులు తెలంగాణ ఎన్జీవోస్ యూనియన్
m : +91 90006 33404
e: tngodeviprasad@gmail.com

# మణికొండ వేద స్వప్నం – దక్కన్ ల్యాండ్





చరిత్ర, సంస్కృతి, నాగరికతలనేవి వొట్టి పదాలు కావు. వాటికి మానవాళి కల్పించుకున్న అర్థాలు ఏవైనా చేసుకున్న వ్యాఖ్యానాలు ఎలా ఉన్నా వాటి వాటి అంతరంగాలను, మూలాలను సరైన పద్ధతిలో తెలుసుకోక పోవటం వల్ల వాటిల్లగల నష్టాలు, జరగగల విధ్వంసాలు, ముంచుకు రాగల విపత్తులను అంచనా వేసుకోవటానికి, వాటిని ముందుగానే గుర్తించి పరిహరించు కోవటానికి కావలసిన జ్ఞాన, స్పృహలను పెంపొందించే వ్యాసాలను దక్కన్ ల్యాండ్‌లో మనం చూడవచ్చు. అందుకే అన్నన్ని వ్యాసాలు శాసనాల మీద వచ్చినవి ప్రత్యేకంగా కనిపిస్తాయి. శాసన పఠనం ఒక కళ, ఒక అవసరం. అనివార్యత. ముఖ్యంగా చరిత్రను అధ్యయనం చేసేవారికి, చరిత్ర నిర్మాణం జరిపే వారికి చరిత్రలను బోధపరచుకునేవారికి ఇది ప్రధాన వనరు.

సంస్కృతిపట్ల సరైన దృక్పథం ఏర్పరచుకోని ఏ జాతి కూడా అది ఆర్థికంగా ఎంత అభివృద్ధి సాధించినా అది నిష్ఫలం కాబట్టే దక్కన్‌ల్యాండ్‌లో సంఖ్యాధికంగా సంస్కృతీ సంబంధ విశేషాలతో కూడిన పలు వ్యాసాలు విషయ నిపుణులతో అడిగి మరీ రాయించారు. అసలు దక్కన్ పీఠభూమి బహు సంస్కృతులు, బహుళ నాగరికతల నిలయం. అనేక వందల ఏళ్లుగా గొప్ప సాంస్కృతిక వైభవోపేత వైవిధ్యాన్ని నింపుకుంది. నిలుపుకుంది కూడా. ఎన్నో భిన్నమైన ఆదివాసి జాతులు, సంస్కృతులకు దక్కన్‌లాండ్ ప్రకటించి తన ప్రత్యేకతను చాటి చెప్పింది. వ్యవసాయ ప్రధాన దేశం కనుక, వ్యవసాయ రంగంలో ముడిపడి సాగే పలు జీవన విధానాలు, సంప్రదాయాలు, సంస్కృతీ విశిష్టతలను స్పష్టంగా ప్రకటించే పలు వ్యాసాలను ప్రచురించింది. వీటినన్నిటినీ పరిగణలోకి తీసుకున్నప్పుడు వేదకుమార్ నడిపినది 'దక్కన్‌ల్యాండ్' అనే పత్రికనా? లేక సాంస్కృతిక ఉద్యమమా? అనే సందేహం కలుగుతుంది. ఇందులోని వ్యాసాలు ప్రమాణ బద్ధమైనవి. సీరియస్ పరిశోధనలకు దీటుగా నిలవగలిగినవి. 'దక్కన్ ల్యాండ్' కేవలం ఒక పత్రిక కాదు. అది మానవీయశాస్త్ర అనుశాసనాల, పరిశోధనల కలగలుపుగా రూపొందిన ఒక విశిష్ట 'జర్నల్'. అదొక నిబద్ధ అవగాహనతో నడుస్తున్న నిశ్శబ్ద ఉద్యమం.

**– డా॥ ఆర్. సీతారామారావు**, m : 9866563519
e: sitametaphor@gmail.com




# స్వతంత్ర అభిప్రాయాల వేదిక దక్కన్‌ల్యాండ్




ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కాలంలో పుట్టి రాష్ట్ర అవతరణ అనంతరం కూడా ఆయా రచయితలు తమతమ స్వతంత్ర అభిప్రాయాలు వెలిబుచ్చడానికి ఒక వేదికగా నిలుస్తున్నది దక్కన్ ల్యాండ్. పత్రికకు సమాంతరంగా తెలంగాణ రిసోర్స్ సెంటర్ ప్రతి శనివారం సాయంత్రం “చర్చ” పేరుతో ఏర్పాటు చేసిన వేదిక ఉద్యమకారులు, మేధావులు తమతమ గళాలను వినిపించడానికి వీలు కల్పించింది. ఒక్క మాటలో చెప్పాలంటే తెలంగాణ రిసోర్స్ సెంటర్ లో మాట్లాడని మేధావి లేరు. ఈ నేపథ్యంలో దక్కన్ ల్యాండ్ యొక్క సుగుణమేంటంటే... తెలంగాణ రిసోర్స్ సెంటర్ “చర్చ” కార్యక్రమంలో మాట్లాడిన ప్రతి ప్రధాన వక్త విలువైన ప్రసంగ పాఠాలు వృధాగా పోకుండా ప్రతి నెలా వాటిని ప్రచురించి భావి తరాలకు భద్రంగా అందించింది.

ఇవి మలి తెలంగాణ ఉద్యమ కాలం నాటి స్వరాలను, వాటి స్వభావాల వైఖరులను తెలుసుకోవడానికి చాలా ఉపయోగకరమైనవి. ఉద్యమ కాలంలో తెలంగాణ అస్తిత్వం, దాని ప్రత్యేకతల నిరూపణ కోసం కూడా అనేక ఆరాటాలు, పలు పోరాటాలు జరిగాయి. ఈ క్రమంలో ఎంతో మంది విషయ నిపుణులు “చర్చ”లో పాల్గొని ప్రసంగించారు. వారి వారి వాదనలు, విభేదించిన సంగతులు అన్నీ ఒక వేదిక మీద పోగవడం ఒక సంతోష కారణం కాగా వాటిని ఎప్పటికప్పుడు దక్కన్ ల్యాండ్ నెల నెలా ప్రచురించి భద్రపరచడం మరో గర్వకారణమైన అంశం.

– డా. ద్యావనపల్లి సత్యనారాయణ,
m : 9490957078
e : dyavanapalli@gmail.com

# తెలంగాణ సోయి యాది చేసిన దక్కన్ ల్యాండ్



దక్కన్ ల్యాండ్ అనే మాస పత్రిక వెలవడడం అందులో సామాన్య జనానికి, సామాజిక కార్యకర్తలకు ఉద్యమ భావ జాల లోతులను అర్థం చేసుకోవడానికి తోడ్పడింది. ఉద్యమ సాఫల్యంతో డెక్కన్ ల్యాండ్ అవసరం అయిపోయింది. ఇక నిలిపి వేస్తారని కొంత మంది అనుకున్నారు. కానీ పోరాడి సాధించిన తెలంగాణలో భావజాల వ్యాప్తి నూతన తెలంగాణ పునర్నిర్మాణంలో దక్కన్ ల్యాండ్ ప్రచురణ కర్తలు తన వంతు బాధ్యత గా అదే స్ఫూర్తితో కొనసాగించడం చాలా అభినందనీయం.

తెలంగాణ సాధించుకున్నాక అనేక అంశాల మీద వ్యాసాలు రావడం, ప్రభుత్వ యంత్రాంగానికి విధాన నిర్ణయాల అమలు క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు మా లాంటి సామాజిక కార్యకర్తల అనుభవాలను ప్రచురించి తెలంగాణ సమాజాన్ని ఎప్పటి కప్పుడు జాగృత పరచడంలో ముఖ్య భూమిక పోషిస్తుంది డెక్కన్ ల్యాండ్. తెలంగాణ సహజ సంపద జిల్లాల వారీగా, హస్త కళలలో ఉన్న నైపుణ్యాలను పరిచయం చేయడం, గుడులు వాటి చారిత్రక ఆవశ్యకతలు శిల్పులు వారి జీవన నేపథ్యం, ఉమ్మడి రాష్ట్రంలో ఎగతాళికి గురి అయిన సాంఘిక ఆచారాలను, తెలంగాణ ఆచార వ్యవహారాలను, గర్వంగా చెప్పుకునే లా రాసిన వ్యాసాలు, పండుగలు పబ్బాల గురించి చరిత్ర కారులచే పరిచయ వ్యాసాలు, గొలుసు కట్టు చెరువులు, వాటి ప్రాముఖ్యత కాకతీయుల పాలన నైపుణ్యాలు ఇలా తెలంగాణలో స్పృశించనీ అంశం లేదు దక్కన్‌ల్యాండ్ పత్రిక. తెలంగాణలో గ్రామీణ ప్రాంత పండుగలు, వంటలు, ఉమ్మడి రాష్ట్రం లో పట్టింపుకు నోచుకోని ప్రముఖుల జీవిత గాథలు, ఇలా ఎన్నో విషయాలను చదువరులకు అందించిన ఘనత డెక్కన్ ల్యాండ్ మాస్ పత్రికది.

– ఆర్. వెంకట్ రెడ్డి,
జాతీయ కన్వీనర్, ఏం.వి.ఎఫ్.
m : 9949865516
e : venkatmvf@gmail.com






# వెలుగుకు నోచుకోని అనేక విషయాలను వెలుగులోకి తెస్తున్న 'దక్కన్ ల్యాండ్'

'దక్కన్ ల్యాండ్' పత్రిక దక్కనీయ సంస్కృతి పునరుద్ధరణలో భాగంగా నేను భావిస్తున్నాను. పత్రికకు పేరు పెట్టడంలో సంపాదకుల దృష్టిలో యీ సాంస్కృతికాంశం యిమిడి వుంటుందని నేను భావిస్తున్నాను. ISSN ఆమోదం (International Standard Serial Number) రావడం అత్యంత ముదావహం. పరిశోధకులకు - చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, సమాజం- ఇదివరంలాంటిది. దీనివల్ల యిందులో ప్రచురితమయ్యే వ్యాసాలకు అదనపు అర్హత లభిస్తుంది. ఇదొక్కటేకాదు. రాజకీయ, సామాజిక రంగాలు, ఆర్థికంతో సహా - సంక్షోభాలకు గురవుతున్నాయి. వాటి ప్రకంపనలు, తెలంగాణతో సహా. అన్ని





ప్రదేశాల్లోనూ వ్యక్తమవుతున్నాయి. దీంతో సమ్యక్ సామాజిక దృష్టి, అభిలషించదగ్గ చైతన్యం కొరవడుతున్నాయి. చరిత్ర, వారసత్వసంపద పరిరక్షణ నామ మాత్రంగా మిగిలి పోతున్నాయి. ఈ ప్రాంతంలో నెలకొన్న ప్రజా జీవన సరళి. అందులోని వైవిధ్యం, అంతరించి పోతున్న వారసత్వ సంపద, చేతి వృత్తులు, ప్రజా కళలు కనుమరుగువుతున్న శోచనీయ సందర్భంలో వాటిని పరిరక్షించాలన్న సత్సంకల్పంతో 'దక్కన్‌ల్యాండ్' మొదలై అనేకానేక ఇబ్బందులకు లోబడి, క్రమం తప్పకుండా వెలువడ్డం ప్రశంసనీయం.

– వకుళాభరణం రామకృష్ణ
m : 98668 41409

# విశ్లేషణాత్మక దక్కన్ ల్యాండ్

ఈ పత్రికకు సంబంధించినంత వరకు రెండు అంశాలు నాకు నచ్చాయి. ఒకటి వర్తమానానికి సంబంధించిన సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక అంశాల్ని సమన్వయం చేసి వివరణాత్మకంగా పాఠకులకు అందిం చడం... రెండవది వర్తమానంతో పాటు చరిత్ర, సాంస్కృతిక అంశాలకు సంబంధించి సమతుల్యాన్ని పాటించడం, వాస్తవానికి సామాజిక, రాజకీయ అంశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపే పత్రికల కంటే దక్కన్ ల్యాండ్ భిన్నంగా ఉంది. నేను దక్కన్‌ల్యాండ్ కంటెంట్/ విషయ సూచికను పరిశీలించినప్పుడు ఒకింత ఆశ్చర్యానికి గురైనాను. ఎందుకంటే విభిన్న అంశాల్ని ఒక చోట చేర్చి అర్థవంతమైన విషయ పరిజ్ఞానాన్ని పాఠకులకు అందించడం అంత సులభమైన పనికాదు.





నేను దాదాపుగా గత దశాబ్ద కాలంగా దక్కన్‌ల్యాండ్ చదువుతున్నాను. నా కిష్టమైన తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక అంశాల్ని గురించి అనేక కొత్త విషయాలను నేర్చుకొన్నాను. ముఖ్యంగా ప్రముఖ చరిత్రకారుల విశ్లేషణలు అనేక నూతన కోణాల్ని ఆవిష్కరించాయి. ప్రతినెల నేను ఆతృతగా ఎదురుచూసే స్థానిక చారిత్రక అంశాల గురించి తెలుసుకొని సంతోష పడతాను. దక్కన్‌ల్యాండ్ పత్రిక తెలంగాణ సమాజానికి అందించే నూతన జ్ఞానంలో యిది ఒక ముఖ్య అంశం.

తెలంగాణ అస్థిత్వ ఆకాంక్షలకు ప్రతీకగా, విస్తృతస్థాయిలో ప్రజాభిప్రాయ వేదికగా వెలువడుతున్న దక్కన్‌ల్యాండ్ పత్రిక వేదకుమార్‌గారి నాయకత్వంలో అజేయంగా నిలవాలని ఆకాంక్షిస్తు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

– ఆచార్య అడపా సత్యనారాయణ
m : 9473405551
e: adapa58@gmail.com




# తెలంగాణ అస్తిత్వ ఆత్మగౌరవ పతాకం దక్కన్ ల్యాండ్




***ప**త్రికొక్కటున్న పదివేల సైన్యము*
*పత్రికొక్కటున్న మిత్ర కోటి*
*ప్రజకు రక్ష లేదు పత్రిక లేకున్న.....*

అంటారు పత్రికా రంగ వైతాళికుడు నార్ల వెంకటేశ్వరరావు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే పత్రికల పాత్ర అనివార్యం. మానవజీవన వికాసంలో పత్రికలు ఎప్పటికప్పుడు తమ వంతు పాత్రను నిరంతరాయంగా పోషిస్తూ వస్తున్నాయి. ఆ క్రమంలో 10 ఏళ్ల క్రితం ఆవిర్భవించిన దక్కన్ ల్యాండ్ సామాజిక రాజకీయ మాసపత్రిక తెలంగాణ అస్తిత్వ ఆత్మగౌరవ పతాకగా నిలిచింది. మలిదశ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి ఊపిరులూదింది. తెలంగాణ రాష్ట్ర సామాజిక ఆర్థిక రాజకీయ రంగాలను ప్రతిఫలించే అద్దంగా, అన్యాయాలు అక్రమాలపై ప్రకటించిన యుద్ధంగా దక్కన్ ల్యాండ్ పాఠకులకు చేరువైంది. పత్రిక అందిస్తున్న సమాచారం విషయానికొస్తే 60 పేజీల్లో పొదిగిన అంశాలన్నీ వర్తమాన సమాజాన్ని ఆవిష్కరించేవే. వివిధ శీర్షికల రూపంలో దక్కన్ ల్యాండ్ ప్రకటిస్తున్న ప్రచురిస్తున్న విషయాలన్నీ విస్తారమైన సమాచారంతో లోతైన విశ్లేషణ చక్కగా చిక్కగా రూపొంది అభిరుచి గల పాఠకులను ఆకర్షిస్తాయి. ఇంతవరకు వెలువడిన సంచికలను తిరగవేస్తే ఎక్కడా పొల్లు రాతలు సొల్లు కూతలు మచ్చుకి కూడా కనిపించవు. ఇటువంటి సాధికార పత్రికలు సమాజంలో అరుదుగా కనిపిస్తుంటాయి. ఆ వరుసలో తెలుగులో దక్కన్ ల్యాండ్ అగ్రభాగాన నిలుస్తుంది.

– డా. అయాచితం శ్రీధర్
అధ్యక్షుడు. తెలంగాణ గ్రంథాలయ పరిషత్
m : 9849893238

# దక్కన్ ల్యాండ్ తెలంగాణ ఎన్‌సైక్లోపీడియా





**తె**లంగాణా ఆత్మను సుస్థిరంగా నిలిపే ఉద్దేశంతో దక్కన్ ల్యాండ్ సామాజిక రాజకీయ మాస పత్రిక నిర్వహణకు పూనుకున్నారు. గతాన్ని తెలుసుకొని వర్తమానంతో బేరీజువేసుకొని భవిష్యత్తుకు పునాదులు వేసుకోవడం విజ్ఞత. ఆక్రమంలోనే ఈ పత్రిక నడుస్తున్నది. పత్రిక ఈ ప్రాంతంలో నివసించే ప్రజలతోపాటు వలస వచ్చినతెగల సంస్కృతిని అక్షరీకరిస్తున్నది. నిజాం భూస్వామ్య వ్యవస్థలో సాధారణ ప్రజలు తమబ్రతుకులు తమ అధీనంలో లేక నానా యాతనలు పడ్డ విషయం వాస్తవమైనప్పటికీ నిజాం కాలంలోని అనేక నిర్మాణాలతో పాటు రైల్వేనిర్మాణాలవంటి స్వంత వ్యవస్థలుండేవనే విషయాలను వెలికితీస్తూ హైదరాబాదును అభివృద్ధి చేసి ప్రపంచపటంలో మేమే నిలబెట్టినం అనే వాళ్ళకు ఈ పత్రిక ఓ చెంపపెట్టు. ఇదంతా వారసత్వాన్ని నిలపెట్టడంలో వేదకుమార్ గారు చేస్తున్న ప్రయత్నంలో భాగమే సుమా!

ఆధునీకరణ .. ప్రపంచీకరణలో పర్యావరణం దెబ్బతింటున్న విషయం జగమెరిగిన సత్యమే. అందువల్ల పర్యావరణ పరిరక్షణాంశాలను మెలకువలతో పాటు ఈ ప్రాంత ఒనరులను ముందుకు తెస్తూ వాటి వినియోగావశ్యకతను.. విధానాన్ని పత్రిక ఉద్ఘాటిస్తున్నది. దక్కన్ ల్యాండ్ పత్రికను వ్యయప్రయాసాల కోర్చి ఒంటి చేత్తో తెస్తున్నందుకు వేదకుమార్ గారికి హార్థిక కృతజ్ఞతాభినందనలు తెలుపుకుంటున్నాను. పత్రికను నెలనెలా టంచన్ గా అందుకోగలిగినందుకు సంతోషిస్తూ వీరితో మలిదశ ఉద్యమంలో కొన్ని అడుగులు వేసినందుకు గర్వపడుతున్నాను

– తిరునగరి దేవకీదేవి, m : 9949636515
e: devaki.tirunagari@gmail.com

# నికల్ మూలకం యొక్క ఖనిజాలు




నికల్ కేంద్ర ప్రభుత్వం ద్వారా నోటిఫై చేయబడిన క్రిటికల్ మినరల్స్‌లో ఒకటి. వీటి నిక్షేపాలు మనదేశంలో ప్రస్తుతం మన అవసరాలకు సరిపడా లేనందువల్ల ఎక్కువ శాతం ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకోవల్సి వస్తుంది. ఈ పరిస్థితని దృష్టిలో పెట్టుకొని కేంద్రప్రభుత్వం ఈ ఖనిజాన్వేషణ విస్తృతంగా ప్రభుత్వ, ప్రైవేటు ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీల ద్వారా జరుపుతున్నారు.

నికల్ మూలకం యొక్క కెమికల్ సింబల్ Ni మరియు దాని ఆటమిక్ నంబర్ 28. ఇది వెండి రంగులో ఒక మెరుపుతో ఉండే మెటల్. ఇది చాలా గట్టిగా మరియు డక్టైల్ ట్రాన్సిషన్ మెటల్‌గా గుర్తించబడినది. స్వచ్ఛమైన నికల్ కెమిలీరియాక్ట్ అవుతుంది. కాని వీటి పెద్ద ముక్కలు స్టాండర్డ్ కండిషన్స్‌లో మెల్లిగా రియాక్ట్ అవుతుంది. దీనికి కారణం నికల్ ఆక్సైడ్ పొర ఉండటం వలన. నేటివ్ నికల్ ప్రిత్వియొక్క క్రస్ట్‌లో చాలా తక్కువగా ఉంటుంది. మరియు జనరల్‌గా అల్ట్రామాఫిక్ శిలలో దొరుకుతుంది. ఇది కాకుండా ఐరన్ మిటియోరైట్స్‌లో ఉంటుంది. నికల్ ఖనిజాలు కాపర్ ఓర్స్ లాగా ఆకుపచ్చ రంగులో కూడా ఉంటవి. వాటిని కాఫర్‌నికల్ (నీకేల్స్ కాపర్) అని అందురు ఎందుకనగా అది కాపర్ ఉత్పత్తి చేయదు కాబట్టి.

భూమి యొక్క క్రస్ట్‌లో నికల్ ఎక్కువశాతం ఆక్సైడ్స్ రూపంలో ఉంటుంది. ఎకనామికలీ ఇంపార్టెంట్ నికల్ ఓర్స్ సల్ఫైడ్స్ రూపంలో ఉంటవి. ఉదాహరణకు పెంట్యాండైట్ ఖనిజం ఈ మూలకంకు ఫెర్రోమాగ్నటిక్ ప్రాపర్టి ఉంటుంది. అర్థికా పర్మనెంట్ మాగ్నెట్స్‌లో నికల్ వాడతారు. ఐరన్ మాగ్నెట్స్ మరియు రేర్‌ఎర్త్ మాగ్నెట్స్‌కు మధ్య ఉన్న స్ట్రెన్త్ గలవిగా ఉంటుంది.

ఈ ఖనిజం యొక్క మేజర్ ప్రొడక్షన్ సైట్స్ ఇండోనేషియాలోని సులవేసి, కెనడాలోని సడ్‌బరీ, న్యూకెలాడోనియా పసిఫిక్‌లో, పశ్చిమ ఆస్ట్రేలియా మరియు రష్యాలోని నార్‌లిస్క్ ప్రాంతాలలో నుండి ఉత్పత్తి జరుగుతుంది.

మనదేశంలో చాలా వరకు ఒడిస్సాలోని సుకిందా క్రోమైట్ డిపాజిట్‌లో బైప్రొడక్ట్‌గా వస్తుంది. రాజస్థాన్‌లోని బాన్స్‌వాడా జిల్లాలోని భూకీయా గోల్డ్ డిపాజిట్‌లో నికల్, కోబాల్ట్ బైప్రొడక్ట్‌గా దొరుకుతుంది. చాలా వరకు రాజస్థాన్‌లో బేస్ మెటల్ డిపాజిట్స్‌లో నికల్ రిపోర్ట్ చేయడం జరిగింది. అందుకని ఇప్పుడు దేశమంతటా ఈ బేస్‌మెటల్ బెల్ట్స్‌లో అన్వేషణ జరుగుతుంది.

ఇవి కాకుండా దేశవ్యాప్తంగా అల్ట్రామాఫిక్ శిలలో నికల్



కాపర్ తో నిక్కెల్ సల్ఫేడ్  బై ప్రోడక్ట్ రూపం లో ఉంటుంది. ఇక్కడ మాలకయిట్‌ని చూడగలం



నికల్

కోసం ఎక్స్‌ప్రోరేషన్ మొదలు పెట్టారు. ఇవి కాకుండా డెక్కన్ ట్రాప్‌లోని పిక్రిటిక్ బాసాలెట్స్‌ని టార్గెట్ చేస్తున్నారు.

ముఖ్యమైన నికల్ ఖనిజాలు పెన్‌ట్లాడెట్. ఇది సల్ఫర్, ఐరన్ కాంబినేషన్‌తో ఉంటుంది. మిల్లరైట్ సల్ఫర్ కాంబినేషన్‌లో కలదు. నికలైన్ ఆర్సెనిక్‌తో కూడి ఉంటుంది. నికల్ ఐరన్ మిటియోరైట్స్‌లో కామసైట్, టేనైట్ అల్లాయస్ రూపంలో ఉంటుంది. నికలిఫెరస్ లిమొనైట్ మరియు గార్నియోరైట్ ఖనిజాల నుండి కూడా ఎక్కువ మొత్తం నికల్ ఉత్పత్తి చేస్తున్నారు.

మనదేశంలోని 92 శాతం నికల్ రిజర్వ్ ఒడిస్సాలోని సుకిందాలో మరియు మయూర్  భంజ నుండి వస్తుంది. చిన్న మొత్తంలో జార్ఖండ్, నాగాలాండ్ మరియు కర్ణాటకలో కలవు.

దాదాపు 68 శాతం వరల్డ్ ప్రొడక్షన్ స్టేన్‌లెస్ స్టీల్ తయారీలో ఉపయోగిస్తారు. 10 శాతం నికల్ బేస్డ్ మరియు కాపర్ బేస్డ్ అల్లాయస్‌లో ప్లేటింగ్ కోసం వాడతారు. 7శాతం అల్లాయ్ స్టీల్, 3 శాతం ఫౌండ్రిస్, 4 శాతం రీచార్జెబుల్ బ్యాటరీస్, ఎలెక్ట్రిక్ వెహికల్స్‌లో, కాయిన్స్‌లో, క్యాటలిస్ట్ మరియు క్యాతోడ్స్‌లో ఉపయోగిస్తారు.


ఇవి కాకుండా ఎన్నో రకాల ఇతర ఉపయోగాలు ఈ మూలకానికి ఉండటం వలన దీని అన్వేషణకు ప్రాముఖ్యత కలిగినది.

– కమతం మహేందర్ రెడ్డి
m : +91 90320 12955
e : mahikam.reddy0@gmail.com

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన




**పెద్దలు రాసిన పిల్లల కథలు**
**(ఉమ్మడి పది జిల్లాలు)**
10 పుస్తకాల సెట్ ధర రూ.350.
తగ్గింపు ధర రూ.300
**ప్రతులకు**
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.
మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్
నెం.12, హిమాయత్‌నగర్,
హైదరాబాద్-500029
**ఫోన్ : 9030 6262 88**
email: edit.chelimi@gmail.com
website : www.balachelimi.com



## విశ్వాస వ్యవస్థ భావనాత్మక వికాస నిలయం

# హిరే బెంకల్ బృహత్ శిలా సమాధుల సముదాయం

UNESCO, INDIA TENTATIVE LIST (TL) SITE - 2021

Serial Nomination for HIRE BENKAL, MEGALITHIC SITE

Karnataka Province or Region India. Category: Cultural

కర్ణాటకలోని హిరే బెంకల్ బృహత్ శిలా సమాధుల క్షేత్రాన్ని మే 19, 2021న యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల తాత్కాలిక జాబితాలో చేర్చారు. ఆ విశేషాలేమిటో చూద్దాం.

**దేశం:** భారత్

**సమర్పించిన తేదీ:** 13/04/2021

**ప్రమాణాలు:** (iii)(iv)

**వర్గం:** సాంస్కృతిక

**సమర్పించిన వారు:** యునెస్కో భారత శాశ్వత ప్రతినిధి బృందం

**రాష్ట్రం, ప్రావిన్స్ లేదా ప్రాంతం:** కర్ణాటక

**రిఫరెన్స్:** 6529

'మెగాలిథ్' అనే పదం 'మెగాస్' (అంటే పెద్ద/విశాలమైన), 'లిథోస్' (అంటే రాయి) అనే రెండు గ్రీకు పదాల నుండి ఉద్భవించింది. మెగాలిథ్ అనేది మృతుల కోసం రాతితో నిర్మించిన నిలువు కట్టడాలను కలిగి ఉండే ఒక నిర్దిష్ట సమాధి శైలికి ఉపయోగించే పేరు. ఐరోపా, ఆసియా, ఆఫ్రికా, మధ్య, దక్షిణ అమెరికా వంటి ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో కూడా మెగాలిథ్‌లు ఉన్నాయి. మెగాలిథిక్ ప్రదేశాల విస్తరణ భౌగోళిక పరిధి, అలాగే వాటి నిర్మాణ శైలి కూడా చాలా విస్తృతమైనది. భారతదేశంలో ద్వీపకల్ప దక్షిణ, దక్కన్ పీఠభూమి, వింధ్య పర్వతాలతో బాటు భారత ఉపఖండంలోని వాయువ్య ప్రాంతంలో కూడా మెగాలిథ్‌లు ఉన్నాయి. అయితే, దక్షిణ భారతదేశం మధ్యభాగంలో మెగాలిథ్‌లు అధిక సాంద్రతలో ఉన్నట్లు గుర్తించారు.








భారతదేశంలోని బృహత్ శిలల మూలాలను నవీన శిలాయుగం–రాగియుగం నాటివిగా గుర్తించవచ్చు (ఉదాహరణకు, మహారాష్ట్రలోని ఇనామ్‌గావ్ రాగియుగ ప్రదేశంలో లభించిన కలశ సమాధులు). అయితే, దక్షిణ భారతదేశంలోని చాలా బృహత్ శిలా ప్రదేశాలు సాధారణంగా ఇనుముతో సంబంధాన్ని కలిగి ఉంటా యి. అందువల్ల, భారతీయ సాహిత్యంలో బృహత్ శిలల కాలాన్ని దాని ఇనుప సందర్భాన్ని నిర్దిష్టంగా చెప్పడానికి ఇనుప యుగం – బృహత్ శిలాకాలం అని కూడా సూచిస్తారు. అయినప్పటికీ, వీటిలో కొన్ని ప్రదేశాలు తొలి చారిత్రక కాలం నాటివిగా, మరికొన్ని మధ్యయుగ కాలం నాటివిగా గుర్తించారు.

గత మానవులు జీవితాంతాన్ని ఎలా గ్రహించారు, భావించారు, మరణ కర్మకాండలు ఎలా నిర్వహించారు, ఖనన కార్యక్రమాలు ఎలా జరిపారు అనేదానికి బృహత్ శిలా సంప్రదాయం ఒక అద్భుతమైన ఉదాహరణ. నవీన శిలాయుగంతో పోలిస్తే, ఇనుప యుగం నాటి ఖననాలు అధిక స్థాయి సంక్లిష్టతను వెల్లడిస్తాయి. దీనికి విశ్వాస వ్యవస్థకు సంబంధించి జరిగిన భావనాత్మక వికాసమే కారణమని చెప్పవచ్చు. బృహత్ శిలా నిర్మాణాలలోని రకాల వైవిధ్యం ఆశ్చర్యపరుస్తుంది, వాటిలో కొన్ని రకాలు: మెన్హిర్, డోల్మెన్, డోల్మెనాయిడ్ సిస్ట్, సార్కోఫాగస్, డోల్మెనాయిడ్ సిస్ట్‌లోని సార్కోఫాగస్, కెయిర్న్ సర్కిల్, స్టోన్ అలైన్‌మెంట్, అర్న్ బరియల్, టోపికల్, కోడైకల్, బహుళ రాతి కప్పులు. కొన్ని ఖనన రకాలు నిర్దిష్ట ప్రాంతాలతో ముడిపడి ఉన్నాయి – ఉదాహరణకు, కోడైకల్, టోపికల్‌లు కేరళతో, మెన్హిర్‌లు కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళలతో సంబంధం కలిగి ఉన్నాయి. ఈ ఖనన నిర్మాణ రూపాలలోని వైవిధ్యం, దక్షిణ భారతదేశం అంతటా ఉన్న ప్రజల సాంస్కృతిక విశ్వాసాలు, సంప్రదాయాల వైవిధ్యాన్ని వెల్లడిస్తుంది. సమాధులలో లభించే వస్తువులు, మట్టిపాత్రలు, ఇతర నైవేద్యాల ద్వారా గ్రహించబడిన 'మరణం, మరణానంతర జీవితం' గురించిన అంతర్లీన నమ్మకం లేదా భావజాలమే, బృహత్ శిలలను నిర్మించాలనే భావన ద్వారా వ్యక్తమైన ఏకీకృత కారకంగా ఉంది.

ప్రస్తుత పరిశీలనలో ఉన్న ప్రదేశం భారతదేశంలోని కర్ణాటక రాష్ట్రం, కొప్పల్ జిల్లా, గంగావతి తాలూకాలోని హిరే బెంకల్ వద్ద ఉన్న బృహత్ శిలా సమాధుల సముదాయం. ఇది ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, హంపి సర్కిల్ ఆధ్వర్యంలోని ఒక కేంద్ర సంరక్షిత ప్రదేశం. ఈ ప్రదేశం ధార్వాడ్ శిలా శ్రేణికి చెందిన ద్వీపకల్ప గ్నైసిక్ సముదాయ మండలంలో, కోట ఆకారంలో ఉన్న గ్రానైట్ కొండపైన ఉంది. ఈ ప్రదేశానికి హిరే బెంకల్ గ్రామానికి ఆగ్నేయంగా 3 కిలోమీటర్ల దూరం నుండి చేరుకోవచ్చు.

కొండపై దాదాపు 20 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న బృహత్ శిలలు, తూర్పు–పడమర దిశలో సుమారు 1 కిలోమీటరు దూరం వరకు మూడు వేర్వేరు ప్రదేశాలలో విస్తరించి ఉన్నాయి. ఈ మూడు సమూహాలను పశ్చిమ సమూహం, మధ్య సమూహం, తూర్పు సమూహంగా వర్గీకరించవచ్చు. ప్రతి సమూహం మధ్య దూరం సుమారు 200 మీటర్లు. పశ్చిమ సమూహం బృహత్ శిలాయుగం నాటి గ్రానైట్ గనికి సమీపంలో ఉంది, ఇది నిరంతర నీటి గుంటగా కూడా ఉపయోగపడింది. హిరే బెంకల్‌లో గుర్తించబడిన అనేక ఉప రకాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి: రంధ్రాలు గల డోల్మెనాయిడ్ సిస్ట్ – వృత్తాలు, దీర్ఘచతురస్రాకార డోల్మెనాయిడ్ సిస్ట్‌లు లేదా రంధ్రాలు ఉన్నవి లేదా లేని సిస్ట్‌లు, క్రమరహిత బహుభుజి గదులు, రాతి ఆశ్రయ గదులు, మానవరూప నిర్మాణాలు మొదలైనవి.

1934–35లో, స్కాటిష్ మిషనరీ అయిన కీస్ గతంలో నివేదించిన, ప్రసిద్ధ బృహత్ శిలా గుట్టల సమూహాల సమీపంలో ఉన్న గ్రానైట్–గ్నైస్ రాతి కొండ శ్రేణులలోని హిరే బెంకల్‌లో గల 3 రాతి చిత్రాల గురించి లియోనార్డ్ మున్ మొదటిసారిగా ఒక కథనాన్ని ప్రచురించారు. మున్ ఆ గ్రామం సమీపంలో ఒక బూడిద దిబ్బను కూడా గుర్తించారు. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన ధార్వాడ్ సర్కిల్, హిరే బెంకల్ సమీపంలోని దుర్గాడి దాడి, తలవర్మలే అనే రెండు నివాస స్థలాలలో తవ్వకాలను చేపట్టింది.

## అత్యుత్తమ సార్వత్రిక విలువకు సమర్థన

హిరే బెంకల్ ప్రదేశం సుమారు 6748.54 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న రిజర్వ్ ఫారెస్ట్‌లో ఒక భాగం. ఇందులో హిరే బెంకల్ బృహత్ శిలా సముదాయం దాదాపు 20 హెక్టార్ల విస్తీర్ణంలో ఉంది. ఈ ప్రదేశం గ్రానైట్ అవశేష కొండ ప్రాంతంలోని ఒక ఎత్తైన శిఖరం (605 మీ) మీద ఉంది. 2500 సంవత్సరాలకు పైగా దిబ్బలపై నిలబడి ఉన్న వందలాది బృహత్ శిలల (అధికభాగం డోల్మెన్లు) ఉనికికి ఈ ప్రదేశం ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఇటీవలి అధ్యయనాలు 20 హెక్టార్ల విస్తీర్ణంలో దాదాపు 1000 బృహత్ శిలా నిర్మాణాలు ఉన్నట్లు వెల్లడించా యి. వీటిలో డోల్మెన్‌లు, కైర్న్లు, సొరంగ గదులు, రాతి వలయాలు, మెన్హిర్‌లు, గ్రానైట్‌తో చెక్కబడిన మానవరూప శిల్పానికి ఏకైక ఉదాహరణ వంటి వివిధ వాస్తు శైలులు ఉన్నాయి. భారీ రంధ్రాలు గల డోల్మె న్లు అన్ని



ఇతర రకాల సమాధి స్మారక చిహ్నాల కంటే ఎక్కువగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో, అదే విధంగా వేరేచోట కనిపించే ఇటువంటి స్మారక చిహ్నాలను హిరే బెంకల్ రకం అని పిలుస్తారు.

హిరే బెంకల్ మరో విశిష్ట లక్షణం చరిత్రపూర్వపు రాతి చిత్రాలు. హిరే బెంకల్‌లో ఇప్పటివరకు 11 రాతి గుహలు కనుగొనబడ్డాయి. మధ్యశిలాయుగం నాటి కొన్ని చిత్రాలు కూడా ఉన్నాయి. ఇవి మానవ చిత్రణలో రాంబిక్ మీయాండర్లు లేదా తేనెగూడు నమూనాలతో కూడిన క్లిష్టమైన చిక్కుముడి డిజైన్ల రూపంలో ఉన్నాయి. ఇది మధ్యశిలాయుగ కళలో ప్రత్యేకమైనది. అలాగే, ఈ ప్రదేశంలో పందిని పోలి ఉండే, దైవత్వం ఆపాదించబడిన జంతురూప జీవుల పెద్ద బొమ్మల కొన్ని చిత్రణలు కూడా ఉన్నాయి. కొన్ని జంతు చిత్రాలు పెద్దవిగా కూడా ఉన్నాయి; కొన్ని వాస్తవ పరిమాణం కంటే పెద్దవిగా ఉన్నాయి. హిరే బెంకల్ చుట్టుపక్కల ప్రాంతంలోని కొన్ని చిత్రాలలో చతురస్రాకార లేదా దీర్ఘచతురస్రాకార 'ఆవరణల' చిత్రాలు కనుగొనబడ్డాయి; వాటి లోపల అనేక మానవ బొమ్మలు ఉంచబడ్డాయి. ఈ చతురస్రాలు వాస్తవానికి పవిత్రమైన ఆవరణలను లేదా బహుశా సమాధులను సూచిస్తాయని నమ్ముతారు. ఒక నిర్దిష్ట చిత్రంలో, ఒక వృత్తాకార ప్రదేశం రెండు భాగాలుగా విభజించబడింది. వీటిలో ఒకదానిలో, గుర్తించబడని వివిధ కళాఖండాల మధ్య ఒక వ్యక్తి ఉంచబడ్డాడు. ఇది దక్షిణ భారతదేశంలో చాలా సాధారణమైన రాతి వలయాల రకం బృహత్ శిలల చిత్రణ కావచ్చు. ఈ రాతి గుహలలోని చిత్రలేఖనాలలో పొడవైన మానవ రూపాల వరుస, యుద్ధ గొడ్డలిని పట్టుకున్న అశ్వారూఢుడు, జింకల వరుస, పొడవైన కొమ్ములు గల ఎద్దు, నెమలి మొదలైన మూలాంశాలు ఉన్నాయి. చాలా చిత్రలేఖనాలు ముఖ్యంగా చివరి నవీన శిలాయుగం, తొలి ఇనుప యుగం-బృహత్ శిలాయుగం, అంటే సుమారు సా.పూ. 700-500 మధ్య కాలానికి చెందినవి. హిరే బెంకల్‌లోని రాతి చిత్రకళా చిత్రణలు ఇనుప యుగం - బృహత్ శిలాయుగం నాటి జీవనాధార వ్యూహాలు (వేట), ఉపయోగించిన ఆయుధాలు (బృహత్ శిలాయుగ తవ్వకాలలో లభించిన వాటితో పోల్చదగిన ఈటెలు, గొడ్డళ్లు), జంతుజాలం మొదలైన వాటి గురించి ఆధారాలను అందిస్తాయి.



నీటిని నిలిపిఉంచే విధంగా రూపాంతరం చెందిన రాతి కొలనులు (వర్షపు నీటిని పట్టి ఉంచే రాతి తొట్టెలు) దక్షిణ భారతదేశంలోని అనేక ప్రాంతాలలో ఇనుప యుగం (క్రీ.పూ. 1000-500) నాటికే సాంస్కృతిక ప్రాము ఖ్యతను సంతరించుకున్నట్లు తెలుస్తోంది. ఈ కాలంలో, శ్మశానవాటికలు, ఆచార ప్రదేశాలలో తరచుగా బృహత్ శిలా స్మారక కట్టడాలను నిర్మించేవారు. అటువంటి ఆచార నిర్మాణాలకు, కాలానుగుణంగా ఏర్పడే నీటి తొట్టెలకు మధ్య స్పష్టమైన సాంస్కృతిక సంబంధాన్ని ఏర్పరచవచ్చు. కొండలపైన ఉన్న ప్రదేశాలలో, అత్యంత సుందరంగా నిర్మించిన బృహత్ శిలలను ఉద్దేశపూర్వకంగానే పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేసినట్లు కనిపిస్తుంది. బహుశా ఉత్తర కర్ణాటకలోని హిరే బెంకల్ ప్రదేశం అటువంటి సంబంధానికి అత్యంత అద్భుత ఉదాహరణ. ఇక్కడ ఒక విశాలమైన, లోతులేని నీటి తొట్టె సమీపంలో వందలాది బృహత్ శిలలు కనుగొన బడ్డాయి. ఇది బహుశా ఒక రాతి కొలనుగా ప్రారంభమై, ఆ తర్వాత బృహత్ శిలల నిర్మాణం కోసం రాతి తవ్వకం కార్యకలాపాల ద్వారా విస్తరించబడి ఉండవచ్చు.

ఒక చిన్న కొండ మధ్యలో వ్యూహాత్మక ప్రదేశంలో ఉంచబడిన, దాదాపు అర్ధగోళాకారంలో ఉండే ఒక కెటిల్ డ్రమ్ 2.20 మీటర్ల వ్యాసం, 1.5 మీటర్ల గరిష్ఠ వ్యాసార్థ ఎత్తుతో ఉంది. ఇది కొట్టే ఉపరితలంతో 10 మీటర్ల ఎత్తైన ఒక భారీ ఏకశిలా బండరాయిపై నిలబడి ఉంది. ఈ డ్రమ్‌ను రాతితో గానీ, చెక్క సుత్తితో గానీ కొడితే సంగీత ధ్వని వెలువడుతుంది. ఈ ధ్వని, ఒకదానికొకటి వ్యతిరేక దిశలలో ఉన్న సమాధుల సముదాయం, నివాస స్థలంతో సహా, 1 కిలోమీటరు వ్యాసార్థానికి ఆవల కూడా స్పష్టంగా వినబడుతుంది. ఈ కెటిల్‌డ్రమ్ ఆ ప్రదేశ నివాసులను ఆక్రమణదారుల నుండి హెచ్చరించడానికి లేదా సామాజిక-మతపరమైన లేదా ఆచారపరమైన ప్రాముఖ్యత కలిగిన సమావేశాలకు వారిని ఆహ్వానించడానికి ఉపయోగపడి ఉండవచ్చు అనేది పరిశోధకుల భావన.

హిరే బెంకల్ కేవలం శ్మశానవాటిక ప్రదేశం మాత్రమే కాదు. ఇది ఇనుప యుగం-బృహత్ శిలాయుగం నాటి మానవ సృజనాత్మక మేధస్సు రూపొందించిన ఒక అద్భుత కళాఖండం. ఇది ఒక సాంస్కృతిక ప్రాంతంలో, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో, కాలక్రమేణా జరిగిన మానవ విలువల (పవిత్ర/మతపరమైన, సామాజిక, ఆర్థిక) ముఖ్యమైన మార్పిడిని ప్రదర్శిస్తుంది. భారతదేశంలోని అతిపెద్ద బృహత్ శిలా సమాధి స్మారక కట్టడాల సమూహాలలో ఒకటిగా ఇది బృహత్ శిలాయుగ సాంస్కృతిక సంప్రదాయానికి ఒక ప్రత్యేకమైన సాక్ష్యంగా నిలుస్తుంది. ఇక్కడి రాతి చిత్రాలను మధ్యశిలాయుగం, నవీనశిలాయుగం, రాగియుగం నుండి తొలి చారిత్రక కాలం వరకు చెందినవిగా పేర్కొనడం ఈ ప్రదేశానికి మరో ప్రత్యేక సాక్ష్యం. గంటలు మోగించే శిల బృహత్



శిలాయుగ ప్రజల సామాజిక–మతపరమైన లేదా ఆచారపరమైన అంశాన్ని సూచిస్తుంది. హిరే బెంకల్‌లోని స్మారక కట్టడాల భారీ సంఖ్య, వాటి లక్షణాలు, పరిమాణాలలో ఉన్న వైవిధ్యం ఈ ప్రాంతంలో అపూర్వమైనవి, అవే ఈ ప్రదేశాన్ని ప్రత్యేకంగా నిలుపుతాయి. హిరే బెంకల్‌లోని బృహత్ శిలలు కేవలం ఏకాంత శ్మశానవాటికలు కావు, అవి ఇతర భూ వినియోగ రూపాలతో పాటు స్మారక ఆచార కార్యకలాపాలు జరిగే ప్రదేశాలు. బృహత్ శిలలకు, తాత్కాలికంగా నివసించిన రాతి గుహలు, మెట్ల ఆకారపు ప్రదేశాలకు, రాతి కొలనులకు మధ్య ఉన్న సంబంధాన్ని బట్టి, ఈ ప్రాంతాన్ని ప్రాచీన నివాసులు బహుశా స్వల్ప కాలాల పాటు క్రమం తప్పకుండా సందర్శించి ఉంటారని తెలుస్తోంది.

**ప్రమాణం (iii):**

హిరే బెంకల్ ప్రదేశం భారతీయ ఆదిమ చరిత్రలోని ఇనుప యుగం – బృహత్ శిలా సంస్కృతి అంత్యక్రియలు, ఆచార పద్ధతులపై ఒక అసాధారణ అంతర్దృష్టిని అందిస్తుంది. బృహత్ శిలా నిర్మాణాలు, అవి అంతర్గతంగా ముడిపడి ఉన్న సహజ ప్రకృతి దృశ్యంతో ఒక అసలైన సంబంధానికి నిదర్శనంగా నిలుస్తూ, బృహత్ శిలా యుగపు భూదృశ్యపు ఒక అసాధారణ భావనను సాకారం చేస్తాయి. ఈ ప్రదేశం భారతదేశంలో అత్యధిక సంఖ్యలో బృహత్ శిలా నిర్మాణాలు కలిగిన కొన్ని ప్రదేశాలలో ఒకటిగా ఉండటమే కాకుండా, శిలా చిత్రకళ, శ్మశానవాటికకు సమీపంలో ఉన్న నివాస స్థలం ద్వారా బృహత్ శిలా – ఇనుప యుగం కాలం గురించిన జ్ఞానాన్ని గణనీయంగా పెంచింది, ఇది ఒక ప్రత్యేక, అరుదైన కలయిక.

**ప్రమాణం (iv):**

భారతదేశంలో మొదటి పెద్ద ఉత్సవ స్మారక చిహ్నాలు నిర్మించబడిన మానవ చరిత్రలోని ఒక ముఖ్యమైన దశను ఇది వివరిస్తుంది. గొప్ప బృహత్ శిలా సంప్రదాయానికి ప్రతినిధులుగా ఉన్న ఈ డోల్మెన్ల సముదాయంలో కనిపించే వివిధ రకాల బృహత్ శిలా వాస్తుశిల్పం, డోల్మెన్లకు, చుట్టుపక్కల ఉన్న ప్రకృతి దృశ్యానికి మధ్య ఉన్న ప్రత్యేక సంబంధం, ఈ స్థలం ప్రత్యేకతను బలపరుస్తుంది.

1958 నాటి ప్రాచీన స్మారక చిహ్నాలు, స్థలాలు, అవశేషాల చట్టంలోని నిబంధనల ప్రకారం హిరే బెంకల్ ప్రదేశం భారత పురావస్తు శాఖ హంపి సర్కిల్ పరిధిలో జాతీయ ప్రాముఖ్యత కలిగిన కేంద్ర సంరక్షిత స్మారక చిహ్నంగా ఉంది. కనీసం ఐదు ప్రధాన రకాలు, వాటి ఉప రకాలతో కూడిన బృహత్ శిలా స్మారక చిహ్నాల అతిపెద్ద సమూహాలలో ఒకటిగా ఉన్న ఈ సమాధులు కర్ణాటక రాష్ట్ర రిజర్వ్ ఫారెస్ట్ జోన్‌లో ఉన్నాయి. ఈ ప్రదేశం ప్రస్తుత నివాస ప్రాంతానికి కొద్దిగా దూరంగా ఉండటం వలన, ఇది అతి తక్కువగా చెదిరిన, అసలైన ప్రదేశంగా ఉంది. ఇది తన ప్రామాణికతను, సమగ్రతను, అసలైన పర్యావరణ వ్యవస్థను నిలబెట్టుకుంటూ, ఒక సుందర దృశ్యాన్ని అందిస్తుంది. హిరే బెంకల్ స్మారక చిహ్నాల సమూహం ప్రాముఖ్యత ఏమాత్రం మారలేదు. సుస్పష్టమైన, స్వచ్ఛమైన, చెక్కుచెదరని ఆవరణ వ్యవస్థలో ఉన్న ఈ ప్రదేశం, గత కాలపు ఒక జాతి సమూహ భావజాలం, విశ్వాస వ్యవస్థల నిర్మాణపరమైన పరిణామాలను భవిష్యత్ తరాలకు ప్రదర్శించ డానికి ఒక అద్భుతమైన అవకాశాన్ని అందిస్తుంది. దెబ్బతిన్న నిర్మాణాలను పునఃస్థాపించడం, కీలకమైన ప్రదేశాలలో సంబంధిత సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం, అన్ని ముఖ్యమైన ప్రదేశాలను కలుపుతూ మార్గాలను నిర్మించడం మొదలైన వాటితో పాటు, బృహత్ శిలాయుగ ప్రజల బహుముఖ సాంస్కృతిక విజయాలను చాటిచెప్పే ఒక ప్రత్యేక మ్యూజియంను ఏర్పాటు చేయడం కూడా ఈ ప్రదేశం అభివృద్ధికి విస్తృత అవకాశాన్ని కల్పిస్తుంది.

– ఎన్. వంశీమోహన్
m : 98489 02520
e: vamsiglobal@gmail.com



# ప్రపంచ వారసత్వ గుర్తింపు దిశగా ముడుమాల్ మరో కీలక అడుగు

### ASI, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ, దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ సంయుక్త క్షేత్ర పరిశీలన

### ముడుమాల్‌కు అపారమైన పురావస్తు, ఖగోళ, సాంస్కృతిక ప్రాధాన్యం: ASI అధికారులు

నారాయణపేట జిల్లా కృష్ణ మండలం ముడుమాల్ గ్రామంలోని విశిష్ట మెగాలిథిక్ మెన్హిర్స్ ప్రదేశాన్ని 2026 ఆగస్టు 18న ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ASI), డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ (DHT), దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ (DHAT)కు చెందిన అధికారులు, పురావస్తు నిపుణులు సంయుక్తంగా పరిశీలించారు. యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు ప్రక్రియలో భాగంగా చేపట్టిన ఈ క్షేత్ర పరిశీలన ముడుమాల్ వారసత్వ ప్రస్థానంలో మరో కీలక ముందడుగుగా నిలిచింది.



ముడుమాల్‌లో విస్తారంగా ఉన్న మెగాలిథిక్ సమాధులు, మెన్హిర్లు, శిలావలయాలు, భారీ శిలలు, వాటి ప్రత్యేక అమరికలను అధికారులు పరిశీలించారు. వాటి పురావస్తు ప్రాధాన్యం, ఖగోళ సంబంధాలు, సూర్యగమనంతో ముడిపడిన అంశాలు, సహజ భూదృశ్య విశిష్టత, సంరక్షణ అవసరాలపై క్షేత్రస్థాయిలో చర్చించారు.

**ప్రపంచ వారసత్వ గుర్తింపునకు విశిష్టమైన ప్రదేశం: –డా. నిహిల్ దాస్**

ASI హైదరాబాద్ సర్కిల్ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ డా. నిహిల్ దాస్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వ వారసత్వ శాఖ సంరక్షణలో ఉన్న ముడుమాల్ మెగాలిథిక్ ప్రదేశం ఇప్పటికే యునెస్కో ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చోటు సంపాదించిందన్నారు. దీనిని ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చే లక్ష్యంతో డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ, దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ అవసరమైన అధ్యయనాలు, శాస్త్రీయ పరిశోధనలు, డాక్యుమెంటేషన్ చేపడుతున్నాయని తెలిపారు.

ముడుమాల్‌లోని మెగాలిథిక్ సమాధులు, మెన్హిర్లు, శిలావలయాలు, భారీ శిలలు, వాటి ప్రత్యేక అమరికలు అత్యంత అరుదైనవని పేర్కొన్నారు. ఈ శిలా నిర్మాణాలకు ఖగోళ అంశాలు, సూర్యగమనంతో ఉన్న సంబంధం ప్రదేశానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తోందన్నారు. యునెస్కో ప్రపంచ వారసత్వ పరిభాషలో 'అసాధారణ విశ్వవ్యాప్త విలువ' Out-standing Universal Value (OUV)ను నిర్ధారించడంలో ఇటువంటి విశిష్ట లక్షణాలు ఎంతో ప్రాధాన్యం కలిగి ఉంటాయని వివరించారు.

కేరళ నుంచి తెలంగాణ వరకు దక్షిణ భారతదేశంలోని అనేక మెగాలిథిక్ ప్రదేశాలను తాను పరిశీలించానని డా. నిహిల్ దాస్ తెలిపారు. అయితే ముడుమాల్‌లో ఇంత విస్తారమైన ప్రాంతంలో, ఒకేచోట ఇంత పెద్ద సంఖ్యలో మెన్హిర్లు, శిలావలయాలు, ఇతర శిలా అమరికలు కనిపించడం అత్యంత విశిష్టమన్నారు. సుమారు రెండు నుంచి మూడు వేల సంవత్సరాల నాటి ఈ వారసత్వ సంపద పురావస్తు, ఖగోళ, సాంస్కృతిక, సహజ భూదృశ్యాల పరంగా అపారమైన ప్రాధాన్యం కలిగి ఉందని పేర్కొన్నారు.

ముడుమాల్‌ను కేవలం సంరక్షించడమే కాకుండా, దాని సహజ స్వరూపానికి ఎలాంటి భంగం కలగకుండా సమగ్ర సైట్ మేనేజ్‌మెంట్ ప్రణాళికను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో దీనిని విశిష్టమైన 'మెగాలిథిక్ హెరిటేజ్ పార్క్'గా తీర్చిదిద్దే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. దీనివల్ల వారసత్వ పరిరక్షణతోపాటు బాధ్యతాయుతమైన సాంస్కృతిక





పర్యాటకం అభివృద్ధి చెంది, స్థానిక సమాజానికి ఉపాధి, ఆర్థిక అవకాశాలు లభించే వీలుందని తెలిపారు.

ముడుమాల్ సంరక్షణ, అధ్యయనం, ప్రపంచస్థాయి గుర్తింపు కోసం నిరంతరం కృషి చేస్తున్న దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ ప్రొ. మణికొండ వేదకుమార్, సంబంధిత బృందాన్ని ఆయన అభినందించారు. ఈ ప్రదేశం సంరక్షణ, నిర్వహణ, అభివృద్ధి ప్రక్రియకు ASI తరపున అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

**సహజ స్వరూపాన్ని కాపాడుతూ సంరక్షించాలి:**
**–డా. రోహిణి పాండే అంబేకర్**

ASI అసిస్టెంట్ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ డా. రోహిణి పాండే అంబేకర్ మాట్లాడుతూ, దాదాపు రెండు దశాబ్దాలుగా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్న తనకు ముడుమాల్ సందర్శన ఒక ప్రత్యేక అనుభూతిని కలిగించిందన్నారు.

ఇక్కడి మెగాలిథిక్ సమాధులు, శిలావలయాలు, మెన్హిర్లు, వాటికి ఖగోళ అంశాలతో ఉన్న సంబంధం ఈ ప్రదేశానికి అరుదైన గుర్తింపును ఇస్తున్నాయని తెలిపారు. విస్తారమైన సహజ భూదృశ్యంలో కనిపించే ఈ పురాతన శిలా నిర్మాణాలు ఆనాటి సమాజ జీవన విధానం, అంత్యక్రియల సంప్రదాయాలు, ప్రకృతి–ఖగోళ పరిజ్ఞానాన్ని అధ్యయనం చేసేందుకు విలువైన ఆధారాలని పేర్కొన్నారు.

ముడుమాల్ సహజ స్వరూపాన్ని దెబ్బతీయకుండా సంరక్షించడమే అత్యంత ముఖ్యమని ఆమె స్పష్టం చేశారు. వారసత్వ ప్రదేశంలో అనవసరమైన కృత్రిమ నిర్మాణాలు, భారీ సౌకర్యాలు ఏర్పాటు చేయకుండా, సందర్శకులు ప్రకృతితో మమేకమై ఈ ప్రాచీన సంపదను ప్రత్యక్షంగా అనుభవించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వాహనాల వినియోగాన్ని పరిమితం చేసి, సందర్శకులు నడుచుకుంటూ ప్రదేశాన్ని పరిశీలించే విధానాన్ని ప్రోత్సహించాలని కోరారు.

దేశవిదేశాల నుంచి పురావస్తు పరిశోధకులు, విద్యార్థులు, పర్యాటకులు, వారసత్వ ప్రేమికులు ముడుమాల్‌ను సందర్శించి దాని విశిష్టతను తెలుసుకోవాలని ఆకాంక్షించారు. ప్రదేశంలోని ప్రతి అంశాన్ని ఆసక్తితో, సూక్ష్మంగా వివరించిన ప్రొ. మణికొండ వేదకుమార్, ప్రొ. కె.పి. రావులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.








### ప్రపంచ వారసత్వ ప్రక్రియలో కీలక దశ:

**-ప్రొ. మణికొండ వేదకుమార్**

దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ ప్రొ. మణికొండ వేదకుమార్ మాట్లాడుతూ, ముడుమాల్ మెగాలిథిక్ మెన్హిర్స్ ప్రదేశాన్ని యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చే ప్రక్రియలో ఈ సంయుక్త క్షేత్ర పరిశీలన అత్యంత కీలకమైన ముందడుగని పేర్కొన్నారు.

భారతదేశంలోని ప్రపంచ వారసత్వ ప్రదేశాలకు సంబంధించిన ప్రతిపాదనలు, ప్రాథమిక పరిశీలనలు, నామినేషన్ డోసియర్ తదితర ప్రక్రియల్లో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ నేపథ్యంలో ASI హైదరాబాద్ సర్కిల్‌కు చెందిన డా. నిహిల్ దాస్, డా. రోహిణి పాండే అంబేకర్ తదితర అధికారులు ముడుమాల్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించడం ఎంతో ప్రాధాన్యం సంతరించుకుందని తెలిపారు.

డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ (DHT), దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ (DHAT), ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ASI), నారాయణపేట జిల్లా యంత్రాంగం సంయుక్తంగా చేపట్టిన ఈ పరిశీలన ముడుమాల్ పురావస్తు, ఖగోళ, చారిత్రక, సాంస్కృతిక విశిష్టతలను మరింత సమగ్రంగా అధ్యయనం చేసేందుకు దోహదపడుతుందని అన్నారు.

ప్రపంచ వారసత్వ గుర్తింపు ప్రక్రియలో భాగంగా ప్రాథమిక అంచనా Preliminary Assessmentకు సంబంధించిన ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి పంపిందని తెలిపారు. ప్రస్తుత సంయుక్త క్షేత్ర పరిశీలనతో తదుపరి ప్రక్రియ మరింత వేగంగా ముందుకు సాగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ASI అధికారులు చేసిన సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకొని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్‌రావు కూతాడి సమన్వయంతో అవసరమైన అధ్యయనాలు, శాస్త్రీయ డాక్యుమెంటేషన్, మ్యాపింగ్, సంరక్షణ విధానాలు, సమగ్ర సైట్ మేనేజ్‌మెంట్ ప్రణాళికకు సంబంధించిన అంశాలను పూర్తి చేసి ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు.

### విద్యార్థులకు వారసత్వ అవగాహన

సంయుక్త క్షేత్ర పరిశీలనలో భాగంగా జిల్లా అధికారుల సమన్వయంతో ముడుమాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నిజాముద్దిన్ (మండల విద్యాధికారి) అధ్యక్షతన ప్రత్యేక వారసత్వ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పురావస్తు, వారసత్వ రంగ నిపుణులు విద్యార్థులతో ముచ్చటిస్తూ ముడుమాల్ మెగాలిథిక్ ప్రదేశం పురావస్తు, చారిత్రక, ఖగోళ, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని వివరించారు.

తమ గ్రామ పరిసరాల్లో ఉన్న ఈ అమూల్యమైన వారసత్వ సంపదపై విద్యార్థులు అవగాహన పెంచుకొని, దానిని భావితరాలకు అందించే బాధ్యతను స్వీకరించాలని సూచించారు. శిలా నిర్మాణాలకు హాని కలిగించకుండా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో వారసత్వాన్ని పరిరక్షించాల్సిన అవసరాన్ని నిపుణులు వివరించారు.

ముడుమాల్ మెగాలిథిక్ వారసత్వ సంపదను శాస్త్రీయంగా సంరక్షిస్తూ, దాని సహజ స్వరూపాన్ని కాపాడుతూ, యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, నిపుణులు, జిల్లా యంత్రాంగం, స్థానిక సమాజం సమన్వయంతో ముందుకు సాగాలని అధికారులు అభిప్రాయపడ్డారు.

ముడుమాల్‌ను ప్రత్యేకంగా సందర్శించి విలువైన సూచనలు చేసిన ASI అధికారులకు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెరిటేజ్ తెలంగాణ, నారాయణపేట జిల్లా యంత్రాంగానికి, ప్రొ. కె.పి. రావు, క్షేత్ర ఆర్కిటెక్ట్ బృందం, స్థానిక అధికారులకు, ముడుమాల్ గ్రామ ప్రజలకు ప్రొ. మణికొండ వేదకుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

**-ఖైజర్ భాషా,**
కోఆర్డినేటర్
దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్
మొబైల్: 90306 26288



# మల్ఖా చేయూత.. ఆర్గానిక్ చేనేత

చేనేత కార్మికుల కళా నైపుణ్యంతో సిరిసిల్ల ఖ్యాతి ప్రపంచ వ్యాప్తమైంది. అగ్గిపెట్టెలో ఇమిడే చీరనేసిన సిరిసిల్ల మగ్గంపై మరెన్నో ఆవిష్కరణలు చేసింది. ఆ వారసత్వానికి కొనసాగింపుగా సేంద్రియ సాగులో పత్తిని పండించి, రసాయనాలు లేని రంగులద్ది, మగ్గంపై వస్త్రాలను నేస్తూ మార్కెట్‌లో మళ్లీ విజయాలు సాధిస్తున్నది. మల్ఖా సంస్థ చేయూత తంగళ్లపల్లి చేనేతకు చేవనిచ్చింది. పర్యావరణానికీ మేలు చేస్తున్నది.

సిరిసిల్ల ప్రాంతం ఎప్పటి నుంచో చేనేతకు పట్టుగొమ్మగా పేరుగాంచింది. ఆ రోజుల్లో వేలాదిమంది చేనేత కార్మికులు పనిచేసేవాళ్లు. మార్కెట్లోకి అడుగుపెట్టిన మిల్లు వస్త్రాలు చేనేత కార్మికుల ఉపాధిని పోగొట్టాయి. గడిచిన అయిదు దశాబ్దాల్లో చేనేత రంగం అనేక మార్పులకు లోనైంది. సంక్షోభాలను ఎదుర్కొంది. ఆ సంక్షోభ కాలంలో చేనేత కార్మికుల కోసం సిరిసిల్లలో మల్ఖా సంస్థ అడుగుపెట్టింది. చేనేత కార్మికులకు ముడి సరుకులిచ్చి వాళ్ల ఉత్పత్తులను సేకరించడం మొదలుపెట్టింది. ఆ ప్రయత్నం కూడా మరమగ్గాల ధాటికి నిలువలేకపోయింది.

### సంక్షోభ కాలంలో...

చేనేత రంగంలో ఉపాధి లేకపోవడం ఒక సమస్య, పరిశ్రమ వల్ల పర్యావరణ కలుష్యం మరో సమస్య. ఈ రెండు సమస్యలకు పరిష్కారం సేంద్రియ పద్ధతులను ఆదరించడమే. కాబట్టి పర్యావరణాన్ని కాపాడేందుకు, సంప్రదాయ చేనేతను ప్రోత్సహించేందుకు మల్ఖా సంస్థ రెండు దశాబ్దాల కిందట ఓ ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. తంగళ్లపల్లి (నేటి రాజన్న సిరిసిల్ల జిల్లా)లోని ఒక చేనేత సహకార సంఘానికి ఆర్థిక చేయూతనిచ్చింది. స్థానిక రైతులు, చేనేత కార్మికులు సమన్వయంతో ఆర్గానిక్ కాటన్‌ని మగ్గంపై ఉత్పత్తి చేసేందుకు మల్ఖా సంస్థ ప్రణాళికలు రూపొందించింది. రైతులకు దేశవాళీ పత్తి విత్తనాలను అందించింది. సాగులో పర్యావరణానికి హానిచేసే రసాయనాలు వాడకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూపింది. సేంద్రియ పద్ధతుల్లో పురుగు మందులు తయారు చేసుకునేలా రైతులకు శిక్షణ ఇచ్చింది. రైతులు పండించిన ఆ పంటను మల్ఖా సంస్థే కొనుగోలు చేసింది. ఆ పత్తిని చేనేత సహకార సంఘానికి అందించి, మగ్గంపై వస్త్రం నేసేలా ప్రోత్సాహించింది. పత్తి నుంచి విత్తనాలు సేకరించి మరో పంటకు వినియోగించేలా తోడ్పాటును అందించింది.

### సిరిసిల్ల నుంచి విదేశాలకు

కొన్నేండ్లపాటు చేనేతను వదిలేయడంతో పాడైపోయిన మగ్గాలను మల్ఖా సంస్థే మరమ్మతులు చేయించింది. సేంద్రియ పద్ధతిలో పండిన పత్తితో దారం తీసి, మగ్గంపై వస్త్రం నేసి, హాని కారక రసాయనాలు లేని రంగులు అద్దేలా మల్ఖా చేనేత కార్మికులను ప్రోత్సహించింది. సంస్థ సహకారంతో పద్నాలుగు మగ్గాలపై సేంద్రియ వస్త్రాలను ఉత్పత్తి చేస్తున్నారు. తంగళ్లపల్లి మగ్గాలపై చీరలు, డ్రెస్ మెటీరియల్, లుంగీలు, తువ్వాలలు, దుప్పట్లు తయారు చేస్తున్నారు. ఈ వస్త్రాలను చేనేత కార్మికుల నుంచి మల్ఖా సంస్థే కొనుగోలు చేస్తుంటుంది. వాటిని హైదరాబాద్, ఇతర నగరాల్లో విక్రయిస్తున్నది. ఈ ప్రయోగానికి ఆదరణ ఉండటంతో ఇరవై ఏళ్లుగా ఆర్గానిక్ కాటన్ ఉత్పత్తి చేస్తూనే ఉంది. ఒకప్పుడు అన్నం పెట్టని మగ్గం చేనేత కార్మికులకు భరోసానిచ్చింది. ఆర్గానిక్ కాటన్‌కి దేశంలోని నగరాల్లోనే కాదు విదేశాల్లో కూడా డిమాండ్ ఉంది. జర్మనీ, జపాన్ దేశాల ప్రతినిధులు మల్ఖా చేనేత కేంద్రాన్ని సందర్శించారు. మల్ఖా సంస్థ ద్వారా అనేక దేశాలకు స్థానిక చేనేత ఉత్పత్తులు ఎగుమతి అవుతుండటం విశేషం. ఈ ప్రయాణం మరింత ఉన్నతంగా కొనసాగాలని మనమూ ఆశిద్దాం!

*(నమస్తే తెలంగాణ సౌజన్యంతో)*

# జాంబవంతుడు క్షేత్ర పాలకుడుగా ఉన్న దేవాలయం ఎప్పుడన్నా చూశారా!

తల్లికోసం త్యాగం చేసిన మహామహులలో అగ్రగణుడుగా గరుడుడు గుర్తించబడుతాడు. తన తల్లి దాస్యవిముక్తి కొరకు దేవతలను నియంత్రించి అమృతాన్ని సంపాదించిన మహాబలశాలి. శ్రీ మహావిష్ణువుకు శరణాగతులు కావడం వలన ఆయన వాహన మయ్యాడు. ఇంతటి బలవంతుడు, వేగంగా ప్రయాణించువాడు. తీక్షణమైన చూపు కలవాడు, మేఘాలపైన విహరించువాడు శ్రీ మహావిష్ణువు వాహనమైన గరుడుడు నాగద్వేషి అయినప్పటికి ఎనిమిది రకాల నాగుల (అష్ట నాగులు)ను సంహరించడు. వారిని తన ఆధీనములో వుంచుకొని నియంత్రిస్తాడు అని పురాణగాధలు తెలియజేస్తున్నాయి.



**ఎవ్వరు ఈ అష్టనాగులు?**

*"అనంతం వాసుకిం శేషం పద్మనాభంచ*
*కంబలం / తక్షకం కార్కోటకం శుభం*
*మౌంజం చ ఐరావతం తథా"*

ఎటువంటి సర్పదోషము మరియు సర్పకాటుకు గురికాకూడదని ప్రతి రోజు ఉదయాన్నే ఈ మంత్రాన్ని చదువుతారు. తూర్పుదిశ యందు అనంతుడు అనే సర్పము, ఆగ్నేయ దిశకు వాసుకి, దక్షిణదిశకు తక్షకుడు, నైరుతి దిశకు కర్కోటకుడు, పడమర దిశకు పద్మడు, వాయువ్యం మహాపద్ముడు, ఉత్తరం శంఖపాలుడు మరియు ఈశాన్యదిశ యందు గుళికుడు అనే సర్పములు రక్షణగా వుంటారని హిందువుల నమ్మకం. ఈ ఎనిమిది రకాల విషసర్పాలు ఎనిమిది దిక్కులకు ప్రతినిధిలుగా పేర్కొంటారు. ఈ ఎనిమిది రకాల విషనాగులను నియంత్రించి వారిని ఆభరణాలుగా ఉంచుకోవడం వలన సమస్త విషాలను తన నియంత్రణలో గరుడుడు వుంచుకున్నాడు అనే అర్థమౌతుంది.

| వాయువ్యము | | ఉత్తరం | | ఈశాన్యము |
|---|---|---|---|---|
| | మహాపద్ముడు | శంఖపాలుడు | గుళికుడు | |
| పడమర | పద్ముడు | | అనంతుడు | తూర్పు |
| | కర్కోటకుడు | తక్షకుడు | వాసుకి | |
| నైరుతి | | దక్షిణము | | ఆగ్నేయము |

**అష్టనాగులను గరుడుడు ఎందుకు సంహరించడు?**

నాగుల యందు స్వభావసిద్ధమైన వైరము కలిగినప్పటికి లోకాధార శక్తులైన ఎనిమిది నాగుల మీద శత్రుత్వము లేక నియంత్రించు అధికారము కలిగియున్నాడు. ఎందుకు అలా వున్నాడో తెలుసుకోవలిసిన ఆవశ్యకత ఎంతైనా వుంది.

**1) తూర్పు దిక్కున పాలిస్తున్న అనంతుడు:** అనంతుడు అనే సర్పము భూమిని మోస్తుందనే నమ్మకం కలిగిన వారు హిందువులు, అంతేకాదు అనంతుని మీద విష్ణువు శయనిస్తాడు అనే నమ్మకం.

**2) ఆగ్నేయ దిక్కులో వున్న వాసుకి:** సముద్ర మథనంలో విష్ణువు కూర్మముకాగా, గరుడుడు తెచ్చిన మందర పర్వతం కవ్వముకాగా, వాసుకి తాడుగా మారి అమృతం వచ్చేందుకు దోహదకారి అయినది.

**3 & 4) దక్షిణ మరియు నైరుతి దిక్కులో వున్న తక్షకుడు మరియు కర్కోటకుడు:** సామాన్య నాగులైతే అదుపు తప్పిన శక్తికి లోబడి వుంటారు. కాని తక్షకుడు మరియు కర్కోటకుడు నియంత్రించిన శక్తిని కలిగిన వారు మరియు ధర్మనిరతికి లోబడి వుంటారు. (పరీక్షిత్ కథ మరియు నలమహారాజు కథ).

**5 & 6) పడమర మరియు వాయువ్య దిశలో వున్న పద్ముడు మరియు మహాపద్ముడు:** సృష్టి మరియు సంపదకు మూలమైన ధర్మబద్ధ శక్తిని రక్షించువారు.

**7) ఉత్తర దిశలో వున్న శంఖపాదుడు:** దానశీలుడుగా గుర్తించబడ్డవాడు.

**8) ఉత్తర దిశలో వున్న గుళికుడు:** శుద్ధి పరివర్తన కోసం వున్న శక్తిగా గుర్తించబడ్డవాడు.

పైన పేర్కొనబడిన అష్టనాగులు గొప్ప గుణాలు కలిగి వుండడం వలన గరుడుడు వారిని తన దేహం నందు ధరించి అలంకారములుగా మార్చుకున్నాడు. ఇటువంటి అష్టనాగ అలంకార ప్రాయుడైన గరుడుని పూజించిన సర్పదోష నివారణం, రాహుకేత నివారణ దోషం తొలగునని హిందువుల నమ్మకం.

**గరుడుడు ధరించిన అష్టనాగుల స్థానములు:**

1) అనంతుడు – శిఖ (జుట్టు లేద తల)

2) వాసుకి - యజ్ఞోపవీతం
3) తక్షకుడు - కుడి చెవి కుండలం
4) కర్కోటకుడు - ఎడమ చెవి కుండలం
5) పద్ముడు - కుడి భుజం అభరణం
-6) మహాపద్ముడు - ఎడమ భూజం ఆభరణం
7) శంఖపాలుడు - నడుము వద్ద లేద మొలతాడు
8) గుళికుడు - కాలి అందెగా వుంటారు.

భారతదేశంలో ఎక్కువ భాగం గరుడుని విగ్రహములను వైష్ణవ సంప్రదాయ దేవాలయముల యందు గమనించగలం. శ్రీ కృష్ణుడు, రంగసాథస్వామి, చెన్నకేశవస్వామి, మహావిష్ణువు లేదా వెంకటేశ్వరస్వామి మూల విగ్రహములకు ఎదురుగ లేక స్థంభముల మీద మనకు గరుడుడు దర్శనమిస్తాడు. ఆంధ్రప్రదేశ్ నందు నెల్లూరు జిల్లా, సూళ్లూరుపేట నియోజవర్గము నందలి మన్నారు పోలూరు గ్రామము నందు శ్రీ సత్య జాంబవతి సమేతశ్రీ, అళఘు మల్లారి కృష్ణస్వామి దేవాలయం కలదు. జాంబవంతునితో శ్రీకృష్ణుడు శమంతకమణి కోసం యుద్ధం చేసిన ప్రదేశం ఇదేనని చెబుతారు. ఈ దేవాలయంలో సైతం వారు యుద్ధం చేసిన గుహను చూడవచ్చు. జాంబవంతుని గెలిచి శమంతకమణిని ఆయన కుమార్తె అయిన జాంబవతిని పరిణయమాడి తరువాత సత్రాజిత్తు కుమార్తె అయిన సత్యభామను సైతం పెళ్ళి చేసుకొన్నది అందరికి తెలిసిన విషయమే. ఈ దేవాలయం నందు గర్భగుడిలో భారతదేశంలో ఎక్కడలేని విధంగా జాంబవతి, సత్యభామల సమేతముగా శ్రీకృష్ణుడు పూజలందుకుంటున్నాడు. అంతేకాక ఈ క్షేత్రమునకు జాంబవంతుడు క్షేత్రపాలకుడుగా వుండడం మరియొక విశేషం. ఈ దేవాలయ అభివృద్ధికి అంచలంచలుగా చోళరాజుల కాలం నుండి విజయనగర రాజుల వరకు కొనసాగింది.

**మరియొక ప్రత్యేక ఆకర్షణ :**

ఈ దేవాలయము నందు రమారమి ఆరు అడుగుల ఎత్తుగల



సర్వభూషితుడైన ఖగరాజు - మన్నారు పోలూరు

ముకిలిత హస్తుడైన గరుడుని శ్రీకృష్ణుని సేవకునిగా మంటపంలో గమనించవచ్చు. ఈ గరుడునికి అద్భుతమైన ఈ గరుడ శిల్ప నిర్మాణము అందరిని ఆకట్టుకుంటుంది. సర్వాభూషిత అలంకారుడైన ఖగరాజు వుండడం ఇక్కడి ప్రత్యేకత.

**డా॥ జి.యస్.రామయ్య**
INTACH సభ్యులు - కర్నూలు జిల్లా చాప్టర్,
ఆంధ్రప్రదేశ్
m : 898 555 0007

## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన




**పెద్దలు రాసిన పిల్లల కథలు**
**(ఉమ్మడి పది జిల్లాలు)**
10 పుస్తకాల సెట్ ధర రూ.350.
తగ్గింపు ధర రూ.300
**ప్రతులకు**
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.
మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
**ఫోన్ : 9030 6262 88**
email: edit.chelimi@gmail.com
website : www.balachelimi.com

# మూలాల్లోకి తీసుకెళ్ళే నోస్టాల్జియా కథలు

ఊరు పేరు మీద రాసిన కథలు ఎక్కువగా గత స్మృతులే. సాహిత్యంలో నోస్టాల్జియా అనేది కేవలం గతాన్ని నెమరు వేసుకోవడం మాత్రమే కాదు. భావోద్వేగభరితమైన కథనం ద్వారా గతాన్ని, వర్తమానాన్ని అనుసంధానించడం. గతం అనేది వెచ్చదనాన్ని గుర్తు చేస్తుంది. కొన్ని సందర్భాలలో వేదనని కూడా కలుగ చేయవచ్చు. గత అనేది అశాశ్వతం. కానీ వ్యక్తుల మనస్సుల్లో శాశ్వతంగా ఆ ముద్రలు వుండవచ్చు.

ఫోటోలు కూడా గతం లాంటివే. అవి మనల్ని ఎక్కడికో తీసుకొని వెళ్తాయి. ఒక్క ఫోటోతో ఎన్నో జ్ఞాపకాలు చుట్టుముడతాయి. అప్పటి వాతావరణం మనుషులు, వాళ్ళ వేషధారణ, ఆ నవ్వులు ఇట్లా ఎన్నో కొన్ని ఫోటోల్లో వున్న వ్యక్తులు ఇప్పుడు లేకపోవడం, వాళ్ళ జ్ఞాపకాలు, చిన్ననాటి చిత్రాలు పిల్లల ఫోటోలు, మనం చూసిన ప్రాంతాలు అప్పటి సంఘటనలు ఇట్లా ఎన్నో మనకు గుర్తుకు వస్తాయి.



గతాన్ని తలచుకోవడం అంటే కేవలం విచారంగా వెనక్కి చూడటం మాత్రమే కాదు. కుటుంబం, స్నేహం, వూరు, మారిన ఇల్లు వంటి ఇతివృత్తాలను అన్వేషించడం. వేగంగా మారిపోతున్న ఈ ప్రపంచంలో గతాన్ని గుర్తు చేసే సాహిత్యం సాంత్వనను ఆత్మపరిశీలనను, ఒక కొత్త అర్థాన్ని అందిస్తుంది. మనం ఎవరమో మనమూలాలు ఎక్కడున్నాయో అది గుర్తు చేస్తుంది.

గతం గురించి చెప్పాలంటే ఎన్నో కథలను చెప్పవచ్చు. 'నేనూ నా సైకిల్' గురించి చెబుతాను. నా చిన్నప్పుడు మూడు గీరల సైకిల్ వుండేది. దాని మీద తిరగడం ఓ అద్భుత ప్రపంచంలా వుండేది. ఇంట్లోనే కాకుండా ఇంటి బయటకూడా సైకిల్‌మీద తిరిగేవాన్ని. కొంత పెద్దవాన్ని అయిన తరువాత నా మూడు గీరల సైకిల్ మూలబడింది. ఆ తరువాత పెద్దసైకిల్ తొక్కాలన్న కోరిక పెరిగిపోయింది. కానీ మా ఇంట్లో గతంలో వున్న మా బాపు సైకిల్ లేదు. కాస్త వయస్సు పెరగడంతో మా బాపు కాలి నడకన తన దవాఖానాకి పోవడం మొదలు పెట్టిండు. అందుకని మా హరి దుకాణం ప్రక్కన వున్న షాపు నుంచి సైకిల్‌ని కిరాయకు తీసుకొని తొక్కడం ప్రారంభించాను. సీటుమీద కూర్చుంటే పెడెల్‌కి కాళ్ళు అందేవి కాదు. అందుకని 'కైంచి' తొక్కడం ముందు నేర్చుకున్నాను. అందులో పరిపూర్ణత వచ్చిన తరువాత సీటు మీద నుంచి సైకిల్ తొక్కడం ప్రారంభించాను. మొదట్లో సైకిల్ ఎక్కడం కష్టంగా వుండేది. అందుకని ఏదైనా బండ దగ్గరలో సైకిల్‌ని పెట్టి సైకిల్‌ని తొక్కడం, ఆ తరువాత వాటి సహాయం లేకుండా సైకిల్ తొక్కడం ప్రారంభించాను. కొద్దిరోజుల తరువాత సైకిల్ తొక్కే మోజు తగ్గిపోయింది.


డిగ్రీ చదువుకి వచ్చిన తరువాత సైకిల్ అవసరం ఏర్పడింది. కరీంనగర్‌లో మా రాధక్క దగ్గర వుండేవాన్ని. మా అక్క ఇల్లు కాలేజీకి దూరం. అందుకని సైకిల్ ఆవశ్యకత ఏర్పడింది. దాన్ని మూడు నెలలకొకసారి ఓవర్ ఆయిలింగ్ చేయించేవాన్ని. మా అక్క ఇంటి దగ్గరలో వున్న రాజనర్సు చేసేవాడు.

డిగ్రీ చదువు అయిపోయిన తరువాత సైకిల్ అవసరం లేకుండా పోయింది. నా సైకిల్ ఏమైందో నా స్ఫురణలో లేకుండా పోయింది. ఆ తరువాత యూనివర్సిటీ అక్కడ సైకిల్ అవసరం లేదు. ఆ తరువాత న్యాయవాది. వేగం పెరిగింది. స్కూటర్ వచ్చేసింది. ఆ తరువాత న్యాయమూర్తి అయ్యాను. మారుతి కారు వచ్చేసింది.

కొంతకాలం తరువాత స్టేషనరీ సైకిల్ వచ్చేసింది. విల్లాకు

మారిన తరువాత మళ్లీ సైకిల్ అవసరం ఏర్పడింది. డిగ్రీ అయిపోయిన తరువాత సైకిల్ అవసరం వుండదని అనుకున్నాను. కానీ ఇంతకాలం తరువాత సైకిల్ అవసరం ఏర్పడింది ఆరోగ్యరీత్యా.

సైకిల్‌ని గుర్తు చేసుకున్నప్పుడల్లా చిన్నప్పటి స్నేహితులు, కాలేజీ మిత్రులు, కరీంనగర్ జీవితం, రాజనర్సూ ఇట్లా ఎన్నో గుర్తుకు వస్తాయి. మనస్సు గతంలోకి ప్రయాణం చేస్తుంది. సైకిల్ అంటే కనిపించే సైకిల్ మాత్రమే కాదు. జీవితమే ఓ సైకిల్ అన్న విషయం బోధపడింది. అంటే అదే జీవిత చక్రం. దూరమైన వాళ్ళు దగ్గరికి, దగ్గరగా వున్న వ్యక్తులు దూరంగా, ఇదీ జీవిత చక్రం అనిపిస్తుంది. ఇదీ కథ.




ఒక్క సైకిల్ ఎన్నింటిని గుర్తుకు తెస్తుంది. చిన్నపటి వాతావరణం, స్నేహితులూ, కిరాయి సైకిల్, స్వంత సైకిల్, కాలేజీ మిత్రులు ఇట్లా ఎన్నో.. గతంలోకి ప్రయాణం. ఆ తరువాత స్టేషనరీ సైకిల్, మళ్ళీ తిరిగి సైకిల్. కథలోని ముగింపు ఆలోచింపచేస్తుంది. దగ్గరగా వున్న వ్యక్తులు దూరమపోవడం, దూరమైన వ్యక్తులు దగ్గర కావడం. ఇదీ జీవిత చక్రమని అర్థం కావడం. గతం గతంతో అయిపోదు. వర్తమానంతో కలిసి వుంటుంది.

నోస్టాల్జియా ఎప్పుడూ వర్తమానంలో నిలబడి గతాన్ని తొంగి చూస్తుంది. చాయ్‌లో డబుల్ రొట్టెను ముంచుకోవడం, సైకిల్ బెల్లు మోగడం లాంటివి ఇచ్చే అనుభూతి మన మనస్సుని తడతాయి. ఊరి పేరు మీద వచ్చిన కథలు – అవి మా వేములవాడ కథలు కావొచ్చు. అమరావతి కథలు కావొచ్చు. పసలపూడి కథలు కావొచ్చు. భట్టిప్రోలు కథలు కావొచ్చు. నాకు తెలిసె ఈ కథలన్నీ నోస్టాల్జియాకి అత్యుత్తమ నిదర్శనాలుగా నిలుస్తాయి. ఊరుపేరు అనేది ఒక భౌగోళిక గుర్తు కాదు. అదొక జీవన విధానం. ఒక సంస్కృతి. కొన్ని తరాల జ్ఞాపకాల సమాహారం.

ఒక ఊరుపేరు, ఒక వస్తువు పేరు మనిషి వర్తమానాన్ని మరిచి వాళ్ళ వూరి వీధుల్లోకి పరిగెడుతాడు. బాల్యపు జ్ఞాపకాలు అతన్ని వెంటాడుతాయి. అవి బడి కావొచ్చు. చెరువు కావొచ్చు, పాతాళ గరిగె కావొచ్చు.

ఊరి పేరు మీద రాసిన కథలు వ్యక్తి గత జ్ఞాపకాలను దాటి ఒక సమూహపు జ్ఞాపకాలని ఆవిష్కరిస్తాయి.

నోస్టాల్జియా అనేది మన మనస్సుపై ఆధారపడి వుంటుంది. అదొక రకమైన సువాసన. ఓ శ్రావ్యమైన సంగీతం. నోస్టాల్జియా కథలు భావోద్వేగ భరితంగా వుంటాయి.

కథలు చెప్పడం తేలిక. కానీ కథలు రాయడం అంత సులువు కాదు. ఊరు పేరుతో ఊరి కథలు రాయాలంటే ఆ వూరు పట్ల భావావేశం వుండాలి.


జ్ఞాపకాలు ఎప్పుడూ ఆనందభరితంగా వుండాలని లేదు. బాల్యం అందరిదీ ఒకే విధంగా వుండదు. ఏది ఎట్లా వున్నా గతాన్ని వర్తమానం నుంచి అందరూ దర్శిస్తారు.

తీవ్రమైన వేగంలో వున్న జీవితంలో నాస్టాల్జియా అనేది ఓ విరామం. అది మనస్సున స్వాంతన పరుస్తుది. నోస్టాల్జియా అనేది కాలంలో రచయిత జరిపే తీపి-చేదు సంభాషణ.

ఊరిపేర్లమీద రాసిన కథలు మనల్ని మన మూలాల్లోకీ తీసుకొని వెళ్తాయి. ఒక చిన్న జ్ఞాపకం ఓ పెద్ద ఆలోచనకు దారితీస్తుంది. భవిష్యత్తు నూతన స్ఫూర్తిని కలిగిస్తుంది.

–డా॥ మంగారి రాజేందర్ (జింబో)
m : 9440483001
e : rajenderzimbo@gmail.com

## పర్యావరణంపై ప్రత్యేక వ్యాసాలు




**మన దక్కన్‌ల్యాండ్** మాసపత్రికలో పర్యావరణం, వారసత్వం, విపత్తుల నివారణ, గ్రామీణ పట్టణ ప్రణాళిక, వ్యవసాయ రంగం, వైద్య, విద్య, సహజ వనరుల పరిరక్షణ మరియు సద్వినియోగం, జీవ వైవిధ్యం, జీవన విధానంపై కథనాలు, వ్యాసాలు, ఇంటర్వ్యూల పట్ల దృష్టి సారించాలని దక్కన్‌ల్యాండ్ ఎడిటోరియల్ బోర్డు భావిస్తున్నది. ఇందుకు మీ అందరి సహాయ సహకారాలు కోరుతున్నాం. పర్యావరణ, జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం.

**రచయితలు పై అంశాల మీద లోతైన విశ్లేషణలు, విషయాలతో తమ కథనాలను పంపగలరు.**

చిరునామా :

DECCAN LAND : **"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com www.deccanland.com

TELANGANA RESOURCE CENTRE

# సైన్స్ ఫిక్షన్ ప్రక్రియ గురించి విశేష కృషి చేసిన
# భోళాశంకరుడు కె సదాశివరావు

**1990** నుంచి ప్రతి ఏటా తమకు నచ్చిన తెలుగు కథలను వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ ఎంపికచేసి ప్రచురిస్తున్నారు. మొదటి పాతికేళ్ళలో అంటే 2014 దాకా వెలువడిన 339 కథల నుంచి 336 కథలను 2018లో మనసు ఫౌండేషన్ రెండు బృహత్ సంపుటాలుగా వెలువరించింది. అయితే ఇందులో మిస్సయిన వాటిలో రెండు సదాశివరావు కథలు కాగా, మరోటి రంగనాయకమ్మది. కె. సదాశివరావు తన 'మానవఫాక్టర్', మరో బహుమతి కథను చేర్చడానికి రచయిత అనుమతి ఇవ్వలేదు!

అటువంటి విలక్షణమైన పోలీసు అధికారి, నిత్య చదువరి, కథారచయిత, వ్యాసకర్త, అధ్యయనశీలి, అనువాదకుడు, ఫోటోగ్రాఫర్, చిత్రకారుడు, బోళాశంకరుడు, కోపిష్టి, స్నేహశీలి, సినిమా ప్రియుడు, విందులు ఇచ్చేవాడు, ఫోన్ లో కూడా గదమాయించేవాడు. ఇలా చాలా! 1943 జూలై 15న కృష్ణాజిల్లాలో జన్మించిన కె. సదాశివరావు శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీలో ఎం.ఎస్సి. జియాలజి చదివి 1967లో ఐ.పి.ఎస్. ఆఫీసరయ్యారు. పోలీసు ఆఫీసరుగా వారి సేవలు మనకు తెలియదు, కానీ రచయితగా, వ్యక్తిగా ఆయన చాలా విలక్షణమైన వ్యక్తి!



సదాశివరావు గారు చనిపోగానే చాలామంది మిత్రులు ఫేస్బుక్ లో ఎన్నో విషయాలు రాశారు. సదాశివరావు మితి లేని అతి అభిమానాన్ని భరించలేని సంగతులు కూడా బోలెడు చెప్పారు. పాతికేళ్ళ క్రితం, 1996లోనో లేదా 1997లోనో వారు ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి వచ్చినప్పుడు కలిశాను. తన సైన్స్ ఫిక్షన్ 'మానవఫాక్టర్' కథను 'మహావిశ్వ' పేరుతో విజయవాడ ఆకాశవాణి కేంద్రం నాటకంగా రూపొందించింది. ఆ కథ 1991లో ఇండియా టుడే తెలుగు పక్షపత్రికలో తొలుత వచ్చింది. ఇంటర్వ్యూ చేయాలంటే స్టూడియోకి వచ్చి, అరగంట కబుర్లు ఆయనే చెప్పి, అంతలోనే ఎందుకో వాయిదా వేసి, సరాసరి వెళ్ళి పోయిన వ్యక్తి ఆయన! స్టూడియో బయట తర్వాత రికార్డు చేయాల్సిన వాళ్లు వేచి ఉండగా వారు ఈ ఘనకార్యం చేసి వెళ్లారు.

ఈ పాతికేళ్ళలో వారిని కలిసింది తక్కువ, కానీ వారి ఫోన్లు అందుకుంది ఎక్కువ! పాపం, వారు చాలాసార్లు ఆహ్వానించారు తమ ఇంటికి. నేనుండే బేగంపేటకు ఆయనుండే ధరమ్ కరన్ రోడ్ దగ్గర కూడా చాలా దగ్గరే, అయితే వెళ్ళే తీరిక ఉండేది కాదు! "ఏమిటీ ఉద్యోగం, రోజంతా చేస్తుండటమేనా?", అని ఫోన్ లో రెగ్యులర్ గా గదమాయిస్తూనే వుండేవాడు. వెళ్ళాలనే నేను భావిస్తున్న సమయంలో ఓ సంఘటన జరిగింది!

సైన్స్ భావనలు ఆధారంగా సాగే ఊహలకు కల్పన జోడించి కథగానీ, నవలగానీ, నాటకం గానీ అల్లితే దానిని 'సైన్స్ ఫిక్షన్' అంటాం. తెలుగులో ఈ సాహితీ ప్రక్రియ 1927 నుంచి మొదలైనా, పెద్ద సంఖ్యలో కథలు, నవలలు, నాటకాలు రాలేదు. తెలుగు సైన్స్ ఫిక్షన్ కథాసాహిత్యానికి సంబంధించిన ఒక సంకలనం కోసం కథలు ఎంపిక చేయమనే బాధ్యతను సాహిత్య అకాడమీ నాకు 2012లో ఇచ్చింది. తెలుగు కథలను చదివి వాటిలో సైన్స్ ఫిక్షన్ ను విడదీసి, వాటిలో మెరుగైన వాటిని ఎంపిక చేసి ఇవ్వడమే పని.

ఆ విషయం వారికి తెలిసినట్టుంది, "ఆ ఎంపిక చేసిన కథలను తీసుకుని ఒకసారి ఇటు రా", అని ఫోన్ లో ఆర్డర్ జారీ చేశారు సదాశివరావు! ఈ సంఘటన తర్వాత వారినసలు కలవకూడదని నిర్ణయించుకున్నాను. ఆ మాట చెప్పకుండా నేను దాట వేస్తూ ఆయన దగ్గరకు వెళ్ళలేదు. సాహిత్య అకాడమీ 2017లో 'వైజ్ఞానిక కథలు' (తెలుగు సైన్స్ ఫిక్షన్) పేరుతో వెలువరించిన 364 పేజీల సంకలనంలో 1927-2009 మధ్యకాలంలో తెలుగులో వెలువడిన 27 కథలున్నాయి.

కె. సదాశివరావు సైన్స్ చదువుకున్నారు. ఆంగ్లం విరివిగా చదివారు. ప్రతి ఏటా నోబుల్ సాహిత్య బహుమతి ప్రకటించగానే వారి గురించి విపులంగా వ్యాసాలు తరచు రాసేవారు. అంతకు మించి వారు సైన్స్ ఫిక్షన్ ప్రక్రియ గురించి చాలా అధ్యయనం చేశారు. 'ఆత్మఫాక్టర్' అనే సైన్స్ ఫిక్షన్ కథలు (2016) అనే 476 పేజీల గ్రంథంలో సాధికారకమైన ప్రక్రియాపరమైన ఉపోద్ఘాతంతో పాటు తను రాసిన 14 సైన్స్ ఫిక్షన్ కథలున్నాయి. ఇవి కాక సైన్స్ ఫిక్షన్ రచయితలు మేరీ షెల్లీ, హెచ్ జివెల్స్, జూల్స్ వెర్న్, ఐజాక్ అసిమోవ్, ఆర్థర్ సిక్లార్క్, ఎడ్గార్ అలన్ పో ఇత్యాది 10 మంది గురించి విలువైన వ్యాసాలున్నాయి. తర్వాత 'సైన్స్ ఫిక్షన్ రచయితలు' పేరున నాలుగు విలువైన సంపుటాలు వెలువడ్డాయి.




తెలుగు సైన్స్ ఫిక్షన్ గురించి సదాశివరావు ప్రేమ, కృషి చాలా ప్రత్యేకమైనది. కథలు సృజించే రచయితే ఆ ప్రక్రియను కూడా పరిచయం చేస్తూ వ్యాసాలు రాయాల్సిన పరిస్థితి తెలుగులో ఉండటం విషాదం! నిజానికి పండితులు ఆ ప్రక్రియ గురించి, అందులో కృషి చేసిన వారి సృజనాత్మక కృషి గురించి, వారి రచనలు గురించి శోధించి, వివరించాలి. ఫిక్షన్ రచయితలు, కథలు, నవలలు, నాటకాలు సృజించాలి. అయితే తెలుగులో ఆ పని మరొకరు చేయకపోవడం, అంతకుమించి అటువంటి కృషిని ప్రధాన స్రవంతి పత్రికలు ఆదరించకపోవడం ఇక్కడ గమనించాలి.

కె. సదాశివరావుకు పత్రికా నిర్వహణ చేసే జర్నలిస్టులలో చాలామంది సాహితీ 'విందు' మిత్రులున్నా, వారి ఆ రచనలకు పెద్దగా అవకాశం లేకపోయింది. తర్వాత కాలంలో వారు 'పాలపిట్ట' మాసపత్రికలో ధారావాహికగా కొన్ని ఏళ్ళపాటు సైన్స్ ఫిక్షన్ గురించి వ్యాసాలు రాశారు. ఆ వ్యాసాలే తర్వాత పుస్తకాలుగా వెలువడ్డాయి. ఈ రకంగా సదాశివరావు చేసిన కృషి ప్రత్యేకమైనదీ, విలువైనదీ, పదికాలాలపాటు నిలిచిపోయేదీ! ఈ రచనకోసం వారు ఎంత వ్యయం చేసి, ఎన్ని పుస్తకాలు కొన్నారో; ఎంత సమయం వెచ్చించి, ఎంత అధ్యయనం చేశారో మనం ఊహించలేం. అయితే ఎవరైనా ఈ 'జనర్'లో సులువుగా ప్రవేశించడానికి అనువైన వాతావరణం సృష్టించి వెళ్ళాడు సదాశివరావు.

ప్రపంచ సాహిత్యపు సైన్స్ ఫిక్షన్ కథాసాహిత్యంలో చాలా ధోరణులున్నాయి. వాటిని అధ్యయనం చేశారు సదాశివరావు. అలా ప్రతిధోరణికి ప్రతిబింబంగా నిలిచే కథలను నా కథా సంకలనంలో ఎంపిక చేయాలని వారి తలంపు. ఈ ధోరణుల ప్రతిఫలనాల సాహిత్యం తెలుగులో ఉండవచ్చు, లేకపోవచ్చు! 1927 నుంచి వెలువడిన తెలుగు సైన్స్ ఫిక్షన్ కథలలో మైలురాళ్ళు అనదగ్గవి ఎంపిక చేసి ఆ తెలుగు ప్రక్రియలో పరిణామ గతిని కూడా చూపాలని మా ప్రణాళిక. సుమారు వందకు పైగా నిలచిన కథలలో కేవలం 27 మాత్రమే ఎంపిక చేశాం. పుస్తకపరిమాణం కూడా అకాడమి విధించిన నిడివి దాటింది! సదాశివరావు'బ్యాక్ సీట్ రుబాబు' నాకు నచ్చదు, కనుక కొంతకాలం వారి ఫోనుకు నానుంచి మూగనోము ఎదురైంది. ఇంకొక్క దారుణమైన అనుభవం కూడా ఉంది. రాయడం నా స్థాయికి తగదు కనుక చెప్పడం లేదు.

చాలామంది సాహిత్య మిత్రులు సదాశివరావు గదమాయింపులు, రుబాబులు, అతిప్రేమలు, ఆర్డర్లు వగైరాను ఆయన పోలీసుద్యోగపు ఖాతాలో వేస్తారు. నిజానికి పోలీసు ఆఫీసర్లు చాలామంది వున్నారు, చాలామందితో నాకు పరిచయం కూడా బాగా ఉంది. వారికి కూడా కళాభిరుచి, పాండిత్యం, సాహిత్య ప్రవేశం వగైరాలున్నాయి. నిజానికి సదాశివరావుకు సహజంగానే ఆ ఆర్డరు వేసే లక్షణం ఉన్నట్టుంది. అయితే ఆయన సాహితీ మిత్రులు మాత్రం ఆయన మీద ప్రేమతో దాన్ని అంగీకరించలేక, ఆయన పనిచేసిన ఉద్యోగానికి ముడి వేస్తున్నారు. అది ఉద్యోగంతో సంబంధం లేని ఆయన మౌలికమైన స్వభావం. దానికి కుదుళ్ళు ఇంకా లోతుగా కూడా వుండి వుండాలి!

సదాశివరావు చాలా అమాయకుడు, భోళాశంకరుడు, పిల్లాడి మనస్తత్వం ప్రధానంగా ఉన్న వ్యక్తి. ఆయనే పుస్తకాలు కొనేలా చేసి, ఆ తర్వాత ఎందుకు చదవడం లేదని ఫోన్ లో తిట్టిపోయడం ఏమిటి? అలాగే తన పుస్తకాలు కొనమని పదేపదే ఫోన్ చేసి, తర్వాత ఎంత చదివారని పలుసార్లు ఆరాతీయడం ఏమిటి? అలాగే చిన్న విషయాలకు కోపం వచ్చి 'వాడికి అ ఆ లు' కూడా రావు అని కూడా చటుక్కున అనేయ గలడాయన! ఇలాంటి విలక్షణమైన కొడాలి సదాశివరావు 2021 డిసెంబరు 7వ తేదీ సాయంకాలం, మిత్రుణ్ణి తన ఇంటి దగ్గరకి తీసుకువస్తూ రోడ్డు మీద నడుస్తూ నిలవలేక పేవ్ మెంట్ మీదే కుప్ప కూలిపోయాడు!

సదా గుర్తుండిపోయే విలక్షణమైన వ్యక్తిత్వం కె. సదాశివరావుది!

– డా. నాగసూరి వేణుగోపాల్
m : 9440732392
e : venunagasuri@gmail.com

# కల్వకోలు గ్రామ చరిత్ర–శిల్పవైభవం

కృష్ణవేణినదీ పరివాహకప్రాంతమైన కొల్లాపురంసీమలోని గ్రామాలది శతాబ్దాలనాటి చరిత్ర. ఆదిమానవుని ఆవాసాలకు జైన, బౌద్ధ, శైవ, వైష్ణవ, శాక్తేయ మతవికాసాలకు ఆలవాలమైన ప్రాంతం. గత వైభవాలకు తార్కాణమైన ప్రతీకలు శిథిలావస్థకు చేరి చరిత్ర మరుగునపడిపోతున్నది. కొల్లాపురం ప్రాంతంలోని కల్వకోలు గ్రామ శాసన, ఆలయవాస్తు, శిల్ప చారిత్రక సంపదల గాథ ఇది.

**కల్వకోలు:**

కల్వకోలు ప్రస్తుత నాగర్‌కర్నూలు జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని గ్రామం. నాగర్‌కర్నూల్ నుండి కొల్లాపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై కొల్లాపూర్‌కు 10 కిలోమీటర్ల దూరంలో ఉందీ గ్రామం. ఈ గ్రామాన్ని కలువకొలని, గలువకోలు, కైరవ కాసారము (కైరవ–కలువ, కాసారం–కొలను) అని పిలిచేవారు. కలువలు నిండిన ఒక పెద్దకొలనున్న గ్రామమే కల్వకోలుగా పిలువబడ్డది.

**కల్వకోలు గ్రామచరిత్ర:**

స్థానిక ఐతిహ్యాలు, కైఫీయతులు, శిలా, తామ్ర శాసనాలు, ఆలయశిల్పాలను ఆధారంగా కలువకోలు గ్రామ చరిత్ర.



చాముండి – కాకతీయానంతర శైలి

స్థానికకథనం ప్రకారం ఈ గ్రామాన్ని స్థాపించినవాడు గోనవంశానికి చెందిన జయ లక్ష్మీపతిరాయుడు. అతడే ఇక్కడి కలువకొలను చూసి దానికి ఉత్తరంగా ఒక శివాలయం, దక్షిణంగా ముకుందస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలు కట్టించాడు. కోట, కోటచుట్టూ కందకం(అగర్తల), కోటలో మేడ నిర్మింపజేసి, కొత్తగా గ్రామాన్ని పొందించి, దానికి 'కైరవకాసారం' అని పేరు పెట్టినట్లు తెలుస్తుంది. జయలక్ష్మిపతిరాయుడు పంచనంది ప్రతిష్టలు చేసిన తరువాత అతనికి ఒక కుమారుడు కలిగాడు. అతని పేరు బసవదేవనరపాలుడు. ఈ బసవదేవనరపాలుడు ఇతని కూతురు కుసుమకోమలి ఈ ప్రాంతాన్ని పాలించినట్లు తెలుస్తుంది.

**శాసనాలు, కైఫీయతులో కల్వకోలు:**

కల్వకోలు గ్రామంలోని ఆలయంవద్ద నాలుగు, చెన్నకేశవస్వామి గుడివెలుపల ఒకటి, మొత్తం ఐదు శిలా శాసనాలు ఉన్నాయి. నందికోటేశ్వరస్వామి దేవాలయం ముందు పూర్వ చాళుక్యులకాలపు కన్నడలిపితో ఉన్న చిన్న శాసనంలో గ్రహణ సమయంలో ఒక భక్తుడు అక్కడి స్వామికి దానంచేసిన విషయం తెలుపుతుంది. దాని పక్కనే ఉన్న క్రీ.శ. తొమ్మిదో శతాబ్దంనాటి శాసనంలో బల్లహరాజు చంద్రదేవుడు, రాజేంద్రమౌళి చెరో 6 మర్తుర్లభూమి నందికోటేశ్వర స్వామికి దానం చేసిన వివరాలు ఉన్నాయి. తేదీ పేర్కొనని కాకతీయ గణపతిదేవునికాలపు శాసనంలో ఈ ప్రాంతాన్ని తన సేనాని చెరుకు కాటభూపతికి ధారాదత్తం చేసినట్లు చెరుకు బొల్లయ రెడ్డి కాకతీయులకు సామంతుడిగా పనిచేసినట్లు చెప్పబడింది. కాకతీయులకాలంలో ఈ గ్రామాన్ని రాజధానిగా చేసుకొని చెరుకురెడ్లు పాలించారు. అంటే గోన, మల్యాలవంశాల తర్వాత ఈ ప్రాంతానికి చెరుకురెడ్లు వచ్చినట్లు తెలుస్తున్నది. చెన్నకేశవాలయం వెలుపల ఉన్న మరో శాసనం క్రీ.శ. 1321 సం. కాకతీయ ప్రతాపరుద్రుని మహా సామంతుడైన చెరకు ప్రోలయరెడ్డి క్రీ.శ.1321 దుర్మతి భాద్రపద శుద్ధ ఏకాదశి గురువారంనాడు వేయించిన శాసనంలో కలువకొలనిలో సుంకంరూపంలో వసూలైన ఆదాయాన్ని స్థానిక ప్రసన్నవల్లభదేవర అంగరంగవైభవాలకు అష్టాదశప్రజల అనుమతితో ధారపోసి ఇచ్చిన విషయం ఉంది. ప్రసన్న వల్లభ దేవరనే చెన్నకేశవస్వామిగా స్థానికులు కొలుస్తున్నారు.

వీరి పాలనానంతరం పాలమూరుజిల్లా గంగాపురాన్ని రాజధానిగా చేసుకుని పాలించిన అతనికొడుకు మాయాపురీశ్వరుడు, ఇతనికొడుకు తాత పిన్నమరాజు పాలించినట్లు శ్రీవిరూపాక్ష శ్రీరామ తామ్రశాసనాలు పరిష్కరించిన శ్రీ వడ్లమూడి గోపాలకృష్ణయ్య గారు, ఈ తాత పిన్నమరాజు చెరుకు బొల్లయరెడ్డి కుమారుడు రాజరుద్రుని జయించి రాజ రుద్రుని సప్తాంగాలను హరించాడని శ్రీ బీ.ఎన్. శాస్త్రిగారు పేర్కొన్నారు. తాత పిన్నమరాజుకొడుకు సోమదేవరాజును "ఏక దివ ఘటనైక ధాటీ హరాహుత కోట రాచూరు, సాతానికోట, కందనవోలు, యాదగిరి, కలువకొలను, ముసలిమడుగు, గంగినేని కొండాభిదాన సప్తదుర్గ వశపర్తి" అని పొగిడినవి. పై శాసనాలేకాక ఆయన గురించి బాలభాగవతం, రామరాజీయం (నరపతి విజయం)లో కూడా చెప్పబడింది. ఈ సోమదేవరాజుకాలం క్రీ.శ.1310 నుండి 1347 అని చరిత్రకారులు చెబుతున్నారు. కాబట్టి అతడు కలువకొలను ప్రోలయరెడ్డి పైన యుద్ధం చేసి జయించి ఉంటాడు. ఈ ఊరు సోమరాజు ఏలువడిలో కూడా ఉన్నట్లు చెప్పవచ్చు. కల్వకోలు గ్రామస్తుడు కీర్తిశేషులు శ్రీ నారాయణదాసు బొజ్జయ్య ఆచారి దగ్గర ఉండే కైఫియతు కూడా ఇదే విషయాన్ని ధ్రువపరిచింది. ఈ గ్రామంలో ఒక పెద్ద యుద్ధం జరిగింది. యుద్ధంలో మొదటి గ్రామం శిథిలం కాగా పానుగంటి దొరలు శిథిలమైనకోటకు తూర్పున కొత్తగా ఈశ్వర చెన్నకేశవ ప్రతిష్టలు చేసి నేటి గ్రామాన్ని శాలివాహనశకం 1252లో స్థాపించినట్లు తెలుస్తున్నది. పానుగల్లుదొరలు బ్రాహ్మణప్రభువులు. ఈ వంశంలో నారాయణరావు పౌత్రులు దేవరావు పుత్రులైన శేషాచలపతిరావు పాలిస్తుండగా కర్నూలునవాబు తమకు సామంతుడు


నంది కోటేశుని గుడి


నందికోటీశుని గుడి అంతరాళద్వారం


నంది కోటేశుని గుడి


వైష్ణవ ద్వారపాలకుడు


శాసనం

కమ్మని ఒత్తిడి తెచ్చినారు. వారికి లొంగడం ఇష్టం లేక మైసూరు ప్రభువులతో సంప్రదిస్తుండగా ఆ సంగతి తెలిసి గోలకొండ కుతుబ్ షాహి ప్రభువు వారిపై ఆకస్మికంగా దండయాత్ర చేసి కుటుంబంతో సహా బంధించి తీసుకొని వెళ్ళినాడట. అంతటితో ఈ వంశీయుల పాలన ముగిసిపోయి గోలకొండ ప్రభువుల ఆధీనంలోకి వెళ్ళింది.

పానుగల్లు బ్రాహ్మణ దొరల పాలన తర్వాత దానిని వెలుగోటివారి బంధువులైన బోయనపల్లె వెలమలు పాలకులుగా వచ్చారు. పానుగల్లు మొదట సురభి ప్రభువులది. వారి నుండి విజయనగర ప్రభువులు జయించుకున్నారు. తర్వాతి కాలంలో సురభివంశం మరోసారి పాలించింది. వీరు ఎంతకాలం పాలించారో తెలియదు కానీ కలువకోలును దేశాయి, దేశపాండేల హోదాతో ఎత్తంలోని వాలా వారనే ఇంటిపేరు గల ఒక దొరల కుటుంబం పానుగంటి వారి వారసులమనే పేరుతో కలువకోలును పాలించారు. జటప్రోలు, వనపర్తి, గోపాలపేట ప్రభువులు ఉమ్మడిగా దండెత్తి వచ్చి ఎత్తందొరల ఆధీనంలోని గ్రామాలను వశపరచుకున్నారు. వారి,వారి సంస్థానాలకు సమీప గ్రామాలను పంచుకున్నారు. అప్పుడు కలువకోలు గ్రామం కొల్లాపురం సంస్థాన పరిధిలోకి వచ్చింది. 1948 సంవత్సరంలో ఈ సంస్థానం భారత ప్రభుత్వంలో విలీనమైంది. కొల్లాపూర్ తాలూకాగా ఏర్పడింది. అప్పుడు ఈ కలువకోలు గ్రామం కొల్లాపూర్ తాలూకాలో చేరింది.

ఈ విధంగా కలువకోలు గ్రామ చారిత్రక ప్రస్థానం చాళుక్య, చోళ, కాకతీయ, గోన, మాల్యాల, చెరుకురెడ్లు, విజయనగర ప్రభువులు, పానుగంటి బ్రాహ్మణ దొరలు, సురభి దొరలు, బోయనపల్లెవారు, గోలకొండ కుతుబ్ షాహిలు, ఎత్తం దొరలు చివరికి కొల్లాపూర్ సంస్థానాధీశుల ఏలుబడిలో ఉండి గొప్ప చారిత్రక వారసత్వాన్ని అందించింది.


కలువకోలు గ్రామం పూర్వం నందికోటేశ్వరస్వామి గుడి దగ్గర, ఈదమ్మ గుడి దగ్గర, ఆ తర్వాత చెన్నకేశవ స్వామి గుడివద్ద కాలగమనంలో అడుగులు మార్చుకుంటూ నేడు నాగర్ కర్నూల్ కొల్లాపూర్ రహదారికి ఇరువైపులా విస్తరించింది.

**ఆలయాలు–శిల్పసంపద:**

ప్రస్తుత గ్రామానికి పడమర 2 కిలోమీటర్ల దూరంలో నంది కోటేశ్వరాలయం ఉంది. దీనిని నందిగుడిగా పిలుస్తారు. ఈ గుడిలోని శివలింగానిదో ప్రత్యేకత ఉండేది. గర్భగుడిలోని పానవట్టాలను శిల్పి లింగంతోసహా గిన్నెలవలె మలచి ఒకదానిపై ఒకటి ఉంచినాడు. లింగం చుట్టూ సన్నని రంధ్రాలు ఉండి అభిషేకజలం ఒకేసారి ఏడు లింగాలను అభిషేకిస్తూ అభిషేకం చేసిన వారికి సప్తలింగాభిషేక ఫలం ఒకేసారి లభించేది. మహమ్మదీయులు దండయాత్రలో ఈ పానవట్టాలను శివలింగాలను ధ్వంసం చేశారు. భిన్నమైన వాటిని తొలగించి మరోలింగాన్ని పానవట్టాన్ని ప్రతిష్ఠించారు గ్రామస్తులు. గర్భగుడి అర్ధ మండపం మహామండపంగా నిర్మించబడింది. గుడి చాళుక్యుల కాలంలో నిర్మించి ఉంటారు. రాష్ట్రకూటులు, కళ్యాణి చాళుక్యులు, కాకతీయుల కాలంలో పునరుద్ధరించబడినట్లు నిర్మాణశైలిని బట్టి చెప్పవచ్చు. మహా మండపంలోని పెద్దదైన నంది కాకతీయుల కాలానిదిగా చెప్పవచ్చు. ఆలయం వెలుపల వేరువేరు కాలాలకు చెందిన ఆరు నందులు ఉన్నాయి. ఇక్కడ పొలాలలో ఆలయం వెలుపల లభించిన నందివిగ్రహం పానవట్టం విడిభాగాలు పిల్లలమర్రి మ్యూజియం మహబూబ్ నగర్ లో ఉంచబడ్డాయి. నందికోటేశ్వరాలయం పక్కన ఒకప్పుడు మొక్కుడు గుడిపేర 8 వైపులా ద్వారాలతో గుడి ఉండేదట. అది శిథిలం కాగా ద్వారా బంధాలు, శిలలు చుట్టుపక్కల ప్రజలు తరలించుకొని పోగా కొన్ని ఆనవాళ్లు మిగిలి ఉన్నాయి. వీరశైవ మతవ్యాప్తిలో భాగంగా భక్తులు వీరావేశంతో ఆత్మార్పణలు చేసుకునే ప్రదేశమే మొక్కుడుగుడి ఏమో అనిపిస్తుంది. అందుకు ఇక్కడ లభిస్తున్న కొన్ని శిల్పాలు బలం చేకూర్చుతాయి.

నంది గుడి వెలుపల ఓ శిల్పం నాలుగు అంతస్తులతో యుద్ధరంగంలో వీరుడు మరణించి శివసాయిజ్యం పొందినట్లు తెలియజేస్తుంది. ఇది యుద్ధ సన్నివేశాన్ని శిల్పించిన వీరగల్లు శిల్పం. దీనిపై కాకతీయుల కాలంనాటి లిపి తో కూడిన శాసనం కూడా ఉంది. గుర్రాలపై కళ్లెం కత్తితో వీరుడు ఆయన పక్కన ఎదురుగా శత్రు సైనికుడు దీని పై వరుసలో ఇద్దరు స్త్రీలు వీర సైనికుడిని స్వర్గానికి తీసుకెళ్తున్నట్లు, వీరి పై వరుసలో శివలింగం దానికి ఎదురుగా శైవ భక్తుడు దీనికి పై వరుసలో చంద్రుడు సూర్యుడు శిల్పించబడ్డారు. ఆ వీరుడి కీర్తి ఆచంద్ర తారార్కకంగా నిలిచే విధంగా రూపొందించిన శిల్పం. (ఈ గ్రామానికి సమీపంలోని కోండ్రావుపల్లి చెరువు కట్టపై కూడా ఉంది) వీరశైవ భక్తులు గుండ బ్రహ్మయ్య ,శూల బ్రహ్మయల శిల్పాలు ఇక్కడ ఉన్నాయి. కాకతీయ ప్రతాపరుద్రుని కాలంలో ఓరుగల్లు లో శివ భక్తుల వేషంలో వచ్చిన దొంగలు పట్టుబడి శిక్ష విధించినప్పుడు దొంగలైన శివ భక్తుల రూపంలో వచ్చినందుకు వారికి బదులుగా గుండ బ్రహ్మయ్య, శూల బ్రహ్మయ్యలు శూలాన్ని అధిరోహిస్తారు. అలాంటి వీరశైవ భక్తుల శిల్పాలు ఉన్నాయి. ఆత్మార్పణ చేసుకుంటున్న సతీశిలలు అనేకం ఇక్కడ కనిపిస్తున్నాయి.ఇక్కడి నందిగుడి దగ్గర


సమలింగం ప్రతిష్ఠించబడే వేదిభద్రపీఠం పైభాగం


సమలింగం - కల్వకోలు


దుర్గ- చాళుక్యశైలి


కల్వకోలు నంది


అంబారీపై రాజు ఊరేగింపు


కాకతీయశైలి భైరవుడు


ఆదిత్యుడు చాళుక్యశైలి


ఛత్రంతో భైరవుడు, చాళుక్యశైలి


శూలారోహణ ఆత్మసమర్పణ, కాకతీయ అనంతర శైలి

ప్రతిఏట శివరాత్రికి భక్తులు నిప్పుల గుండంలో నడిచే ఆచారం, వీరశైవంలో భక్తిని ప్రదర్శించే నందికోల సేవలు వీరావేశ ప్రదర్శనలు అనేకం ఉత్సవాలుగా జరుపుకుంటారు.

**చారిత్రక క్షేత్రపర్యటన:**

క్షేత్ర పర్యటనలో చాళుక్య,చోళ, రాష్ట్రకూట, కళ్యాణి చాళుక్య, కాకతీయ శైలిలో సుందరంగా మలచిన విగ్రహాలు నందిగుడి పరిసరాలలో, పోచమ్మ గుడి దగ్గర చెట్ల కింద భిన్నమైన శివలింగాలు పాను మట్టాలు, నందులు, భైరవుని శిల్పాలు, చాముండి శిల్పాలు, వినాయక, వల్లి దేవసేన శిల్పాలు, సూర్య విగ్రహం నరసర్ప వీరశిలలు అనేకం ఉన్నాయి. నంది గుడి శివలింగం పానుమట్టాలు తొలగించిన గిన్నె వలె తొలచిన పానుమట్టాల బొచ్చెలు విరిగిపడినవి. మొక్కుడు గుడి శిథిల స్తంభాలు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. నంది గుడి చుట్టూ కోట, అగర్త, నాలుగు వైపులా బురుజులు నాలుగు శివాలయాలు ఉండేవని స్థానికుల మాటలకు తగ్గట్లుగనే ఊర్లో ఎటు చూసినా కనిపించే ఆ శిల్పాలు సాక్ష్యంగా చెప్పవచ్చు.

ప్రస్తుత కలువకోలు గ్రామంలో 'ప్రసన్నవల్లభదేవర'గా చెప్పబడిన చెన్నకేశవస్వామి ఆలయం, శివాలయం, ఆంజనేయ ఆలయాల సముదాయం విమానగోపురాలతో అందంగా సర్వాంగసుందరంగా ఉంది. ఈ ఆలయప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద గరుత్మంతుడు, విష్ణుమూర్తి శిల్పాలతో పాటుగా అరుదైన గజ వీరగల్లు శిల్పం ఉంది. ఏనుగుపై ఎక్కి యుద్ధానికి వెళుతున్న రాజోచిత ఆహార్యంతో ఉన్న రాజు వారి పరివారంతో కూడిన శిల్పంఉంది. ఇలాంటి వీరగల్లు శిల్పం ఈ ప్రాంతంలో ఎక్కడా లభించలేదు. ఇలాంటిది భువనగిరి జిల్లా కొలనుపాకలో ఉంది. (11) ఇది 12వ శతాబ్ది కంటే పూర్వానిది. కళ్యాణి చాళుక్యుల కాలానిదిగా చెప్పవచ్చు. ఆలయం వెలుపల ఒక శిలాశాసనం గరుత్మంతుని విగ్రహం ఉంది. ఆలయంలో అక్కడక్కడ వీరగల్లు శిల్పాలు ఉన్నాయి.

ఊరిలో ఊరు చుట్టూ పరిశీలనగా చూస్తే ఎటు చూసినా శిల్పసంపద ఉందంటే అతిశయోక్తి కాదు. ఏదేమైనా స్థానిక కథనాలు, శాసనాలు, ఆలయ శిల్పాల ఆధారంగా గ్రామం ఎంతో చారిత్రక నేపథ్యంతో వివిధ రాజవంశాలకు రాజధానిగా సామంతులకు సామంతరాజ్యంగా జాగీరుదారులకు జాగీరుగా వివిధ కాలాల్లో వివిధ రూపాల్లో వైభవోపేతంగా వెలుగొందిన గ్రామం. ఆయా కాలాలలో జరిగిన యుద్ధాల వల్ల మారిన రాజకీయ పరిణామాల మధ్య కోటపేటలు నేలమట్టం అయ్యాయి. గుప్త నిధులకై అన్వేషిస్తున్న దురాశాపరుల చేత అనేక సంపద నాశనం కాబడింది.ఆ నాటి చరిత్రకు సాక్షాలైన శాసనాలు, శిల్పాలు మొదలైన వారసత్వ సంపదను స్థానికులు,పాలకులు ఒక దగ్గరకు చేర్చి భద్రపరచి తర్వాతి తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

**ఈ వ్యాసానికి ఆధారాలు:**


1. ఇన్ స్క్రిప్షన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ వాల్యూం
2 పేజి నెంబర్ 832. అందుగుల వెంకయ్య - రామరాజీయం 1-182 (నరపతి విజయం)
3. కపిలవాయి లింగమూర్తి - నారాయణదాసు శ్రీరామాచార్యుల వంశ చరిత్ర -కలువకొలను కైఫియతు- పేజి.18
4. ఇన్ స్క్రిప్షన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ వాల్యూమ్ 1 పేజీ నెంబర్ 29
5. ఇన్ స్క్రిప్షన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ వాల్యూమ్ 2 పేజి నెంబర్ 32
6. కపిలవాయి లింగమూర్తి - పాలమూరు జిల్లా దేవాలయాలు పేజి నెంబర్ 111 ముద్రణ 2010
7. ఇన్ స్క్రిప్షన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మహబూబ్నగర్ డిస్ట్రిక్ట్ వాల్యూమ్ 2 పేజి నెంబర్ 838. కపిలవాయి లింగమూర్తి - నారాయణదాసు శ్రీరామాచార్యుల వంశ చరిత్ర -కలువకొలను కైఫీయతు, పేజి నెంబర్ 21
9. కపిలవాయి లింగమూర్తి -పాలమూరు జిల్లా దేవాలయాలు పేజి నెంబర్ 111 ముద్రణ 2010
10. కపిలవాయి లింగమూర్తి -పాలమూరు జిల్లా దేవాలయాలు పేజి నెంబర్ 111 ముద్రణ 2010
11. విరువంటి గోపాలకృష్ణ - కొలనుపాక చరిత్ర శాసనాలు, పేజి నెంబర్ 59
12. 23-02-2024నాటి కల్వకోలు క్షేత్రపర్యటనలో కొత్త తెలంగాణ చరిత్రబృందం పరిశోధకసభ్యులు బైరోజు చంద్రశేఖర్, డా. బైరోజు శ్యామసుందర్ సేకరించిన సమాచారం.


కల్వకోలు చరిత్రకు దోహదపడిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు.

- శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com
- బైరోజు చంద్రశేఖర్,
m : 949090 9821

# కళా సంగమం–ఆర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్

అరవై నాలుగు కళల్లో అత్యంత పురాతనమైనవి చిత్ర, శిల్పకళలు. మన దేశ శిల్పకళకు సాక్ష్యంగా నిలుస్తాయి హైందవ దేవాలయాలు. చిత్రకళ కుడ్యాలపై మొదలై ఆ తరువాత పలు ఇతర రకాలుగా విస్తరించి, నేడు కొత్త పోకడలల్లోకి వెళ్ళింది. ఇటువంటి చిత్రకళలో, ఇతర కళల్లో ఏ ఇతర ప్రాంతం వారికీ తీసిపోని కళాకారులు ఆంధ్రదేశంలో ఉన్నారు.


గడచిన వంద సంవత్సరాల కాలంలో తమ చిత్రకళతో కళాప్రపంచాన్ని అలరించిన కళాకారులు ఎందరో ఉన్నారు. ఒకనాడు పాఠశాలల్లో డ్రాయింగ్ ఒక అంశంగా బోధించే టీచర్ ఉండేవాడు. ప్రాథమిక అంశాలు ప్రతి పిల్లవాడికీ అందించే యత్నం స్కూల్ స్థాయిలో జరిగేది. ఆ తర్వాత ఎవరికి నచ్చినరీతిలో వారు తమకు ఇష్టమైన అంశాన్ని తీసుకుని దానిమీద పట్టుసాధించేవారు. కాలేజీ స్థాయిలో కూడా కళని ఒక సబ్జెక్ట్ గా బోధించిన కళాశాలగా బందరులోని జాతీయ కళాశాల నిలుస్తుంది. బెంగాల్ నుండి ప్రముఖ చిత్రకారులను తీసుకువచ్చి ఆధ్యాపకులుగా నియమించింది యాజమాన్యం.

అడవి బాపిరాజు వంటి మేటి చిత్రకారుడు, రచయిత ఆ కళాశాలకు ప్రధాన అధ్యాపకుడిగా ఎంతో ముందుకు తీసుకువెళ్ళాడు. చిత్రకళను, పలువురు కళాకారులను తీర్చిదిద్దాడు.

దాదాపుగా అదే సమయంలో ఆంధ్రుల సాంస్కృతిక కేంద్రమైన గోదావరి తీర పట్టణం రాజమహేంద్రవరంలోని కాలేజీలో ఉన్న బ్రిటీష్ ప్రిన్సిపాల్ తన శిష్యులలోని టాలెంట్‌ను గుర్తించి వారికి పాశ్చాత్య చిత్రకళలోని మెళుకువలను నేర్పాడు. చిత్రకళకి అవసరమయిన పరికరాలను, పదార్థాలను విదేశాలనుండి తెప్పించి, అందజేసి ప్రోత్సహించాడు. అలా రాజమహేంద్రవరంలో దామెర్ల రామారావు గొప్ప కళాకారుడిగా రూపుదిద్దుకున్నాడు. అనేకమంది మెరుగైన అవకాశాలు, గుర్తింపు వెతుక్కుంటూ దేశంలోని ఇతర నగరాలకు, విదేశాలకు వెళ్ళి స్థిరపడ్డారు.

ఆ మేటి కళాకారుల వివరాలు, వారి చిత్రాలతో పాటు సమకాలీన చిత్ర,శిల్ప కళాకారులను ఒకచోటికి చేర్చి, పుస్తకంగా ప్రచురించే ప్రయత్నం విజయవాడకి చెందిన 64 కళలు డాట్ కాం పత్రిక నిర్వహిస్తున్న కళాసాగర్ యల్లపు చేశాడు. అతని దశాబ్దపు పైబడిన కృషి ఫలితం ఆంధ్రకళాదర్శిని–ఆర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పేరుతో వెలువరించిన కాఫీ టేబుల్ పుస్తకం.

కళాకారులను ఐదు విభాగాలుగా చిత్రకారులు, గ్రాఫిక్స్ కళాకారులు, ఇలస్ట్రేటర్స్, శిల్పులు, సినిమా, క్రాఫ్ట్ కళాకారులుగా విభజన చేసి, 300 మంది కళాకారుల కృషిని మనకు అందించారు. వారి యొక్క కళాకృషి మరియు వ్యక్తి గత సమాచారం మొదలైన వివరాలు చక్కటి క్రమ పద్ధతిలో ప్రచురించి, మన ఆంధ్ర చిత్రకారులను శిల్పులను, రేఖా చిత్రకారులను ఇంకా ప్రసిద్ధిగాంచిన మన ప్రాచీన వృత్తి కళారూపాలైన కొండపల్లి కొయ్య బొమ్మలు, ఏటికొప్పాక లక్క బొమ్మల, కాళహస్తి కలంకారీ హస్త కళలకు చెందిన సకల కళారూపాలను, కళా వైభావాన్ని కళ్ళకు కట్టేలా చేసిన గొప్ప ప్రయత్నం ఈ 'ఆర్ట్ అఫ్ ఆంధ్రప్రదేశ్' అనే గ్రంథం.




కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లాంటివి చేయాల్సిన ఇంతటి గొప్ప కృషిని కళాసాగర్ ఒంటి చేత్తో సాధించగలిగాడు. కేవలం ఉత్తరాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మన తెలుగు కళాకారుల సమాచారాన్ని సేకరించి వాటన్నింటితో తొలిసారిగా 2001లో ఆంధ్రకళాదర్శిని మొదటి గ్రంథాన్ని, 2004 లో రెండవ గ్రంథాన్ని తీసుకు రావడం జరిగింది. చిత్ర శిల్పకళా ఉద్గ్రంథం ఈ 'ఆర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' కాఫీ టేబుల్ బుక్‌లో మన ఆంధ్ర చిత్రకళకు ఆద్యులై నేడు కీర్తి శేషులుగా మిగిలిన దామెర్ల రామారావు, వరదా వెంకటరత్నం, భగీరథి, అడవి బాపిరాజు, గుర్రం మల్లయ్య, అంకాల వెంకట సుబ్బారావు, అంట్యాకుల పైడిరాజు, మొక్కపాటి కృష్ణమూర్తి. వి.ఆర్. చిత్ర, ఎస్ యెన్ చామకూర, పిలకా లక్ష్మి నరసింహం దంపతులు. కృష్ణారెడ్డి, రెడ్డప్పనాయుడు, మాధవపెద్ది గోఖలే, మాదేటి రాజాజీ, వడ్డాది పాపయ్య, సి.ఎస్.ఎన్. పట్నాయక్, బాపు, బాలి, కేతా, గంగాధర్, ఈశ్వర్ లాంటి దివంగత కళాకారుల చిత్రాలు సమాచారంతో బాటు ప్రస్తుత వర్తమాన కాలంలో జాతీయ అంతర్జాతీయంగా పేరు గడిస్తున్న మన తెలుగు చిత్ర, శిల్పకారుల పరిచయాలతో మూడొందల మందికి పైగా కళాకారుల చిత్రాలతో రూపుదిద్దుకున్న ఈ చిత్రకళా గ్రంధం దేశంలో ప్రతి చిత్రకారుడు మరియు కళాభిలాషుల సేకరణలో గ్రంథాలయంలో తప్పక ఉండవలసిన గ్రంధం ఈ ఆంధ్రకళాదర్శిని ART OF AP - COFFEE TABLE BOOK.

ఈ అపురూపమైన గ్రంధం వెల – 2000/– రూపాయలు మాత్రమే. ఫైన్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు తగ్గింపు ధరలలో కూడా లభ్యమౌతుంది.

**ప్రతులకు:** కళాసాగర్, సంపాదకుడు,

**ఫోన్ నెంబర్:** 9885289995

–వెంటపల్లి సత్యనారాయణ

# బహుజన వర్గాల దార్శనీకుడు-బీపీ మండల్

చారిత్రకంగా కుల వ్యవస్థ వల్ల వెనుకబడిన వర్గాలకు విద్య, సంపద అవకాశాలు లభించలేదు. రిజర్వేషన్లు కేవలం కోటాలు కాదు సమానత్వానికి మార్గము. స్వాతంత్ర్యానికి ముందే దక్షిణ భారతదేశంలోని మహారాష్ట్ర లోని సాహు మహారాజ్ ,మైసూర్ లో కృష్ణరాజ వడయార్ రాష్ట్రాలలో బీసీలకు విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేయడం జరిగింది. 1921 మద్రాస్ ప్రేసిడెన్సిలో జస్టిస్ పార్టీ ఆధ్వర్యంలో కమ్యూనల్ రిజర్వేషన్ జీవో జారీ అయినది. ఓబీసీ రిజర్వేషన్లను దేశవ్యాప్తంగా అమలు చేయడానికి అంబేద్కర్ ప్రయత్నించగా కుహనా మేధావులు దానిని అడ్డుకోవడం జరిగింది.

భారత రాజ్యాంగంలో 15(4), 16(4), 46, 243, 338, 340 వంటి అధికరణలో ఓబీసీల ప్రస్తావన వున్నప్పటికి సరియైన ప్రాతినిధ్యం కోసం ప్రజా ఉద్యమాలు జరుగుతూనేవున్నాయి. గత పాలకుల నిర్లక్ష్యము, నేటి పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం వల్ల ఓబీసీలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారు.



1990లో వీపీ సింగ్ ప్రభుత్వము ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయడంతో భారత రాజకీయాల్లో విప్లవాత్మక మార్పుకు నాందిపలికింది. ఓబీసీలకు రాజకీయ సాధికారత, అభివృద్ధి, ఆత్మగౌరవం కల్పించి దేశంలో సామాజిక న్యాయం దిశగా పెద్ద ముందడుగు వేసింది.

బహుజనుల జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తులలో పూలే, అంబేద్కర్, నారాయణగురు లాంటి వ్యక్తుల కోవలోకి చెందినవారే బిందేశ్వరి ప్రసాద్ మండల్. మండల్ 108వ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ప్రజలు ఆయన జయంతి ఘనంగా జరుపుకుంటున్నారు. భాగల్పూర్ గౌరవ మెజిస్ట్రేట్‌గా, ముఖ్యమంత్రిగా, పార్లమెంటు సభ్యుడిగా, జాతీయ వెనకబడిన తరగతుల కమిషన్ చైర్మన్‌గా ఈ దేశానికి సేవలు అందించారు.

1918 వారణాసిలో బీహార్‌కు చెందిన యాదవ కుటుంబంలో సీతావతి, రాస్ బిహారీ లాల్ మండల్ పుణ్య దంపతులకు జన్మించారు. భారత్ జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపకులలో ఒకరైన రాస్ బిహారీ లాల్ మండల్ మాదేపుర ప్రాంతానికి జమీందారుగా కూడా పనిచేశారు. వారు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జాతీయ ఉద్యమంలో పాల్గొన్నందుకు ఆయనపై 120 కేసులు నమోదుచేశారు.

బ్రిటిష్ ప్రభుత్వము ఏర్పాటుచేసిన నేతృత్వంలో కమిటీకి స్థితిగతుల బాగుకోసం రాస్ బిహరి లాల్ మండల్ ఒక విజ్ఞాపన పత్రాన్ని ఇచ్చినారు తండ్రి వారసత్వాన్ని పుచ్చుకున్న బీపీ మండల్ బీహార్లో దర్భంగా మరియు పాట్నాలో విద్యాభ్యాసం పూర్తి చేశాడు. పాఠశాల స్థాయిలోనే బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని, కుల వివక్షతను ఎదుర్కొన్నాడు.

### మండల్ రాజకీయ ప్రస్థానము

మండల్ తన 23వ ఏటా బాగల్పూర్ జిల్లా కౌన్సిల్ కు ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1945 నుంచి 1951 వరకు జీతం తీసుకోకుండా భాగల్పూర్‌కి గౌరవ మ్యాజిస్ట్రేట్ గా పనిచేశారు.

### మండల్ రాజకీయ జీవితం

1952 సంవత్సరంలో బీహార్ రాష్ట్ర మొదటి శాసనసభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ పొంది మాదే పుర నియోజకవర్గం నుంచి పోటీ చేసి సోషలిస్టు పార్టీ అభ్యర్థి అయిన భూపేంద్ర నారాయణ పై విజయము సాధించారు. పామ గ్రామానికి చెందిన స్థానిక రాజపుట్ భూస్వాములు ఒక కుర్మి గ్రామం బలహీన వర్గాలపై పై దాడి చేశారు. ఈ దౌర్జన్య కాండం నిరసిస్తూ బీపీ మండల్ బీహార్ అసెంబ్లీలో బాధితుల పక్షాన నిలబడడమే కాకుండా బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేయగా తన ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని కోరగా, తన పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి సంయుక్త సోషలిస్ట్ పార్టీలో చేరారు. రెండు స్థానాలు ఉన్న సోషలిస్ట్ పార్టీని 1967 సంవత్సరంలో 69 స్థానాలను గెలుచుకునేలా కృషి చేశారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రిగా కొంతకాలం పనిచేశారు ఆ తరువాత రామ్ మనోహర్ లోహియాతో విభేదాల కారణంగా సోషలిస్టు పార్టీని విడిచిపెట్టి 1967 సంవత్సరంలో షోషిత్ దళ్ అనే కొత్త పార్టీని స్థాపించారు.1968 ఫిబ్రవరి 1న కాంగ్రెస్ పార్టీ మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటుచేసి ముఖ్య మంత్రిగా 47 రోజులపాటు కొనసాగారు. కాంగ్రెస్ మంత్రుల చేసిన అవినీతిపై అయ్యర్ కమిషన్ వేయగా ఆ కమిటీ నివేదిక బయటికి రాకూడదని ఇందిరాగాంధీ కోరికను తిరస్కరించడంతో కాంగ్రెస్ మద్దతు సంహరించుకున్న కారణంగా తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు.1974 సంవత్సరంలో జయ ప్రకాష్ నారాయణతో కలిసి అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. జనతా పార్టీ టికెట్‌పై మాదేపుర నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు.

### మండల్ కమిషన్ సిఫారసులు

1979 సంవత్సరంలో మొరార్జీ దేశాయ్ నేతృత్వంలో జనతా ప్రభుత్వం రెండవ జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ను

ఏర్పాటు చేసింది ఐదుగురు సభ్యులుగా ఉన్న ఈ కమిషన్‌కి బీపీ మండల్ అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ కమిషన్ దేశవ్యాప్తంగా పర్యటించి బీసీల స్థితిగతులను తెలుసుకొని వారి పరిస్థితులను మెరుగు పరిచేందుకు 40 సూచనలు చేశారు. నివేదికలో దేశంలో 3743 కులాలను సామాజికంగా, విద్యాపరంగా వెనుక వెనకబడిన కులాలుగా గుర్తించి కేంద్ర విద్యాసంస్థల్లో 27 శాతం ఓ బి సి రిజర్వేషన్లను సిఫారసు చేసింది. సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్య, ఉపాధి వెనకబాటుతనం తదితర అంశాల ఆధారంగా ఈ కమిషన్ వేదికను రూపొందించింది.

ప్రభుత్వ రంగ సంస్థల్లో, జాతీయ బ్యాంకులు, ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం పొందుతున్న ప్రైవేటు సంస్థల్లో కూడా 27% రిజర్వేషన్లు ఓబీసీలకు ఇవ్వాలని ఈ కమిటీ సూచించింది.

1980 సంవత్సరంలో ఆనాటి రాష్ట్రపతి అయిన జ్ఞాని జైల్ సింగ్‌కు తన నివేదికను సమర్పించింది. జనతా ప్రభుత్వం తర్వాత అధికారంలోకి వచ్చిన ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు మండల్ నివేదికను పక్కన పెట్టారు. 1987 సంవత్సరంలో కాన్షీరాం మండల్ కమిషన్ అమలు పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి, మండల్ కమిషన్ సిఫారసుల అమలు ఒత్తిడి చేస్తూ మండల్‌కు లాగు కరో యా కుర్చీ ఖాళీ కరో మండల్ నివేదికను అమలు చేయండి లేదా గద్దె దిగండి అనే నినాదం ప్రజల్లోకి వెళ్ళింది.

**1990 ఆగస్టు 7వ తేదీన విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ ఆధ్వర్యంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వము మండల్ కమిషన్ చేసిన సిఫారసుల్లో ఒకటి మాత్రమే పాక్షికంగా అమలు చేయడానికి ప్రయత్నించగా, వ్యతిరేకంగా కమాండల్ ఉద్యమాన్ని చేపట్టి ఓబీసీలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27% వాటా దక్కకుండా రిజర్వేషన్లు అడ్డుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేశారు.**

1990 ఆగస్టు 7వ తేదీన విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ ఆధ్వర్యంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వము మండల్ కమిషన్ చేసిన సిఫారసుల్లో ఒకటి మాత్రమే పాక్షికంగా అమలు చేయడానికి ప్రయత్నించగా, వ్యతిరేకంగా కమాండల్ ఉద్యమాన్ని చేపట్టి ఓబీసీలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27% వాటా దక్కకుండా రిజర్వేషన్లు అడ్డుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేశారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో కేసులు వేయించడం జరిగింది. ఇందులో 1992 సంవత్సరంలో ఇంద్రసహాని వర్సెస్ యూనియన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియాగా ప్రసిద్ధికెక్కిన 9 మంది జడ్జిల్లా సుప్రీంకోర్టు ధర్మాసనం ఓబీసీ రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధమే అని తీర్పునిస్తూ రిజర్వేషన్ల పరిమితిని మరియు క్రిమిలేయర్ విధానాన్ని సూచించింది. ఓబీసీ రిజర్వేషన్ల అమలు 1993 సంవత్సరం నుంచి అమలులోకి వచ్చింది. 2008 సం నుంచి కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థలైన ఐఐటి, ఐఐఎమ్ లాంటి విద్యాసంస్థల్లో కూడా రిజర్వేషన్లను కల్పించడం జరిగింది. కానీ రిజర్వేషన్ల అమలు సక్రమంగా జరగడం లేదు.

**తెలంగాణలో బిసి రిజర్వేషన్లు ఆవశ్యకత**

తెలంగాణలో వెనుకబడిన తరగతులు 56% ఉన్నారు ఆయన ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో వారికి 25 శాతం ముస్లిం బీసీలకు నాలుగు శాతం రిజర్వేషన్ మాత్రమే ఉన్నది ఎస్సీలకు 15% ఎస్టిలకు 10 శాతం కలిపి మొత్తంగా 54 శాతం రిజర్వేషన్లు ఉన్నది. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే స్పష్టం చేశాయి బీసీలు సామాజిక ఆర్థిక సూచికల్లో ఇంకా వెనుకబడి ఉన్నారని వారికి కనీసం 42 శాతం రిజర్వేషన్లు అవసరమని భూసాని వెంకటేశ్వరరావు ఏకసభ్య డెడికేషన్ సిఫారసు చేసింది. దీని ఆధారంగా ప్రభుత్వము విద్య, ఉద్యోగాలు స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు కృషి చేసింది. 50% పైగా రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు పరిమితులు న్యాయస్థానాల ఆదేశాలు అడ్డుగా నిలుస్తున్నాయి.

**సామాజిక న్యాయం కోసం నిరంతర పోరాటము అవసరము**

- ఓబీసీ జాబితాలో తెలంగాణకు చెందిన 40 కమ్యూనిటీలను చేర్చాలి.
- 2011 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక కులగణనలో అన్ని కులాల గణాంకాలను విడుదల చేయాలి.
- 2026సంవత్సరంలో జాతీయ జనగణలో భాగంగా ఓబిసి కుల గణన చేపట్టి వారి జనాభా నిష్పత్తి కనుగుణంగా 52% రిజర్వేషన్లు కల్పించేలా కేంద్ర ప్రభుత్వము ఒక నూతన చట్టాన్ని తేవాలి.
- కేంద్ర ప్రభుత్వ స్థాయిలో కేంద్ర ఓబిసి మంత్రిత్వ శాఖ ని ఏర్పాటు చేయాలి.
- కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లో సింహభాగం బీసీల సంక్షేమానికి కేటాయించాలి.
- మండల్ కమిషన్ సూచనలను పూర్తిగా అమలు చేయాలి.
- బిసి రిజర్వేషన్ల బిల్లు అమలుకు రాజ్యాంగ సవరణ చేపట్టి దానిని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలి.
- బీపీ మండల్ కు భారతరత్న అవార్డును ప్రకటించాలి. బీపీ మండల్ జయంతి రోజైన ఆగస్టు 25న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలి.
- ప్రొఫెసర్ J.R.సిలి చెప్పినట్లు ప్రజాస్వామ్యంలో ప్రజలందరి భాగస్వామ్యం ఉన్నప్పుడే అది నిజమైనా ప్రజాస్వామ్యంగా పరిడవిల్లుతుందని పేర్కొన్నారు.
- తెలంగాణలో బీసీలకు న్యాయమైన వాట కల్పించి సామాజిక న్యాయము సాధించడమే బి.పి మండల్‌కి మనమిచ్చే ఘన నివాళి అవుతుంది.

–డాక్టర్ శీలం యాదగిరి,

m : 94928 75705

ద

# మసులీపటాం ఇంగ్లీష్ కంపెనీ చీఫ్ ఇన్ కౌన్సిల్ కుమార్తె ఎలిజిబెత్ వివాహం

మొగల్ దర్బార్ సైన్యంలో సిపాయీగా పనిచేసిన 'నికోలో మనూచి' వ్రాసిన 'స్టోరియో డు మోగోర్' గ్రంథం క్రీ.శ. 1653-1708 మధ్యకాలంలో దేశంలో జరిగిన విషయాలు - విశేషాలను వివరిస్తుంది. 1656లో భారతదేశం వచ్చిన బ్రిటిష్ దేశస్థుడు 'నికోలో మనూచి', మొగల్ చక్రవర్తి 'దారాషుకోవ్' వద్ద ఫిరంగిదళం సభ్యుడిగా పనిలో కుదిరాడు. దరిమిలా మొగల్ చక్రవర్తి 'షాఆలం'తోపాటు, దక్షిణదేశం గోల్కొండ రాజ్యం మీదకు దండయాత్రలలో పాల్గొన్నాడు. మొగల్ సైన్యంలో పనిచేయటం ఇష్టంలేని మనూచి 'మాల్ఖేడ్' యుద్ధరంగంనుంచి తప్పించుకొని గోల్కొండచేరి సుల్తాన్ సైన్యంలో చేరాడు. 1686లో జరిగిన యుద్ధంలో గోల్కొండ సుల్తాన్ ఓడిపోయి, మొగల్ సైన్యం గెలిచిన మీదట, గోల్కొండ నుంచి గుర్రంమీద తప్పుకొన్న మనూచి మసులీపటాంచేరి రెండురోజులున్నాడు. కాని పట్టణం గురించిన రెండుమాటలు కూడా వ్రాయలేదు. షాఆలం ఉత్తర్వుల మేర మనూచీను పట్టుకోవటానికి గోల్కొండ సుల్తాన్, సైన్యాన్ని బందరుకు పంపాడు కాని మనూచి తప్పించుకొని మేనాలో మద్రాసు పారిపోయాడు. 'రాయల్ కంపెనీ ఆఫ్ ఫ్రాన్స్' డైరెక్టర్ జనరల్ ఫ్రాంకోన్ మార్టిన్ ఇచ్చిన సలహా మేరకు మనూచి 'మసులీపటాం ఈస్ట్ ఇండియా కంపెనీ' చీఫ్-ఇన్-కౌన్సిల్ కుమార్తె 'క్రిష్టవో ఇహర్డిలి' కుమార్తె కూతురు 'నేన్‌హెూర ఎలిజిబెత్'ను 1686, అక్టోబరు 28న వివాహం చేసుకున్నాడు. 1701-1702 మధ్యకాలంలో సంభవించిన రెండు ఉత్పాతముల గురించి మనూచి తన 'Storia Do Mogor' గ్రంథంలో నమోదు చేశాడు.



1701లో అక్టోబర్ నెల చివరిరోజుల్లో మసులీపటాంలో సంభవించిన తుఫాన్, సముద్రతీరపు 15 గ్రామాలను ముంచిందని, 1701 ప్రారంభంలో ఒక తోకచుక్క ఆకాశంలో కనపడిందని, ఆ తోకచుక్క దర్శనాంతరం తుఫాన్ సంభవించిందని, అంతకుముందు కూడా మరొక తోకచుక్క కనపడిందని తన పుస్తకంలో మనూచి సమాచారం నమోదు చేశాడు. రెండవ తోకచుక్క దర్శనం తరువాత జరిగిన ఉత్పాతం (ప్రమాదం) గురించి వ్రాస్తూ, 1702 'ఔరంగజేబు క్రింద పనిచేసిన రామ్‌గిరి సబేదారు 'మహమ్మద్ రిజాఖాన్' చక్రవర్తి మీద తిరుగుబాటు చేసి, మొగలాయిరాజ్యంలోని గోల్కొండ ప్రాంతాన్ని, మరియు గోల్కొండ - మసులీపటాం వరకువున్న రాజ్యాన్ని ధ్వంసంచేసి దోచుకున్నాడ'ని మనూచి రచన తెలియజేస్తుంది.

**బందరు ఆర్.పేట కట్టించిన అసిస్టెంటు కలెక్టరు - 1815:** "ఆ కాలమున (1816కు ముందు సంవత్సరములు) ఒక పార్వతమ్మ ఇవ్వవలసినయప్పు నెగవేయగా (అప్పు ఇచ్చిన) మరొక పార్వతి ఆమెను జంపించెను. అప్పుడు అసిస్టెంటు కలెక్టరుగా ఉన్న రాబర్డుసన్ గారీఖూనీలను, హత్యలను ఆపుటకై గవర్నమెంటు వారి వద్ద నుండి అనుమతిగైకొని పొదలన్నింటిని కొట్టించి, గోతులను మట్టిచేపూడ్పించి, తన స్వంత ధనము వెచ్చించి బజారులు ఏర్పాటు చేయ మొదలెట్టేను. ఆయన ప్రోత్సాహముతో కాంట్రీగుల (జమీందారు) వారు, బందరు నవాబుగారు, కోఠీవారు, అంకినీడు (చల్లపల్లి జమీందారు)గారు కొట్లు ననేకములు పంక్తులు తీర్చినట్లుగా కట్టించిరి. ఈశ్వరనామ సంవత్సర మాఘశుద్ధ విదియనాడు పండితులను రావించి శాస్త్రోక్తముగా మేళ తాళములతో రాబర్డుసన్‌గారు 'హుణ'దేశస్థులయినను పట్నము నందుగల వాత్సల్యముచే, శంఖుస్థాపన చేయించిరి." అని మచిలీపట్టణ చరిత్ర రచించిన శ్రీ చిట్టా బాలకృష్ణశాస్త్రిగారు - 1922 ప్రచురణలో తెలియపర్చినారు. 'రాబర్ట్‌సన్ 1816లో కలెక్టరు కాకమునుపు, బందరు డివిజన్‌కు అసిస్టెంటు కలెక్టరుగా కూడా పనిచేసినాడు.

**మచిలీపట్నంలో సిపాయీల తిరుగుబాటు-1780:** విశాఖపట్నం 1780 సిపాయీల తిరుగుబాటు, మచిలీపట్నం మీద గొప్ప ప్రభావం చూపింది. విశాఖ తిరుగుబాటుతో మచిలీపట్నం ఇంగ్లీషు కౌన్సిల్ ప్రధాన సభ్యుడు ఒకింత కలవరపాటుకు గురయ్యాడు. బందరు స్థానికంగా ఉన్న సైనిక కేంద్రానికి సిపాయీల తిరుగుబాటు వ్యాపించకుండా ఉండేందుకు, ఏమేమీ ముందస్తు చర్యలు తీసుకోవాలో ప్రతిపాదించమని మద్రాసు కంపెనీ ప్రభుత్వం మచిలీపట్నం కౌన్సిల్‌ను ఆదేశించింది. 'సాధారణ స్థానిక సిపాయీలతో పాటు యూరోపియన్ సైనికులను సమాన సంఖ్యలో మచిలీపట్నం సైనిక కేంద్రంలో నియమించేలా చర్యలు చేపట్టాల'ని బందరు కౌన్సిల్ ప్రధాన సభ్యుడు మద్రాసు గవర్నరును కోరాడు. 'ఉత్తరంగా వ్యాపించిన కంపెనీ రాజ్యంలో మచిలీపట్నం అతి ముఖ్యమైన పాత్ర పోషిస్తుందనీ, ఇక్కడ కంపెనీ సర్కారు ఖజానా సొమ్ము అధిక మొత్తంలో నిల్వ ఉన్నదనీ, అదికాక

ఇతరత్రా విలువైన నిల్వలున్నవని, సంపన్న వర్గాల, షావుకార్ల నివాస స్థలము కనుక ఇక్కడ తిరుగుబాటు జరక్కుండా వెంటనే ప్రతి చర్యలు తీసుకోవాలనీ' ఈస్ట్ ఇండియా కంపెనీ మచిలీపట్నం కౌన్సిల్ తీర్మానించి మద్రాసు కంపెనీ ప్రభుత్వానికి తమ నివేదిక పంపింది. ఆనాడు మచిలీపట్నం కౌన్సిల్ ఛీఫ్‌గా 'ఎడ్వర్డ్ కాట్‌స్‌ఫోర్డ్' ఉన్నారు. అంతకు ముందు కాలం అనగా 1769 నవంబరు నుండి 'అలెగ్జాండర్ వించ్' అనునాతడు మచిలీపట్నం కౌన్సిల్ ఛీఫ్‌గా ఉండి తన కౌన్సిల్ ఏరియాలో ఉన్న కొండపల్లి, ఏలూరు, రాజమండ్రి, బందరు మొదలుగా గల కోటల మరమ్మత్తులు, కొత్త నిర్మాణాల గురించి మద్రాసు ప్రభుత్వానికి నివేదిక పంపుతూ "అన్ని విధాలుగా మచిలీపట్నం కోట చాలా ముఖ్యమైనది, ఇక్కడ సైనికులను అధిక మొత్తంలో నిల్వ ఉంచవలసి ఉన్నది, ఏలూరు కోట యుద్ధానికి పనికి వచ్చేలా లేదు కనుక ఏలూరు నుండి యూరోపియను, సైనికులను వెంటనే మచిలీపట్నంకు బదిలీ చేయాల"నీ 15-06-1771న మద్రాసు కంపెనీ ప్రభుత్వానికి బందరు నుండి లేఖ వ్రాశాడు. బందరు కౌన్సిల్-ఇన్-ఛీఫ్ అలెగ్జాండర్ వించ్ దొర పేరు మీదగానే బెజవాడలో 'వించ్‌పేట' పుట్టింది.



విశాఖపట్నం సిపాయీల తిరుగుబాటు సందర్భంలో మచిలీపట్నం, బందరు కోటలో నిల్వయున్న సిపాయీలను సముద్రం మీదుగా బందోబస్తుకు మద్రాసు వెళ్ళమని స్థానిక కమాండరు ఆజ్ఞాపించగా, సైనికులు ధిక్కరించి ఇక్కడనే ఉండిపోయారు. బందరు సిపాయీల 'ఆజ్ఞాపాలన ఉల్లంఘన తిరుగుబాటు' విషయం 1780 సంవత్సరపు మచిలీపట్నం కౌన్సిల్ ప్రధాని 'డేనియల్' రికార్డు చేశాడు. ఉదయకాలంలో డేనియల్ బందరుకోటకు వచ్చీ రాగానే, స్థానిక కెప్టెన్ సెష్రీ, లెఫ్టెనెంట్ క్రాఫ్‌షర్ట్‌లు 'ఇక్కడున్న సిపాయీలు ఓడ ఎక్కటానికి నిరాకరించార'ని తెలియజేశారు. సైనికాధికారి 'జనరల్ స్టువార్ట్' ఆనాడు బందరు మీదుగా ప్రయాణిస్తుండటం వలన, బందరు సైనికులకు నచ్చచెప్పే పనిని అతనికప్ప చెప్పాడు కౌన్సిల్ ఛీఫ్. సైనిక జనరల్ సైనికులను ఒకచోట చేర్చి వారిపై ఉన్న స్థానిక అధికార్లతో మాట్లాడి తిరుగుబాటును అణచాలని చూచాడు. సైనికులు ఎవరిమాటా వినలేదు. మచిలీపట్నం కౌన్సిల్ ఛీఫ్ డేనియల్ కూడా సిపాయీలను 'వారంతట వారు వాలంటీరుగా ఎవరైనా ఓడ ఎక్కవచ్చు' అని చెప్పినా సిపాయీలు ఎవ్వరూ అందుకు ముందుకు రాలేదు. అప్పట్లో మద్రాసు కౌన్సిల్ గవర్నరుగా, (బందరు కౌన్సిల్ ఛీఫ్‌గా చేసిన) 'వైట్ హిల్' ఉన్నాడు. ఇతన్ని పరిపాలనకు పనికిరాడని ఎంచిన కలకత్తా ఈస్ట్ ఇండియా కంపెనీ గవర్నరు జనరల్ 'హేస్టింగ్స్', వైట్‌హిల్‌ను ఉద్యోగం నుండి సస్పెండ్ చేసి, కలకత్తా నుండి 'ఐయిర్‌కూట్' అనే సైనికాధికారిని మద్రాస్ సైనిక కమాండరుగా శాంతి భద్రతలు కాపాడమని పంపాడు. ఈ సందర్భంగా కలకత్తా నుండి మద్రాసుకు సముద్ర ప్రయాణం చేస్తూ ముందుకు సాగిన ఇతని సైన్యం, కోస్తా తీరంలోని ఇంగ్లీషు వారి మాట వినని చాలామంది జమీందారులను దారికి తెచ్చింది. గుంటూరు సర్కారు ఏరియా బసాలత్ జంగ్‌కు తిరిగి అప్పగించబడింది. కొండపల్లి, మచిలీపట్నం సైనిక కేంద్రాలను ఇంగ్లీషు కంపెనీ ప్రభుత్వం బలోపేతం చేయటమే కాక, ఇక్కడున్న సాయుధ బలగాలతో పాటు, కృష్ణానది ఒడ్డున ఉన్న శ్రీకాకుళం (ఆంధ్ర మహావిష్ణు) నది గట్టున ఆరు ఫిరంగులను 'ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కోవటాని'కి నెలకొల్పింది.

**బందరు చేనేత కార్మికుల సమ్మె-1768:** మచిలీపట్నం, మరియు చుట్టుప్రక్కల చేనేత పనిచేసే కార్మికులు, ఇంగ్లీష్ కంపెనీ నిమిత్తం నేత పని చేయటానికి 1768, జనవరి నెలలో తిరస్కరించి, సమ్మె చేశారు. కంపెనీ అధికారులు కార్మికులను తిరిగి పనిలోకి రమ్మని పిలిచినప్పుడు కార్మికులు వారి కోర్కెలు బయటపెట్టారు. తాము పనిచేసే నేత బట్టల మజూరీ సొమ్ము ముందుగా చెల్లించాలని, తమ బట్టల ఎగుమతి మీద కంపెనీ విధించిన కస్టమ్స్ సుంకం రద్దు చేయాలని కోరారు.

**బందరు నగర మార్కెట్లో తూనికలు - కొలతల శాఖ ఏర్పాటు - 1768:** ఇదే సంవత్సరం కంపెనీ ప్రభుత్వం 'రాబర్ట్ హగ్గిన్స్' అనే ఆంగ్లేయుడిని, బందరు నగర మార్కెట్టులో 'మార్కెట్ కార్యకలాపాలు గమనిస్తూ, వ్యాపారస్తులు కొలతలు, తూనికల్లో తేడాలు చేసిన సందర్భాలలో, నేరం జరిగినట్లు భావించిన పక్షంలో, కోర్టు శిక్షలు వేయటం ఆలస్యమవుతవి అని భావించిన కేసుల్లో వెంటనే ఫైను విధించటానికి అధికారిగా నియమించింది. తూనికలు, కొలతల విషయంలో నేరస్తులను దండించే వ్యవస్థ ఢిల్లీ సుల్తాను అల్లా ఉద్దీన్ ఖిల్జీ భారతదేశంలో ప్రథమంగా ప్రవేశపెట్టగా, ఆంధ్రదేశంలో ఇంగ్లీషు వారి పరిపాలనా కాలంలో 1768, డిసెంబరు 31వ తేదీన మచిలీపట్నంలో ప్రప్రథమంగా అమలు చేసినట్లు ఇంగ్లీషు కంపెనీ రికార్డులో నమోదయింది.

**బందరులో గోధుమ పంట సాగు:** గోర్డెన్ మెకంజీ వ్రాతలను బట్టి బందరులో 18వ శతాబ్దం నాటికి 400 ఎకరాలలో గోధుమ పంట సాగు చేసినట్లు తెలుస్తుంది. 18వ శతాబ్దం ప్రారంభం నాటికే నిజాంపట్నం పల్లపు తీరభూముల్లో (స్వాంప్)లో పెరిగే మడ అడవుల నుండి మడపుల్ల బందరు పట్టణ వాడకం నిమిత్తం వంట చెరుకుగా సరఫరా జరుగుతుండేది.

-మహమ్మద్ సిలార్
మెంబర్, ఇంటాక్ మచిలీపట్నం చాప్టర్, ఆంధ్రప్రదేశ్
m : 9985564946

# పేదల తిరుపతి కురుమూర్తి జాతర

గురుగుళ్ల నేతులు
గుమ్మడి కాయలు
తెత్తురే కురుమన్న నీ పూజకు....
కుమ్మరి కుండలు
మోదుగ దొప్పలు
తెత్తురే కురుమన్న నీ పూజకు....

అంటూ జానపదులు భక్తిగా పడుకునే పేదల దేవుడు కురుమూర్తి స్వామి!!

తెలంగాణ రాష్ట్రం ఉమ్మడి పాలమూరు జిల్లా ఆత్మకూరు సంస్థానం పరిధిలో అమ్మాపురం వద్ద ప్రతి ఏటా కార్తిక మాసంలో జరిగే పేరెన్నికయిన జాతరల్లో కురుమూర్తి జాతర ఒకటి. ప్రభుత్వ పర్యవేక్షణ, రాజకీయ జోక్యం, ఇతర రాష్ట్రాల నుండి భక్తుల ఆగమనం, జాతర స్థాయిని తెలియజెప్పుంది..



### ఏడు గుట్టలు

శేషాద్రి.... ఏకాద్రి..... కోటాద్రి... ఘనాద్రి... భల్లూకాద్రి... పతగాద్రి... దేవతాద్రి....

అనే ఈ ఏడు కొండలు తెలంగాణ రాష్ట్రం, పూర్వ పాలమూరు జిల్లా, ఆత్మకూరు సమీపంలో అమ్మాపురం వద్ద వెలసి ఉన్నాయి. ఈ కొండల సమూహాన్ని "ఆనందగిరులు" అంటారు.

శ్వేతాద్రి లేదా బొల్లిగట్టు,
ఏకాద్రి లేదా ఒంటిగట్టు,
కోటాద్రి లేదా కోటగట్టు,
ఘనాద్రి లేదా పెద్దగట్టు,
భల్లూకాద్రి లేదా ఎల్గులగట్టు,
పతగాద్రి లేదా చీపర్లగట్టు,

దేవతాద్రి లేదా దేవునిగట్టు. ఈ దేవరగట్టు మీద కాంచన గుహలో స్వామి కొలువై ఉంటాడు.

దేవతాద్రిని వ్యవహారంలో దేవరగట్టు అని పిలుస్తుంటారు. జానపదులు ద్యావరగట్టు అని పిలుస్తుంటారు.

### వెంకన్న అవతారం

దేవరగుట్ట పై భాగంలో మొదట్లో ఒక రాతిగుండు స్వామి వారి ప్రవేశ మార్గంగా ఉండేది. ప్రస్తుతం ఆధునీకరించారు. కురుమూర్తి, కురుమతి, కురుమన్న, అంటూ రకరకాలుగా పిలుచుకునే కురుమూర్తి స్వామి... సాక్షాత్తు ఆ వేంకటేశ్వరస్వామి అవతారంగా భక్తులు విశ్వసిస్తారు.

### అఖండ దీపం

ఆధ్యాత్మిక శోభతో ఈ గుట్టలు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రానికి తలమానికమై విలసిల్లుతున్నాయి. కార్తీకమాసంలో జాతర సందర్భంగా ఇక్కడ గట్టు కొనభాగాన వెలిగించే దీపం అత్యంత మహిమాన్వితం అయినది.

"ఘనమైన నీ దీపం ఢిల్లీకి వెలుగాయే"

వంటి పాటలు

ఈ అఖండ జ్యోతిపై వెలువడి ఊరూరా వినిపిస్తున్నాయి.

### చరిత్ర

దేవస్థానం సా.శ. 1268 లేదా 1292 తర్వాత ప్రాంతములో గోన బుద్ధారెడ్డి మిత్రుడైన ముక్కెర వంశ మూలపురుషుడు, రాజా గోపాలరెడ్డి నిర్మించినట్టుగా లభిస్తున్న చారిత్రక ఆధారాలు ద్వారా తెలుస్తున్నది. కాగా గోపాలరెడ్డి హయాంలో ఆలయం పెద్దగా వెలుగు చూడలేదు.

గోపాలరెడ్డి కుమారుడు చిన గోపిరెడ్డి సా.శ.1363 ప్రాంతంలో తన పాలనలో వివిధ అభివృది కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ఆలయం అభివృద్ధి పెద్దగా కొనసాగలేదని తెలుస్తున్నది.

చిన గోపిరెడ్డి తర్వాత పాలనకు వచ్చిన చంద్రారెడ్డి ఆలయాన్ని అభివృద్ధి పరిచి ఆలయ నిర్మాతగా చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకున్నాడు. కాగా ఈ విషయమై లభిస్తున్న చరిత్ర కొంత గందరగోళానికి తావు ఇస్తున్నది. ఎందుకంటే 1350లో చంద్రారెడ్డి ఆలయాన్ని అభివృద్ధి పరిచినట్టుగా సంస్థానాలు గురించి

సమగ్ర సమాచారం అందించిన తూమాటి దోణప్ప పేర్కొంటున్నారు. కాగా ఈ విషయమై విశ్లేషణ జరుపుకుంటే తండ్రి పాలనలోనే కుమారుడు తన ముద్రను చూపించి ఉండవచ్చు.

మూడవ అసఫ్ జాహి సికిందర్ జా (1803-1829), నాలుగవ అసఫ్ జాహి నాసిరుద్దౌలా (1829-1857) ఇద్దరి పాలనలో మనుగడ సాగించిన ముక్కెర వంశ వారసుడు రాజా వెంకటరెడ్డి 1810-1840 సం. మధ్య కాలంలో ఆలయ అభివృద్ధికి విశేష కృషి సలిపినట్టుగా తెలుస్తున్నది. ఇక్కడి ఆంజనేయ స్వామి ఆలయం ఇదే కాలంలో నిర్మితమైనట్టు భావిస్తున్నారు.



తర్వాత నాల్గవ అసఫ్ జాహి నాసిరుద్ద వౌలా పాలనా కాలం వాడయినా ముక్కెర వారసుడు రాజా సోమభూపాలరావు కొండపైకి మెట్లు నిర్మించాడు. ఏటా జాతర నిర్వహించే సాంప్రదాయం అమలులోకి తీసుకు వచ్చాడు.

ఆరవ అసఫ్ జాహి కాలంలో రాజా శ్రీ రాం భూపాల్ 1870-1878 మధ్య ప్రాంతంలో ఉద్దాల మండపం ఏర్పాటు చేశారు. ఉద్దాలు అనగా పాదరక్షలు అని అర్థం. ఇక్కడ నగారా బంగ్లా (నవత్ ఖాన బంగ్ల) వాద్యకారుల కోసం 1857-78 మధ్య కాలంలో నిర్మితమైనట్టు చెబుతున్నరు.. విశాలమైన ధర్మశాలను కూడా ఇదే కాలంలో నిర్మించినట్లు తెలుస్తున్నది. సీతారామ భూపాలుడే ఉత్సవాల సందర్భంగా నగారా బంగ్లాను ఉపయోగించేవారని కూడా తెలుస్తున్నది.

కురుమూర్తి అస్సలు పేరు కురుమతి అని పండితులు పేర్కొంటున్నారు. కురు అనగా 'చేయుట' అని, మతి అనగా 'తలుచుట' అని అర్థం. అంటే ఏది కోరినా చేసి పెట్టే తలంపు ఆ క్షేత్రానికి ఉన్నదని భావించవచ్చు. మొత్తానికి కాలక్రమంలో కురుమతి కురుమూర్తిగా చెప్పబడింది అని తెలుస్తున్నది. మూర్తీభవించిన రూపం అక్కడ కొలువైనది కాబట్టే 'కురుమూర్తి' గా చెప్ప బడి ఉండవచ్చు.



**కురుమూర్తిపై రచనలు**

కురుమూర్తి స్వామి గురించి బుక్కపట్టణం బుచ్చి వెంకటాచార్యులు, కపిలవాయి లింగమూర్తి, నరసింహ దీక్షితులు, వైద్యం వెంకటేశ్వరాచార్యులు వంటి కవి పండితులు తమ రచనలు అందించారు.

బుక్కపట్టణం బుచ్చి వెంకటాచార్యుల వారు 1854-61లో రచించిన "శ్రీ ఉత్తర వెంకటాచల మహత్యం" గ్రంథంలో కురు మూర్తి స్వామి వారి ప్రస్తావన ఉన్నది.

- 1850వ సంవత్సరంలో అజకొల్లు శేషకవి 'శ్రీ కురుమూర్తి క్షేత్రస్థల పురాణం' పద్యం రూపంలో రచించాడు.
- 1851-1905 మధ్య కాలంలో కృష్ణమాచార్యులు వారు కురుమూర్తి స్వామి సుప్రభాతాలు రచించారు.
- 1878లో నరసింహ దీక్షితులు రచించిన చెంచుకథలో 'దుర్వాస దిలీప సంవాదం' కథలో కురుమూర్తి స్వామి క్షేత్రానికి సంబంధించిన ఇక్కడి ఏడుకొండల ప్రస్తావన లిఖించబడింది.
- 1959లో వి.రామకృష్ణయ్య కవి కురుమూర్తి స్వామి భజన కీర్తనలు వెలువరించారు. వైద్యం వెంకటేశ్వరా చార్యులు.
- 1979లో శ్రీ కురుమూర్తిగిరినిలయ - లక్ష్మి వెంకటేశ్వర సుప్రభాతం రచించారు.
- 1983లో శ్రీ కురుమూర్తి శ్రీనివాస శతకం కంద పద్యాలుగా రచించారు.
- 1983లో "తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో 'శ్రీ కురుమూర్తి క్షేత్ర చరిత్రము'' పరిశోధనాత్మక గ్రంథం రచించారు.
- బెల్లం సాయిలు కురుమూర్తిస్వామి భజన కీర్తనలు ప్రచురించారు.
- ఉమ్మెత్తల నర్సింహమూర్తి కురుమూర్తి స్వామిని కీర్తించే అనేక జానపద గేయాలను సేకరించి ప్రచురించారు
- ప్రస్తుతం స్వామి వారి గురించి ఈ తరం కవులు రచయితలు పాటలు పద్యాలు రచిస్తున్నారు. దృశ్య మాలికలు తయారు చేస్తున్నారు.
- కురుమూర్తి ఆలయం గురించి ఎన్నో జానపద కథలు వ్యవహారంలో ఉన్నాయి. ఇవన్నీ తిరుపతి వేంకటేశ్వరస్వామి కుబేరుడి అప్పుల బాధను తట్టుకోలేక కురుమూర్తి గుట్టల్లోకి విశ్రాంతి కోసం వచ్చి... లక్ష్మీ సమేత తన ప్రతి రూపాన్ని గుట్టల్లో వదిలి, తిరిగి తిరుపతి వెళ్లిపోయాడని ఈ కథల సారాంశం.

స్థలపురాణం కూడా కురుమూర్తి స్వామి వెంకటేశ్వర అవతారంగా చెబుతున్నది. స్వామి స్వయంభూ అని కూడా చెబుతున్నది. ఈ క్రమంలో స్వామి వారి ఆనవాళ్లు కనుక్కుని పాలకులు గుడి కట్టి ఉండవచ్చు అని మనం భావించవచ్చు.

**ఆముక్తమాల్యదలో**

కురుమూర్తి అంటే వామనావతారం అని అర్థంలో కూడా మనం గమనించవచ్చు. వివరాల్లోకి వెళ్తే....

వామనుడే త్రివిక్రముడు. హిందూ పురాణాల ప్రకారం దశావతారాలలో ఐదవ అవతారం.

శ్రీకృష్ణ దేవరాయల వారి ఆముక్తమాల్యద మాలదాసరి కథలో శ్రీమహావిష్ణువును ''కురుం గుడి నంబి'' అని సంబోధించాడు. మూడడుగుల నేలను బలి చక్రవర్తిని దానం అడుగుతాడు. ఒక పాదం భూమిపై మోపి, ఒక పాదం ఆకాశాన్ని ఆక్రమించి, మూడోపాదం బలిచక్రవర్తిని తొక్కడానికి ఉపయోగించాడు. ఇక్కడ మహా విష్ణువు వారిది అది చాలా పెద్ద పాదం. ఈ ప్రకారం కురుమూర్తిలో ఉద్దాలు పేరుతో పెద్ద పరిమాణంలో పాదరక్షలు తయారు చేయడం జరుగుతుంది. ఆ విష్ణుమూర్తి పెద్ద పాదం కథ అలా సాగుతూ సాగుతూ మరుగున పడిపోయింది. ఇది కురుమూర్తి వామనుడు కథ,

**స్వామి ఉద్దాలోత్సవం**

కార్తీకమాసం బ్రహ్మోత్సవాలతో కురుమూర్తి జాతర ఆరంభం అవుతుంది. ఇందులో "ఉద్దాలోత్సవం" ప్రధాన ఘట్టం. ఈ ఉద్దాల ఉత్సవంలో స్వామివారి పాదుకలను కొత్త చేటలో ఉంచి ఉద్దాల మండపం వద్దకు తీసుకు వస్తారు. స్వామివారికి ఉద్దేశించిన పాదుకలను ఉద్దాలు అనడం ఆనవాయితీ.

ఈ నేపథ్యంలో కురుమూర్తి ఆలయంతో ఎరుకల కులస్తులకు దళితులకు విడదీయరాని అనుబంధం ఉన్నది.

- పల్లమర్రి గ్రామానికి చెందిన మేదర కులస్తులు ప్రత్యేక చాటను తయారు చేస్తారు. దీపావళి అమావాస్య రోజు చాట తయారీ ప్రారంభించి ఉత్సవం నాటికి పూర్తి చేసి దళితులకు భక్తి శ్రద్ధలతో అందజేస్తారు.
- వడ్డెమాన్ గ్రామంలో దళితుల సమక్షంలో ఆవు చర్మంతో స్వామి వారి పాదుకలను దళితులే తయారు చేస్తారు.

దీపావళి అమావాస్య రోజు నుంచి వారం రోజుల పాటు నియమ నిష్ఠలతో ఉపావాస దీక్షలతో ఉద్దాలు తయారు చేస్తారు. ఉత్సవాల సమయానికి చేటలో పాదుకలు ఉంచి ఊరేగింపుగా కురుమూర్తి దేవస్థానానికి తీసుకెళ్తారు. ఉద్దాల మండపంలో దళితులే అర్చకులుగా కొనసాగుతుంటారు.

**సిగాలు / పూనకాలు**

ఉద్దాలోత్సవంలో ఉద్దాల ఊరేగింపు పవిత్రమైన గొప్ప వేడుక. ఈ సందర్భంగా భక్తుల సిగాలు / పూనకాలు.. నృత్యాలు.. పరవశిస్తూ తన్మయత్వంతో పెట్టే కేకలు... ఇక్కడ కన్నుల పండుగై కనిపిస్తాయి.. వినిపిస్తాయి.

ఊరేగింపు తర్వాత పాదుకలను మండపంలో ఉంచుతారు. ఈ ఉద్దాల మండపాన్ని 1878లో రాజా శ్రీరాం భూపాల్ నిర్మించగా, 1999లో మరమ్మత్తులు చేశారు.

ఉద్దాలతో వీపుపై పాదుకలతో కొట్టించుకుంటే పాపాలు సమస్యలు కష్టాలు రోగాలు అడ్డంకులు తొలగి పోతాయని భక్తుల నమ్మకం.

**తలియకుండ ఆచారం**

కురుమూర్తి స్వామి సన్నిధిలోని మరో ఆచారం తలియకుండ ఆచారం. ఇది మట్టికుండ. అప్పంపల్లికి చెందిన కుమ్మరులు ప్రత్యేకంగా ఈ కుండని నియమ నిష్ఠలతో తయారుచేస్తరు. అనుకున్న సమయానికి 'తలియకుండ' ను ఆలయ లాంచనాలతో... ఉద్దాల మండపం వద్దకు చేరుస్తారు. నెల్లి వంశస్థులు ప్రత్యేక పూజలు పూజలు నిర్వహిస్తారు.

**బసివినిల భర్తగా**

ప్రస్తుతం సంఘ సంస్కరణల నేపథ్యలో ఈ ప్రాంతంలో నెలకొని ఉన్న 'బసివిని' ఆచారం తగ్గిపోయింది. కాగా ఒకప్పుడు మాదిగ తెగలు బసివి ఆచారం పాటిస్తూ కురుమూర్తి జాతర సమయంలో... తమ ఆడపిల్లలకు కురుమన్న పేరిట మాల దాసరి సమక్షంలో పెళ్ళి జరిపించేవారు. కురుమన్నను మొగుడిగా నిర్ణయించేవారు.

**దాసంగం**

స్వామి వారికి పెట్టే నైవేద్యాన్ని ఇక్కడ 'దాసంగం' అంటారు.



స్వామి వారికి దాసులై సమర్పించుకునే ఈ దాసంగంలో 'అన్నం – పచ్చి పులుసు 'లేదా 'పులగం' ప్రధానంగా ఉంటాయి. పులగం అంటే బెల్లంతో వండే అన్నం.


**ఇలవేల్పుగా**

ముక్కెర వంశ మూల స్తంభం గోపాల్ రెడ్డి కాలం నుండి, తెలంగాణ సంస్థానాలు భారతదేశంలో విలీనమయ్యే వరకు తమదైన అధికారాన్ని కాపాడుకుంటూ వచ్చిన రాణి భాగ్యలక్ష్మీ దేవి (1948) దాక మొత్తం 28 తరాల వారు అందరూ 'కురుమూర్తి స్వామి' ఆలయ అభివృద్ధికి కృషి చేసారు. ముఖ్యంగా స్వామి వారిని తమ ఇలవేల్పుగా ముక్కెర వంశస్తులు మాత్రమే కాదు, ఆ ప్రాంత ప్రజలు అందరూ కూడా కురుమూర్తిని తమ ఇలవేల్పుగా ఆరాధిస్తారు.

**తిరుపతి కురుమతి మధ్యపోలికలు**

తిరుపతికి కురుమూర్తి ఆలయాలకు మధ్య స్పష్టమైన

పోలికలు ఉన్నాయి. ప్రధానంగా తిరుమలలో మాదిరి ఇక్కడా వినాయకుడి విగ్రహం లేదు. ఏడు కొండల మధ్య దేవాలయం ఉంది. తిరుమల మెట్ల దారిపై శ్రీపాద చిహ్నాలు ఉన్నట్లుగానే ఇక్కడా ఉన్నాయి. కురుమూర్తి దర్శనానికి వెళ్తున్నప్పుడు తిరుపతిలో ఉన్నట్టు మోకాళ్ళ గుండు కూడా ఉన్నది. అలిపిరి మండపం పోలికలతో ఇక్కడ ఉద్దాల మండపం ఉన్నది. ఈ ఆలయం ఇన్ని విధాలుగా తిరుమల శ్రీ వేంకటేశ్వరుని ఆలయాన్ని పోలి వుండాటానికి చారిత్రక కారణం విశ్లేషిస్తే.. ముక్కెర వంశస్తులు



చంద్రగిరి వాస్తవ్యులు కావడం వలన, అక్కడి తిరుపతి పోలికలతో ఇక్కడ సరైన చోట ఆలయం నిర్మించుకుని ఉండవచ్చు. పురాణం ప్రకారం ఆలోచిస్తే వేంకటేశ్వరుడు తిరుపతిని పోలిన ప్రదేశాన్ని ఎంచుకుని ఉండవచ్చు. మొత్తానికి ఈ కురుమూర్తి క్షేత్రాన్ని పాలమూరు తిరుపతిగా కూడా పిలుస్తారు. పేదల తిరుపతి అనికూడా అంటారు.

### సంస్థానాధీశుల ఆభరణాలు

సంస్థానాధీశులు స్వామి వారికి 15వ శతాబ్దంలో బంగారు ఆభరణాలను సమర్పించారు. వీటిలో శంఖుచక్రికాలు, కిరీటం, మకర కుందనాలు, భుజ కిరీటాలతో సహా వివిధ ఆభరణాలు ఉన్నాయి.. నాటి నుండి నేటి వరకు ఆ ఆభరణాలను స్వామివారికి ఉత్సవాల సందర్భంగా అలంకరించడం ఆనవాయితీగా వస్తున్నది. మొదట్లో ఆభరణాలను సంస్థానాధీశుల బంగ్లాలోనే ఉంచేవారు. ఉత్సవాల సందర్భంగా రాజభవనం ముందున్న కొలనులో ఆభరణాలను శుద్ధి చేసి ప్రత్యేక పూజలు జరిపించి... ఏనుగు అంబారీపై స్వామివారి అలంకరణలను ఊరేగింపుగా వేడుకగా తీసుకు వెళ్ళి స్వామివారికి అలంకరించేవారు.

### దివ్య వాహనసేవలు

పది రోజుల పాటుగా వైభవంగా జరిగే బ్రహ్మోత్సవాలలో భాగంగా దేవీ సమేత స్వామి వారి ఉత్సవ మూర్తిని వివిధ వాహనాలపై ఊరేగిస్తారు.

**మొదటిరోజు** – మయూర వాహనసేవ

**రెండవరోజు** – హంస వాహనసేవ

**మూడవరోజు** – శేషవాహన సేవ

**నాలుగవరోజు** – గజవాహనసేవ

**ఐదవరోజు** – అశ్వ వాహన సేవ

**ఆరవరోజు** – హనుమద్వాహనసేవ

**ఏడవరోజు** – గరుడ వాహనసేవ

తర్వాత పుష్పయాగం ప్రత్యేక పూజలు ఉంటాయి.

### దేవాదాయశాఖలో

1968లో కురుమూర్తి ఆలయం రాష్ట్ర దేవాదాయ శాఖలో విలీనమైంది. ఫలితంగా 1976 నుంచి ఆభరణాలను ఆత్మకూరు బ్యాంకులోని ప్రత్యేక లాకర్‌లో భద్రపరుస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా నేటికిని ముక్కెర వంశస్థులు విచ్చేసి ఆభరణాల అలంకరణోత్సవంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు.

కురుమూర్తి స్వామి మహిమలు గురించి అనేక కథనాలు జనుల నోళ్ళల్లో వినబడుతుంటాయి. వివిధ నమ్మకాలను భక్తులు పాటిస్తుంటారు.

నమో నమః

**ఆధారాలు:**

- ఆంధ్రసంస్థానాలు – సాహిత్యం
- పాలమూరు జిల్లా సంస్థానాలు
- తెలంగాణ తీర్థయాత్రలు

–డా. తంగెళ్ళ శ్రీదేవిరెడ్డి
m : +91 85558 95827

ద

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com



## ఎల్‌నినోతో అత్యధికంగా ప్రభావితమయ్యే దేశాలలో

# భారతదేశం కూడా ఒకటి: FAO

ఎల్‌నినో వర్షాధార పంటలకు ముప్పు పొంచి ఉండటంతో, అత్యధికంగా ప్రభావితమయ్యే దేశాలలో భారత్ కూడా ఉందని FAO పేర్కొంది.

వాతావరణ తీవ్రతలు ఇప్పుడు ఆహార అభద్రత, సంఘర్షణ, బలహీనమైన ఎదుర్కొనే సామర్థ్యంతో ఢీకొంటున్నందున, ఈ ఎల్‌నినో మరింత తీవ్రంగా దెబ్బతీయవచ్చు.

నైరుతి రుతుపవనాల తొలి వారాల్లో భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో ఇప్పటికే వర్షపాతం లోటు నమోదైంది.

అధికారులు పంట నష్టాలు, రైతుల ప్రత్యామ్నాయాలు మరియు దిగుమతి అవసరాలను అంచనా వేస్తున్నందున, భారతదేశం 196 ప్రాధాన్యతా జిల్లాలను గుర్తించింది.

ఎల్ నినో వచ్చేసింది. ఈ సంవత్సరం చివర్లో 'సూపర్' ఎల్ నినో వచ్చే అవకాశం పెరుగుతోందని అంచనాలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో, వ్యవసాయ కరువుకు అత్యంత ఎక్కువగా గురయ్యే దేశాలలో భారతదేశం కూడా ఉందని ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార మరియు వ్యవసాయ సంస్థ (FAO) ఒక కొత్త విశ్లేషణలో వెల్లడించింది.

ఇది గత ఎల్ నినోల వంటిది కాదు. భూగోళం వేడెక్కింది. సంఘర్షణలు మరియు ఆహార అభద్రత విస్తృతంగా వ్యాపించాయి. అత్యంత ప్రమాదంలో ఉన్న ప్రాంతాలకు దీనిని తట్టుకునే సామర్థ్యం చాలా తక్కువగా ఉంది.

భారతదేశంలో ఖరీఫ్ నాట్లు వేసే కాలంలో ఈ హెచ్చరిక వెలువడింది. ఈ సమయంలో వరి, మొక్కజొన్న వంటి పంటలు నైరుతి రుతుపవనాలపై ఎక్కువగా ఆధారపడి ఉంటాయి. ఎల్ నినో భారతదేశంలోని చాలా ప్రాంతాలలో వేసవి రుతుపవనాలను బలహీనపరిచి, కీలకమైన పెరుగుదల కాలంలో వర్షాధార పంటలను ఒత్తిడికి గురిచేస్తుందని FAO తెలిపింది.

భారత వాతావరణ శాఖ (IMD) ఉపయోగించిన వర్గీకరణల ప్రకారం, జూన్ 1 నుండి 22 మధ్య, భారతదేశంలోని సగం ప్రాంతాల్లో లోటు వర్షపాతం (అంచనా వేసిన సాధారణం కంటే -20% నుండి -59% తక్కువ) నమోదు కాగా, దాదాపు పావు వంతు ప్రాంతాల్లో భారీ లోటు వర్షపాతం (అంచనా వేసిన సాధారణం కంటే -60% నుండి -99% తక్కువ) నమోదైంది.

FAO తన వ్యవసాయ ఒత్తిడి సూచిక వ్యవస్థ నుండి 41 సంవత్సరాల ఉపగ్రహ డేటా ఆధారంగా చేసిన విశ్లేషణ, ఆసియా అంతటా – పాకిస్తాన్, భారతదేశం నుండి మయన్మార్, థాయ్‌లాండ్, కంబోడియా, వియత్నాం మీదుగా, ఇంకా తూర్పున ఫిలిప్పీన్స్, ఇండోనేషియా, తైమూర్-లెస్టే వరకు, అధిక కరువు ప్రమాదం

ఉన్న ఒక విస్తృత ప్రాంతాన్ని గుర్తించింది.

సహేల్, దక్షిణ ఆఫ్రికా మరియు మధ్య అమెరికాలతో పాటు, ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడిన నాలుగు అధిక-ప్రమాద ప్రాంతాలలో దక్షిణ మరియు ఆగ్నేయాసియా ఒకటి.

### వర్షాధార పంటలకు ప్రమాదం

ఎల్ నినో అనేది భూమధ్యరేఖ పసిఫిక్ మహాసముద్రంలో సంభవించే ఎల్ నినో సదరన్ ఆసిలేషన్ దృగ్విషయం యొక్క సాధారణం కంటే వెచ్చని దశ. వాణిజ్య పవనాలు బలహీన పడినప్పుడు ఇది సంభవిస్తుంది. దీనివల్ల మధ్య మరియు తూర్పు పసిఫిక్‌లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఈ అసాధారణమైన వెచ్చని ఉష్ణోగ్రతలు, తూర్పు మరియు మధ్య పసిఫిక్ మహాసముద్రంలో బాష్పీభవనం, తేమ పేరుకుపోవడం మరియు వర్షపాతం ద్వారా వర్షపాత సరళిని మార్చగలవు. అదే సమయంలో ఆస్ట్రేలియా, మారిటైమ్ కాంటినెంట్‌పై వర్షపాతాన్ని అణచివేస్తాయి.




భూమధ్యరేఖ పసిఫిక్‌పై ఎల్ నినో పరిస్థితులు నెలకొని ఉన్నాయని, నైరుతి రుతుపవన కాలంలో ఇవి మరింత బలపడతాయని ఐఎమ్‌డి తెలిపింది. మాన్‌సూన్ మిషన్ కపుల్డ్ ఫోర్‌కాస్ట్ సిస్టమ్ అంచనాలు కూడా రుతుపవనాల సమయంలో ఇవి మరింత బలపడతాయని సూచిస్తున్నాయి. ఎల్ నినో వరి, మొక్కజొన్న వంటి వర్షాధార పంటలను ఒత్తిడికి గురిచేయగలదని FAO హెచ్చరిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడిన నాలుగు అధిక-ప్రమాద ప్రాంతాలలో సాహెల్, దక్షిణ ఆఫ్రికా మరియు మధ్య అమెరికాలతో పాటు దక్షిణ మరియు ఆగ్నేయాసియా కూడా ఒకటి. ఈ ప్రాంతానికి ఎదురయ్యే ముప్పు కేవలం దేశీయ ఆహార భద్రతకు మాత్రమే పరిమితం కాదు.

2015-16 మరియు 2023-24 ఎల్ నినో సంఘటనల సమయంలో అవే ప్రాంతాలలో చాలా వరకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కేవలం 2015-16లోనే, ఎల్ నినో ప్రభావితమైన 60 మిలియన్లకు పైగా ప్రజలకు సహాయం అందించడంతో పాటు, 23 దేశాలలో 5 బిలియన్ డాలర్ల మానవతా విజ్ఞప్తులను ప్రేరేపించిందని FAO తెలిపింది.

### దుర్బలత్వపు భౌగోళిక శాస్త్రం

2015లో, చివరి అత్యంత బలమైన ఎల్ నినో ప్రభావం చూపినప్పుడు, ప్రధాన ఆసియా ఉత్పత్తి దేశాలన్నింటిలో మొక్కజొన్న, వరి ఉత్పత్తి పడిపోయింది. దీనివల్ల కీలక ఆహార పంటల ధరలు పెరిగి, ప్రపంచ మార్కెట్లలో దాని ప్రభావం పడింది.

ప్రపంచంలోనే అతిపెద్ద వరి ఉత్పత్తిదారులలో, ఎగుమతిదారులలో ఒకటైన భారతదేశం ఇప్పటికే సంక్షోభంలో ఉంది. అత్యధిక ప్రమాదం ఉండే అవకాశం ఉన్న 196 ప్రాధాన్యతా జిల్లాలను గుర్తించింది. వ్యవసాయ మంత్రిత్వ శాఖ, భారత వ్యవసాయ పరిశోధన మండలి, సామాజిక-ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య శాఖల అధికారులతో కూడిన బహుళ మంత్రిత్వ శాఖల టాస్క్ ఫోర్స్, ఎల్ నినో ప్రధాన పంటలను ఎలా ప్రభావితం చేస్తుంది, రైతులు ఏ ప్రత్యామ్నాయాలకు మారవచ్చు, దేశీయ సరఫరాలు తగ్గిపోతే భారతదేశం ఎక్కడి నుండి సరుకులను దిగుమతి చేసుకోవచ్చు అనే అంశాలపై కూడా ఒక అంచనాను సిద్ధం చేస్తోంది.

పరిస్థితి మరింత దిగజారగల ఇతర ప్రాంతాలు సహేల్ ప్రాంతం, నమీబియా, బోట్స్‌వానాలతో కూడిన దక్షిణ ఆఫ్రికా, అంగోలా, జాంబియా, జింబాబ్వే, దక్షిణాఫ్రికా, ఇంకా మొజాంబిక్ మరియు మడగాస్కర్‌లోని కొన్ని భాగాలు. ఇక్కడ వ్యవసాయ కరువు సంభవించే సంభావ్యత 50 శాతానికి పైగా ఉందని FAO అంచనా వేస్తోంది.

ప్రస్తుతం భూమధ్యరేఖ పసిఫిక్ మహాసముద్రంపై ఎల్ నినో పరిస్థితులు నెలకొని ఉన్నాయి. నైరుతి రుతుపవన కాలంలో ఇవి మరింత బలపడతాయని అంచనా వేయబడింది. మాన్‌సూన్ మిషన్ కపుల్డ్ ఫోర్‌కాస్ట్ సిస్టమ్ (MMCFS) నుండి వచ్చిన అంచనాలు నైరుతి రుతుపవన కాలంలో ఎల్ నినో పరిస్థితులు మరింత బలపడతాయని సూచిస్తున్నాయి.

### వేడెక్కుతున్న ప్రపంచంలో అధిక ప్రమాదాలు

వాతావరణ తీవ్రతలు, సంఘర్షణలు, ఆర్థిక ఒత్తిళ్లు ఒకదానితో ఒకటి ఎక్కువగా ఢీకొంటున్నందున, ఈసారి ప్రమాదాలు ఎక్కువగా ప్రతికూలంగానే ఉన్నాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. "ఇది గత ఎల్ నినోల వంటిది కాదు. ఈ రోజు భూమి చాలా వేడిగా ఉంది. సంఘర్షణలు మరియు ఆహార అభద్రత విస్తృతంగా వ్యాపించి ఉన్నందున, ఈ కొత్త దశ ఇప్పటికే బలహీనంగా ఉండి, పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యం పరిమితంగా ఉన్న ప్రాంతాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది," అని FAO సహజ వనరుల అధికారి జార్జ్ అల్వార్-బెల్ట్రాన్ అన్నారు.

వ్యవసాయంపై కరువు ప్రభావాలలో 80 శాతానికి పైగా అల్ప, మధ్య-ఆదాయ దేశాలలోనే సంభవిస్తాయని అంచనా వేయబడింది. "ఒక రైతు మొదట పంటలను, ఆ తర్వాత పశువులను, దానితో పాటు తన మొత్తం జీవనోపాధిని కోల్పోవచ్చు," అని ఆల్వార్-బెల్ట్రాన్ అన్నారు. "అనేక సంక్షోభాల పర్యవసాన ప్రభావాలు ఇప్పటికే స్పష్టంగా కనిపిస్తున్నందున, ముందుగానే చర్యలు తీసుకోవాల్సిన తక్షణ అవసరం ఎంతైనా ఉంది."

-షగున్

*(డౌన్ టు ఎర్త్ వెబ్‌సైట్ నుంచి)*

# "ప్రతిభావంతుల పెంపకంలో వెనుకబడి వున్నామా!"

"What makes a child gifted and talented may not always be good grades in school, but a different way of looking at the world and learning".

*-Chuck Grassley*

పిల్లల్ని పెంచడం అంత సులువైన విషయం కాదు. అందునా తెలివైన పిల్లలతో ఏగడం మరీ కష్టం.

శారీరక ఎదుగుదలకు కావాల్సిన ఆహారం ఇవ్వడంలో చూపినంత చొరవ పిల్లల మనోవికాసానికి అవసరమైన ఆలోచనలు ఇవ్వడంలో తల్లిదండ్రులు ఎప్పుడూ వెనకబడే ఉంటారు. దీనికి కారణం జనరేషన్ గ్యాప్. పిల్లలకు చిన్న వయసులో ఆలోచించే శక్తి ఉండదు. వయసు పెరిగే కొద్దీ ఆలోచనలు అవే వస్తాయనేది పాతకాలపు ఆలోచన. మేధస్సు కేవలం ఐక్యూ ద్వారానే నిర్ణయించే సాంప్రదాయ భావనకు భిన్నంగా, ప్రముఖ మనస్తత్వ శాస్త్రవేత్త హొవార్డ్ గార్డినర్ బహుళ మేధస్సుల సిద్ధాంతాన్ని జ్ఞానరంగం ముందుంచాడు. ఈయన తెలివి తేటలు, మేధస్సు ప్రకారం పిల్లలను ఎనిమిది రకాలుగా అభివర్ణించాడు. 'ఫ్రేమ్స్ ఆఫ్ మైండ్: ది థియరీ ఆఫ్ మల్టిపుల్ ఇంటెలిజెన్స్ (1983)' అనే ప్రసిద్ధ గ్రంథంలో పిల్లల బహుముఖీన ప్రతిభను వివరంగా ఉదాహరించాడు. సాధారణంగా పిల్లల తెలివిని చదువు, మార్కులను బట్టి అంచనా వేస్తుంటాం. కానీ గార్డనర్ తన 'సహజ పరిశీలన (Naturalistic Observation) 'సిద్ధాంతం ద్వారా ప్రతి బిడ్డలోనూ విభిన్నమైన తెలివితేటలు ఉంటాయని నిరూపించారు. చేపను చెట్టు ఎక్కమంటే అది జీవితాంతం తనను తాను చేతగాని దానిగానే భావిస్తుంది. అలాగే, విద్యార్థిని కేవలం మార్కుల కొలమానంలోనే చూస్తే వాళ్లలోని అసలైన మేధస్సు మరుగున పడిపోతుంది. హోవార్డ్ గార్డినర్ సిద్ధాంతం మనకు నేర్పే పాఠం ఒక్కటే. పిల్లలు ఎంత తెలివైనవారనేది ముఖ్యం కాదు, ఏ రంగంలో' తెలివైనవారనేదే ముఖ్యం. పిల్లల్లో దాగున్న ఆ ఎనిమిది రకాల ప్రత్యేక శక్తులను గుర్తించి మార్కుల రేసులో కొట్టుకుపోకుండా చూడటం, సహజ ప్రజ్ఞకు రెక్కలు తొడిగి చేరుకోగల శిఖరాలకు ప్రోత్సహించే దిశగా పేరెంట్స్ ఆలోచించాలి.



పిల్లలు తెలివైనవారైనంత మాత్రాన, చదువులో రాణించినంత మాత్రాన తల్లిదండ్రులకు ఏ దిగులు ఉండదు అనుకోవడం పొరపాటు. తమ పిల్లలు ప్రతిభావంతులు అత్యంత తెలివైనవాళ్లు కావాలని తల్లిదండ్రులు కలగనడం సహజం. ప్రతిభావంతులైన పిల్లలు ఉన్న కుటుంబాల్లో పెద్దలు అనేక సవాళ్లను ఇబ్బందులను ఎదుర్కొంటున్నారనేది గమనార్హం.

ప్రతిభావంతులైన పిల్లలను పెంచడంలో ఎదురయ్యే సవాళ్లను గుర్తించి, పరిష్కారాలను సూచిస్తూ ఆ కుటుంబాలకు మద్దతు ఇవ్వడం విద్యావేత్తల కర్తవ్యం. అట్లాగే ప్రతిభావంతులైన పిల్లలతో సమాజం కూడా ఎట్లా నడచుకోవాలో చెప్పడం, గిఫ్టెడ్ చిల్డ్రన్‌గా జన్మించిన పిల్లలను మరింత ప్రోత్సహించడమే జాతీయ ప్రతిభావంతులైన పిల్లల పెంపకం వారోత్సవాల ముఖ్యోద్దేశం. ఈ కార్యక్రమంలో మొదటిది ప్రతిభావంతులైన పిల్లలు ఎదుర్కొనే సవాళ్లను అర్థం చేసుకోవడం. ప్రతిభావంతులైన పిల్లలను పెంచడం ఆనందదాయకమే అయినప్పటికీ, ఈ పిల్లల కుటుంబాలు ఎదుర్కొనే ఇబ్బందులు అనేకం ఉంటాయి. చాలా సందర్భాల్లో ప్రతిభావంతులైన పిల్లల విద్యా అవసరాలు వాళ్ల భావోద్వేగ సామర్థ్యాలను మించి ఉంటాయి. దీనివల్ల వాళ్ల వయస్సుకు తగిన అభ్యసన సామగ్రి, పుస్తకాలు,బోధకులు వగైరా అందుబాటులో ఉండాలి. ప్రతిభావంతులైన పిల్లలు తమ తోటివారితో సరిగ్గా కలిసిపోలేని పరిస్థితులు ఉంటాయి. వీళ్లు ఇతరుల కంటే ముందున్నప్పటికీ, ప్రత్యేకంగా ఉన్నారనే కారణంతో మిగతా విద్యార్థులచే ఎగతాళికి హేళనకు గురవుతుంటారు. ప్రతిభావంతులైన పిల్లలు తమకు ఎదరయ్యే సవాళ్లను ఎదుర్కొంటున్న క్రమంలో తరచుగా విసుగు, ఉత్తేజరాహిత్యం, నిరాసక్తతకు లోనవుతారు. ఇది చివరకు చదువు పట్ల అయిష్టతకు, ప్రతికూల భావోద్వేగ ప్రతిస్పందనలకు దారితీస్తుంది.

"Gifted children are like sports cars. They have high-performance engines, but they require a skilled driver and a safe track to reach their full potential. అంటాడు రాబర్ట్ ఎల్. కాప్లాన్. అనేక విషయాల్లో పరిజ్ఞానం ఉండటాన ప్రతిభావంతులైన పిల్లలు ఎల్లప్పుడూ ఉత్సాహంగా, చురుకుగా ఉంటారు. కాప్లాన్ చెప్పినట్టు వాళ్లను నడిపించే సామర్థ్యంగల గురువులుండాలి. సరైన మెంటార్ లేకపోతే సహించలేరు. పట్టుదలతో, పరిపూర్ణతను కోరుకునేవారుగా, అధికారాన్ని తీవ్రంగా సవాలు చేసేవారిగా కూడా వీళ్లు మారిపోతారు.

అంటే, వారు తరచుగా వాదనలో ముందుండి, లొంగిపోయే వాళ్లలో చివరివాళ్లుగా ఉంటారు. స్పోర్ట్స్ కార్ లాంటి మీ పిల్లల అపారమైన మేధోశక్తిని అణచివేయకుండా, సరైన దిశలో మళ్లించడం చాలా ముఖ్యం. వాళ్లు ప్రతిదానినీ ప్రశ్నిస్తున్నప్పుడు లేదా వాదిస్తున్నప్పుడు కోపం చేయకుండా, వాళ్లలోని జిజ్ఞాసను అర్థం చేసుకోవాలి. వాళ్ల ఆలోచనలకు తగిన మేధోపరమైన వాతావరణాన్ని ఇంట్లోనే కల్పించాలి. పర్ఫెక్షనిజం వల్ల వారు ఒత్తిడికి లోనవ్వకుండా, ఓటమిని కూడా సహజంగా తీసుకునేలా మానసిక స్థైర్యాన్ని ఇవ్వాలి. అన్నింటికంటే ముఖ్యంగా, వాళ్ల ప్రతిభ తప్పుదారి పట్టకుండా నడిపించగలిగే సరైన మెంటార్‌ను పరిచయం చేయాలి. ఇందుకు అవసరమైన పుస్తకాలు మనకు అందుబాటులో ఉన్నాయి. వేణు భగవాన్ రచించిన 'అమ్మ నాన్న ఓ జీనియస్!', ప్రముఖ సైకాలజిస్ట్ సుధీర్ సాండ్రా రాసిన 'బాల్యం అమూల్యం', రష్యన్ విద్యావేత్త ఎ.ఎస్. మకారెంకో రాసిన 'అమ్మా నాన్నలకు', ప్రముఖ విద్యావేత్త జాన్ హోల్ట్ రాసిన 'How Children Learn', జేమ్స్ టి. వెబ్ రాసిన 'A Parentųs Guide to Gifted Children', జుడీ గాల్‌బ్రెయిత్ రాసిన 'The Survival Guide for Gifted Kids' లాంటి అవగాహనా గ్రంథాలు అద్భుత సమాచారాన్ని అందిస్తాయి.




హొవార్డ్ గార్డనర్ పిల్లల్లోని మేధాశక్తిని 1. భాషా సంబంధ మేధస్సు (Linguistic Intelligence), 2. తార్కిక-గణిత మేధస్సు (Logical-Mathematical Intelligence), 3. దృశ్య-స్థాన సంబంధ మేధస్సు (Spatial Intelligence), 4. శారీరక-కదలికల మేధస్సు (Bodily-Kinesthetic Intelligence), 5. సంగీత సంబంధ మేధస్సు (Musical Intelligence), 6. వ్యక్త్యంతర మేధస్సు (Interpersonal Intelligence), 7. వ్యక్తి అంతర్గత మేధస్సు (Intrapersonal Intelligence), 8. ప్రకృతి సంబంధ మేధస్సు (Naturalistic Intelligence)గా పేర్కొంటూనే, తొమ్మిదవదిగా అస్తిత్వ మేధస్సును గురించి ఊహలు చేశాడు. భాషా సంబంధ మేధస్సుగల విద్యార్థులకు పదాలను, భాషను సమర్థవంతంగా ఉపయోగించే సామర్థ్యం ఉంటుంది. వీరు మాట్లాడటం, రాయడం, కథలు చెప్పడం వంటి వాటిలో భాషను వైవిధ్యంగా ఉపయోగిస్తుంటారు. వీరు కవులు, రచయితలు, జర్నలిస్టులు, వక్తలుగా రూపొందే అవకాశం ఉంటుంది. తార్కిక-గణిత మేధస్సుగల పిల్లలకు సమస్యలను తార్కికంగా ఆలోచించడం, సంఖ్యలను, శాస్త్రీయ అంశాలను విశ్లేషించే సామర్థ్యం ఉంటుంది. లెక్కలు చేయడం, నమూనాలను (జ్యామితీయం) గుర్తించడం, శాస్త్రీయ పరిశోధనలపై ఆసక్తి కలిగి ఉంటారు. వీరు శాస్త్రవేత్తలు, గణిత శాస్త్రజ్ఞులు, ఇంజనీర్లు, టెక్నోక్రాట్స్‌గా రూపొందే అవకాశం ఉంటుంది.

దృశ్య-స్థాన సంబంధ మేధస్సుగల విద్యార్థులకు వస్తువులు, స్థలాలను దృశ్య రూపంలో ఊహించుకుని అవగాహన చేసుకునే సామర్థ్యం ఉంటుంది. దిశలను గుర్తించడం, చార్టులు/మ్యాప్‌లను అర్థం చేసుకోవడం, డిజైన్ చేయడంలో వీళ్లు నిపుణులు. శిల్పులు, చిత్రకారులు, ఆర్కిటెక్ట్‌లు, పైలట్లుగా ఈ తరహా విద్యార్థులు మారగలరు. శారీరక-కదలికల మేధస్సుగల విద్యార్థుల్లో శారీరక కదలికలను నియంత్రిస్తూ, వస్తువులను నైపుణ్యంతో ఉపయోగించే సామర్థ్యం ఉంటుంది. శారీరక సమతుల్యత, చురుకుదనం, చేతి పనులు చేయడంలో వీళ్లు ముందుంటారు. క్రీడాకారులు, నృత్యకారులు, సర్జన్లు (వైద్యులు), నటులు వీళ్లలోంచే వస్తారు. సంగీత సంబంధ మేధస్సుగల విద్యార్థులు సంగీత స్వరాలు, లయలు, రాగాలను ఆలాపించగలరు. వీళ్లు పాటలు పాడగలరు, సంగీత వాయిద్యాలు వాయించగలరు, స్వరకల్పన చేయగలరు. ప్రోత్సహిస్తే వీరు సంగీత దర్శకులు, గాయకులు, వాద్యకారులుగా రూపొందుతారు.

వ్యక్త్యంతర మేధస్సున్న పిల్లలకు ఇతర వ్యక్తుల భావాలను, ఉద్దేశాలను, ప్రవర్తనను అర్థం చేసుకుని వారితో సత్సంబంధాలను కొనసాగించగల సామర్థ్యం ఉంటుంది. వీరు ఇతరులతో సులభంగా కలిసిపోతారు మరియు వీరిలో నాయకత్వ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. వీరు ఇతరులకు కౌన్సెలింగ్ ఇవ్వగలరు. భవిష్యత్తులో వీరు నాయకులు, ఉపాధ్యాయులు, సైకాలజిస్టులు, సేల్స్ మెన్‌గా రాణించగలరు. వ్యక్తి అంతర్గత మేధస్సుగల పిల్లలు తమ గురించి తాము పూర్తిగా అవగాహన కలిగి ఉంటారు. తమ బలాలు, బలహీనతలు, భావోద్వేగాలు, లక్ష్యాల పట్ల వీరికి స్పష్టత ఉంటుంది. తత్వవేత్తలు, రచయితలు, ఆధ్యాత్మిక గురువులుగా వీళ్లు గుర్తింపు పొందగలరు. ప్రకృతి సంబంధ మేధస్సున్న చిన్నారులు ప్రకృతిని, పరిసరాలను, చెట్లు, జంతువులను, పక్షులను అర్థం చేసుకుని వాటితో మమేకం కాగలరు. వాతావరణ మార్పులను గుర్తించడం, మొక్కల పెంపకం, జంతువుల ప్రవర్తనను అర్థం చేసుకోవడంలో వీళ్లు నిష్ణాతులు. వీరు మంచి రైతులుగా, జీవశాస్త్ర వేత్తలుగా, పర్యావరణ వేత్తలుగా, అటవీ అధికారులుగా నిర్ణాయక పాత్ర పోషించగలరు. గిఫ్టెడ్ పిల్లల అసాధారణ సామర్థ్యాలను గుర్తించి, వాటిని సరైన దిశలో ప్రోత్సహించడం అనేది తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఉమ్మడి బాధ్యత. ఈ పిల్లలకు కేవలం విద్యాపరమైన సవాళ్లు మాత్రమే కాకుండా, వారి భావోద్వేగాలను అర్థం చేసుకునే సున్నితమైన వాతావరణం కూడా అవసరం. వీరిని ఇతరులతో పోల్చకుండా, వారి ప్రత్యేకతను గౌరవిస్తూ, ఒత్తిడి లేని అభ్యాస అనుభవాలను అందించాలి. పాఠశాల, ఇల్లు పరస్పర సమన్వయంతో పనిచేసినప్పుడే, ఈ పిల్లలు తమ పూర్తి స్థాయి మేధో సామర్థ్యాలు ప్రతిబింబించే స్థానాలకు ఎదగగలరు. ప్రతిభాసంపత్తిని విస్తరిస్తూ ప్రజలకు దేశానికి తమ తమ రంగాల్లో అద్భుతమైన సేవలు అందిస్తూ భవిష్యత్తరాలకు మార్గదర్శకులుగా నిలబడగలరు.

- ప్రొఫెసర్ బెల్లి యాదయ్య
m : 9848392690
e: dr.bellipoet@gmail.com



# బాలచెలిమి

పిల్లల వికాస పత్రిక

## ప్రచురణలు



**46 పుస్తకాల ధర రూ.2320 • తగ్గింపు ధర రూ. 2100**

### తెలంగాణ బడి పిల్లల కథలు

10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300



### పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)

10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



### చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు

18 పుస్తకాల ధర రూ.950 • తగ్గింపు ధర రూ. 850



పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు – ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

–మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

**చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ**
హైదరాబాద్ (Regd. 720/1982)

**Account Details :**
Account Name : Bala Chelimi
Bank Name : Canara Bank
A/c. No. : 30101010003714
Branch : Ashoknagar, Hyderabad.
IFSC Code : CNRB0013010

**ప్రతులకు**

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88

SCAN & PAY

email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com

DECCAN LAND,
ISSN 2581-3188

Telugu Monthly Magazine Date of Publication 26th - August 2026
Postal Dates: 28th & 29th Every Month
Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyderabad-01.

PRGI Regn. No. TELTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2024-2026

VOL 15వ వసంతంలో
169 ISSUES నూట అరవై తొమ్మిదవ సంచిక
పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్



దక్కన్ ల్యాండ్

## పదనాల్గు వసంతాల ప్రస్థానం...

తెలంగాణ ఉద్యమ కాలంలో ఆవిర్భవించిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక 2026 సెప్టెంబర్ సంచికతో 169 నెలలు పూర్తి చేసుకుంది. ఈ కాల వ్యవధిలో తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చేసి, పునర్నిర్మాణ అవసరాన్ని చాటి చెప్పేందుకు 'దక్కన్‌ల్యాండ్' ఇప్పటి వరకు వెలువడిన సంచికలను (2012, 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020, 2021, 2022, 2023, 2024, 2025) సంకలనాలుగా (12 నెలలకు ఒక సంకలనంగా) రూపొందించి పాఠకుల కోరిక మేరకు అందిస్తున్నాం. భవిష్యత్తులో కూడా వచ్చే సంచికలను సంకలనాలుగా తీసుకు వస్తామని తెలియ జేస్తున్నాం. ఆసక్తి కలవారు ఒక్కో సంకలనాన్ని రూ.400-లకు పొందవచ్చు (పార్శిల్ ఛార్జీలు అదనం).




**సంకలనాలు పొందేందుకు మా చిరునామా:**

ఎడిటర్, 'దక్కన్‌ల్యాండ్'
"చంద్రం" 3-6-712/2, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288
Email: desk.deccan@gmail.com
Website: www.deccanland.com

'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక
వార్షిక చందా : రూ. 300/-

ఒక సంవత్సరం బైండింగ్
పుస్తకం : రూ. 400/-

TELANGANA RESOURCE CENTRE

**ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుకోసం:**

NAME : DECCAN LAND
BANK : KOTAK MAHINDRA BANK
ACCOUNT NO : 7111218829
IFSC CODE : KKBK0000555
BANK CODE : 000555
MICR CODE : 500485007

Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana, Ph : 90599 50055

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar